జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, ఏడ్వర్టైజ్‌మెంట్ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989894528

కృష్ణ | ఆదివారం 10 మే 2026 | సంపుటి : 01 | సంచిక :106 | పేజీలు : 12 | వెల : 3/- | PRGI No. APTEL/26/A0119,

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com



## గుంటూరు డివిజన్‌కు కొత్త హంగులు

- రూ.22.42 కోట్లతో కంట్రోల్ ఆఫీస్
- రైల్ల రద్దీకి చెక్ పెడుతూ గుంటూరులో అత్యాధునిక కంట్రోల్ భవనానికి గ్రీన్ సిగ్నల్
- రాబోయే ఐదేళ్లలో దక్షిణ కోస్తా రైల్వేలో కీలక హబ్‌గా మారనున్న గుంటూరు డివిజన్

## రెవెన్యూ పాత రికార్డులన్నీ డిజిటలీకరణ



- భూసమస్యల పరిష్కారంలో మెరుగైన పనితీరు
- నెల్లూరు జిల్లాలో పైలట్ ప్రాతిపదికన తక్కువ ఖర్చుతో రికార్డుల డిజిటలీకరణ పూర్తి
- ఏఐ ఆధారంగా విశ్లేషించి భూ సమస్యలకు త్వరగా పరిష్కార మార్గాలు చూపాలనే యోచన
- కలెక్టర్ల సదస్సులో ప్రజంటేషన్

**అమరావతి**

రాష్ట్రంలో రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోంది. భూ వివాదాలను తగ్గించడం, పారదర్శకతను పెంచడం, భూ రికార్డులను సురక్షితంగా ఉంచడమే దీని ప్రధాన ఉద్దేశ్యం. రాష్ట్రంలోని రెవెన్యూ పాత రికార్డులు అన్నీ ప్రస్తుతం డిజిటలీకరిస్తున్నారు. భూ సంబంధిత వివాదాలకు త్వరితగతిన పరిష్కార మార్గాలను చూపనున్నారు. ఇందుకుగానూ డిజిటలీకరణ చేసిన డేటా ఉపయోగించి ఏఐ ద్వారా విశ్లేషించాలని యోచిస్తున్నారు. నెల్లూరు జిల్లాలో పైలట్ ప్రాజెక్టు విజయవంతం అయ్యింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా పాత రికార్డుల డిజిటలైజేషన్ జరుగుతోంది. నెల్లూరు జిల్లాలో పైలట్ ప్రాతిపదికన తక్కువ ఖర్చుతో రికార్డుల - మిగతా3లో



## తదుపరి సీడీఎస్‌గా లెఫ్టినెంట్ జనరల్ రాజా సుబ్రమణి

- నేవీ చీఫ్‌గా వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్
- నూతన చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ఎన్ ఎస్ రాజా సుబ్రమణిని నియామకం
- నేవీ చీఫ్‌గా వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ నియమించిన ప్రభుత్వం



## పార్టీలను చీల్చడానికే ఈడీ, సీబీఐ దాడులు

- బీజేపీపై కేజ్రీవాల్ ఫైర్
- పంజాబ్ మంత్రి సంజీవ్ అరోరా నివాసంలో ఈడీ దాడులు
- రాజకీయ నేతలను బెదిరించి బీజేపీలో చేర్చడమే ఈ దాడుల ఉద్దేశం
- అరవింద్ కేజ్రీవాల్ ఆరోపణలు

## ఏపీకి 'అల్పపీడన' ముప్పు



- బంగాళాఖాతంలో వాయుగుండం
- ఆ జిల్లాల్లో వర్షాలు
- శ్రీలంకకు దక్షిణంగా ఉపరితల ఆవర్తనం
- ఈ నెల 12 లేదా 13వ తేదీల్లో అల్పపీడనం ఏర్పడే ఛాన్స్
- అది కాస్తా వాయుగుండంగా మారే అవకాశం ఉందన్న స్కైమెట్ సంస్థ

**అమరావతి**

వేసవి ఎండలతో అల్లాడుతున్న ప్రజలకు వాతావరణ శాఖ కీలక అప్‌డేట్ ఇచ్చింది. బంగాళాఖాతంలో వాతావరణం వేగంగా మారుతోంది. సముద్రంలో కదలికలు మొదలయ్యాయి. శ్రీలంకకు దక్షిణ భాగంలో శుక్రవారం ఓ ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో రానున్న రోజుల్లో నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. ఈ అల్పపీడనం క్రమంగా బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ సంస్థ 'స్కైమెట్' అంచనా వేసింది. దీని కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో భారీ మార్పులు చోటు చేసుకోనున్నట్లు తెలిపింది. ఓ వైపు ఎండలు మండుతుండగానే, మరోవైపు రానున్న మూడు నాలుగు రోజుల పాటు పలు జిల్లాల్లో వర్షాలు పడే అవకాశం ఉంది. ప్రస్తుతం బంగాళాఖాతంలో పరిస్థితులు అస్థిరంగా ఉన్నాయి. శుక్రవారం నాటికి శ్రీలంకకు దక్షిణ భాగంలో - మిగతా3లో

## ప్రభుత్వ ఏర్పాటుకు లైన్ క్లియర్

- టీవీకేకు వీసీకే, ఐయూఎల్ మద్దతు
- మెజారిటీ మార్క్ దాటేసిన విజయ్
- టీవీకేకు మద్దతిస్తూ లేఖ ఇచ్చిన వీసీకే నేత తిరుమావళవన్
- వీసీకే మద్దతుతో 118కి చేరిన విజయ్ పార్టీ టీవీకే బలం
- ఆదివారం సీఎంగా విజయ్ ప్రమాణస్వీకారం





## బంగాల్‌లో 'సువేందు' శకం

- బీజేపీ తొలి సీఎంగా ప్రమాణం
- బంగాల్ నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సువేందు అధికారి
- హాజరైన ప్రధాని మోదీ, ఎన్డీఏ పాలిత రాష్ట్రాల సీఎంలు

## మనందరి తొలి శత్రువు బీజేపీనే

- బీజేపీని ఎదుర్కోవడానికి అన్ని ప్రాంతీయ పార్టీలు ఏకం కావాలి
- టీఎంసీ అధినేత్రి, మాజీ సీఎం మమతా బెనర్జీ
- పశ్చిమ బెంగాల్‌లోని అన్ని ప్రతిపక్ష పార్టీలు ఒక ఉమ్మడి వేదిక కింద ఏకం కావాలి
- బీజేపీని వ్యతిరేకిస్తున్న విద్యార్థి సంఘాలు, ఎన్జీవోలు కూడా బీజేపీకి వ్యతిరేకంగా ఏకం కావాలి



## కడపలో 'అల్మాస్‌పేట' సర్కిల్ వివాదం

- ఇరు వర్గాల రాళ్ల దాడులు, పోలీసులకు గాయాలు
- అల్మాస్‌పేట సర్కిల్ పేరు మార్పుపై చెలరేగిన వివాదం
- టిప్పు సుల్తాన్ పేరు పెట్టాలని ఓ వర్గం, హనుమాన్ కూడలిగా పేరు పెట్టాలని మరో వర్గం
- రెండు వర్గాలు పరస్పరం రాళ్ల దాడులు



**కడప**

కడప నగరంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. నగరంలోని అల్మాస్ పేట కూడలికి టిప్పు సుల్తాన్ పేరు పెట్టాలని ఓ వర్గం ఫ్లెక్సీని ఏర్పాటు చేసేందుకు యత్నించింది. మరోవైపు ఈ సర్కిల్‌కు హనుమాన్ కూడలిగా పేరు పెట్టాలని మరో వర్గం కొంత కాలంగా పట్టుబడుతోంది. ఈ నేపథ్యంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. - మిగతా3లో



## గోవాలో రివర్స్ క్రైమ్... విదేశీయుల నేరాలపై షాకింగ్ రిపోర్ట్!

- గోవాలో విదేశీయులు బాధితులుగా కన్నా నిందితులుగా ఉన్న కేసులే ఆరు రెట్లు ఎక్కువ
- 2022-2024 మధ్య 206 కేసుల్లో విదేశీయులు నిందితులుగా నమోదయ్యారు
- మాదకద్రవ్యాలు, వీసా గడువు ఉల్లంఘన వంటి కేసులే అధికంగా ఉన్నాయి
- నైజీరియా, రష్యా, నేపాల్ సహా పలు దేశాల పౌరులపై కేసులు నమోదు
- అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారి కోసం ప్రత్యేక డిటెన్షన్ సెంటర్ ఏర్పాటు

## రబీలో రూ.4,410 కోట్ల ధాన్యం కొనుగోలు

- 24 గంటల్లోనే నిధులు చెల్లింపు
- మంత్రి నాదెండ్ల మనోహర్
- 24 గంటల్లో 94% చెల్లింపులు
- ధాన్యం కొనుగోలులో కొత్త రికార్డు
- ఎన్టీఆర్ జిల్లాలో 140% అదనపు ధాన్యం సేకరణ



**అమరావతి**

రాష్ట్ర రైతుల ఇబ్బందులను గుర్తించి కేంద్రం పెద్ద మనసు చాటుకుంది. 8 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ సేకరణకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో రైతన్నలకు ఊరట లభించింది. రబీలో రూ.4,410 కోట్ల ధాన్యం కొని 24 గంటల్లోనే 94% నిధులు రైతుల ఖాతాల్లో జమ చేయడం చారిత్రాత్మక రికార్డు అని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రాష్ట్రంలోని రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బాయిల్డ్ రైస్ కొనుగోలు చేయాలని కేంద్రాన్ని కోరగా, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రాష్ట్రం నుంచి 8 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ సేకరించేందుకు కేంద్రం ఆమోదం తెలిపిందని వెల్లడిస్తూ కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. - మిగతా3లో

# గుంటూరు డివిజన్‌కు కొత్త హంగులు



ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతమైన గుంటూరు రైల్వే డివిజన్ ముఖచిత్రం మారబోతోంది. దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లో విలీనమవుతున్న ఈ డివిజన్‌లో ఆదాయం వచ్చే మార్గాలను కోల్పోవడం, పరిధి తగ్గిపోవడం వంటి సమస్యలు ఉన్నప్పటికీ పెరుగుతున్న రైళ్ల రద్దీ, కొత్త ప్రాజెక్టులను దృష్టిలో పెట్టుకొని రైల్వేశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. గుంటూరు డీఆర్ఎం కార్యాలయ ప్రాంగణంలో రూ.22.42 కోట్ల అంచనా వ్యయంతో సరికొత్త కంట్రోల్ ఆఫీస్ భవన నిర్మాణానికి రంగం సిద్ధమైంది. నిధుల కేటాయింపు ప్రాధాన్యం: ఇటీవల ప్రకటించిన రైల్వే బడ్జెట్‌లో ఈ భవన నిర్మాణానికి అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. ప్రస్తుతం ఉన్న నియంత్రణ గదులు సరిపోకపోవడం, సాంకేతికంగా పాతబడటంతో ఆధునికీకరణ అనివార్యమైంది. దీంతో ఈ కొత్త ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యతగా రైల్వే అధికారులు భావిస్తున్నారు. భవిష్యత్తులో రైళ్ల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉండటంతో అత్యాధునిక సౌకర్యాలతో కంట్రోల్ ఆఫీస్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

**అన్ని విభాగాలు ఒకేచోట**

గుంటూరు డీఆర్ఎం కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు కానున్న ఈ కంట్రోల్ ఆఫీసులో ఆపరేషన్స్ కంట్రోల్, ఎలక్ట్రికల్ అండ్ సిగ్నలింగ్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సెల్ వంటి కీలక విభాగాలను ఏర్పాటు చేయనున్నట్లు రైల్వేశాఖ వర్గాలు తెలిపాయి. రైళ్ల రాకపోకలను వేగవంతం చేయడం, ప్రయాణికుల భద్రతను మరింత పెంపొందించడం దీని ఏర్పాటు ప్రధాన ఉద్దేశం. ఇప్పటికే భవన నమూనా, ఇతర సాంకేతిక అంశాలపై ఇంజినీరింగ్ విభాగం కసరత్తు చేస్తోంది. టెండర్ల ప్రక్రియ ముగిసిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి.

**దక్షిణ కోస్తాలో కీలక హబ్‌గా**

రాబోయే ఐదేళ్లలో గుంటూరు డివిజన్ దక్షిణ కోస్తా రైల్వేలో కీలకమైన హబ్‌గా మారనున్న నేపథ్యంలో ఈ కంట్రోల్ ఆఫీసు ఆ మార్పునకు పునాది కానుందని అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. నూతన భవనంలో అత్యాధునిక సిగ్నలింగ్ వ్యవస్థ, రియల్ టైమ్ రైలు పర్యవేక్షణ పరికరాలు, మెరుగైన కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీంతో రైళ్ల నిర్వహణ మరింత సమర్థంగా జరగడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో తక్షణం స్పందించే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

**గుంటూరు డివిజన్ పరిధిలో రాబోయే కాలంలో:**

అమరావతి రైల్వేలైను: నవ్యాంధ్ర రాజధాని అమరావతిని అనుసంధానిస్తూ కొత్త రైల్వేలైను పనులు వేగవంతం చేయడంపై అధికారులు దృష్టి పెడుతున్నారు. ఈ లైన్ పూర్తయితే గుంటూరు ప్రాధాన్యత మరింత పెరుగుతుంది.

**నడికుడి – శ్రీకాళహస్తి ప్రాజెక్టు**

ఈ కీలకమైన లైను అందుబాటులోకి వస్తే, రాయలసీమ, చెన్నై వైపు వెళ్లే రైళ్లకు గుంటూరు ప్రధాన జంక్షన్‌గా మారుతుంది. దీంతో రద్దీ అనేక రెట్లు పెరిగే అవకాశం ఉంది. సాంకేతిక ఆధునికీకరణ: ప్రస్తుత కంట్రోల్ రూమ్‌లో స్థలం, సాంకేతిక వసతులు సరిపోవడం లేదు. కొత్త భవనంలో ఆటోమేటిక్ సిగ్నలింగ్, జీపీఎస్ ఆధారిత రైలు ట్రాకింగ్ వంటి అత్యాధునిక వ్యవస్థలు ఏర్పాటు చేస్తారు. ఈ నేపథ్యంలో గుంటూరు డివిజన్‌ను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు రైల్వే వర్గాలు పేర్కొంటున్నాయి.

# ఏపీకి 'అల్పపీడన' ముప్పు

-మొదటిపేజీ తరువాయి


ఒక ఉపరితల ఆవర్తనం ఆవరించింది. ఇది క్రమంగా బలపడుతోంది. దీని ప్రభావంతో సముద్రంలో మార్పులు వేగవంతం అయ్యాయి. ఈ నెల (మే) 12 లేదా 13వ తేదీ నాటికి భూమధ్య రేఖను ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో ఒక అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది. ప్రముఖ వాతావరణ పరిశోధనా సంస్థ 'స్కైమెట్' ఈ మేరకు కీలక ప్రకటన చేసింది. ఈ అల్పపీడనం అక్కడితో ఆగిపోదు. అది మరింతగా బలపడి తీవ్రమైన వాయుగుండంగా మారనుందని స్కైమెట్ అంచనా వేసింది. ఈ వాయుగుండం ఏ దిశగా పయనిస్తుంది? ఎక్కడ తీరం దాటుతుంది? అన్న వివరాలపై మరో మూడు రోజుల్లో పూర్తి స్పష్టత రానుంది.

**మంగళవారం వరకు వానలు!**

సముద్రంలో అల్పపీడనం ముప్పు ఒకవైపు ఉంటే ద్రోణి ప్రభావం మరోవైపు రాష్ట్రాన్ని కలవరపెడుతోంది. కొమొరిన్ ప్రాంతం నుంచి కర్ణాటక, రాయలసీమ, తమిళనాడు రాష్ట్రాల మీదుగా మధ్యప్రదేశ్ వరకు ఒక ద్రోణి విస్తరించి ఉంది. సముద్ర మట్టానికి సుమారు 0.9 మీటర్ల ఎత్తులో ఈ ద్రోణి స్థిరంగా కొనసాగుతోంది. ఈ ద్రోణి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణం ఒక్కసారిగా చల్లబడనుంది. వచ్చే మంగళవారం వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుందని అధికారులు తెలిపారు. కేవలం మేఘాలే కాదు, పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిక జారీ చేసింది.

**నిప్పులు చెరిగిన భానుడు**

గత కొద్ది రోజులుగా వర్షాలు పడుతున్నప్పటికీ, ఎండల తీవ్రత మాత్రం తగ్గలేదు. శుక్రవారం పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. వైఎస్ఆర్ కడప జిల్లాలో అత్యధికంగా 40.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత



నమోదైంది. జనం ఉక్కపోతతో అల్లాడిపోయారు. నంద్యాల జిల్లా పాణ్యం ప్రాంతంలో 40.7 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డ్ అయింది. అలాగే, పోలవరం జిల్లా పరిధిలోని వీఆర్‌పురంలో 40.6 డిగ్రీల మేర ఎండలు దంచికొట్టాయని అధికారులు వెల్లడించారు.

పలుచోట్ల వర్షపాతం నమోదు : ఓవైపు ఎండలు మండుతుంటే ద్రోణి ప్రభావంతో మరికొన్ని జిల్లాల్లో వానలు కురిశాయి. శుక్రవారం రాష్ట్రంలో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లాలోని నర్సీపట్నంలో అత్యధికంగా 16.2 మిల్లీమీటర్ల (మి.మీ) వర్షపాతం నమోదైంది. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో 12 మి.మీ వర్షం కురిసింది. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో కూడా 12 మి.మీ వర్షపాతం రికార్డ్ అయింది. ఉప్పుమాగులూరు ప్రాంతంలో 10.5 మి.మీ మేర వర్షం కురిసిందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.

**ఈ జిల్లాలకు వర్ష సూచన!**

వారాంతంలో పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శని, ఆదివారాల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా, పోలవరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో వర్షాలు పడే అవకాశం ఉంది.

## వైసీపీ ప్రచార అస్త్రంగా వర్మ

**కాకినాడ :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి సరైన అస్త్రం దొరికింది. పిఠాపురం వర్మపై టిడిపి వేటు వేయడంతో.. ఇక వైసిపి సోషల్ మీడియాకు చేతినిండా పని దొరికింది. ఇప్పటికే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కూటమిలో విచ్ఛిన్నం తెచ్చేందుకు చేయని ప్రయత్నం అంటూ లేదు. కానీ ఆ ప్రయత్నాలు ఏవి ఫలించలేదు. అయితే గతంలో వైసిపి అధికారంలో ఉన్నప్పుడు కొంతమంది ఎమ్మెల్యేలు ధిక్కార స్వరం వినిపించారు. ఇప్పుడు అదే పరిస్థితిని తెచ్చి కూటమిలో విభేదాలు తెచ్చేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు సహజంగానే చేస్తుంది. ఇప్పటికే కృష్ణ జిల్లాలో ఒకరు లైన్ దాటి మాట్లాడుతున్నారు. పిఠాపురంలో సైతం వర్మ అలానే వ్యవహరిస్తున్నారు.. తాను కచ్చితంగా గెలిచే నియోజకవర్గం అనే ఆవేదన ఆయనలో ఉంటుంది. అది సహజం కూడా. అయితే డిప్యూటీ సీఎం గా పవన్ కళ్యాణ్ ఉన్నారు. కూటమి మరో 15 ఏళ్ల పాటు కొనసాగుతుంది కూడా. ఇటువంటి సమయంలో సహకరించాల్సింది పోయి వర్మ స్వతంత్రంగా ముందుకు వెళ్తున్నారు. ఆయన కోణంలో అది తప్పు లేదు కానీ.. కూటమిపరంగా మాత్రం ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. అందుకే టిడిపి నాయకత్వం వర్మపై వేటు వేసినట్లు తెలుస్తోంది.పిఠాపురం నియోజకవర్గం కావాలా? లేకుంటే మంచి రాజకీయ భవిష్యత్తు కావాలా? అని టిడిపి హై కమాండ్ వర్మను కోరినట్లు తెలుస్తోంది. మూడు రోజుల కిందట వర్మ నారా లోకేష్ ను ప్రత్యేకంగా కలిశారు. ఆ తరువాత ఇప్పుడు వర్మను తొలగిస్తూ పర్యవేక్షణకు గాను ముగ్గురు సభ్యులతో కూడిన టిడిపి కమిటీని ఏర్పాటు చేశారు. కచ్చితంగా వర్మకు చెప్పి.. ఒప్పించి మరి ఆయనను తప్పించి ఉంటారన్న అనుమానాలు అంచనాలు ఉన్నాయి. అయితే ఇప్పుడు వైసీపీ అనుకూల మీడియా కచ్చితంగా వర్మకు జరిగిన అన్యాయం పై డిబేట్ పెడుతుంది. టిడిపికి వ్యతిరేకంగా ప్రచారం కూడా చేయిస్తుంది.వాస్తవానికి గతంలోనే వర్మ వైసీపీలోకి వెళ్లిపోతారన్న ప్రచారం పతాక స్థాయిలో జరిగింది. కూటమి అధికారంలోకి రాగానే వర్మకు ఎమ్మెల్సీ పదవి ఇస్తారని అప్పట్లో హామీ ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. అయితే అధికారంలోకి వచ్చి నెలలు సంవత్సరాలు దాటుతున్న ఆయనకు ఎటువంటి పదవి లేకుండా పోయింది. దీంతో ఆయనలో అసహనం పెరిగిపోయిందని.. పదవి రాకుండా పవన్ కళ్యాణ్ అడ్డుకుంటున్నారని.. అందుకే వర్మ వైసీపీలో చేరిపోతారని లేనిపోని ప్రచారం సాగింది. అయితే ఇప్పుడు ఒకటి మాత్రం స్పష్టంగా తెలుస్తుంది. ఇదివరకే రాష్ట్ర కార్యవర్గంలోకి వర్మను తీసుకున్నారు. లోకేష్ ను కూడా వర్మ కలిశారు. ఆ తరువాత ఇంచార్జ్ పోస్టును తీసేసారు. వర్మ పిఠాపురం బాధ్యతలనుంచి తప్పుకుంటే కీలక పదవి కట్టబెట్టే హామీ లభించి ఉంటుంది అనేది పొలిటికల్ వర్గాల్లో ప్రచారం. త్వరలో వర్మను ఎమ్మెల్సీ చేస్తారని కూడా ఒక టాక్ ఉంది. అయితే టిడిపి ఇన్చార్జిగా మరో అధికార కేంద్రంగా పిఠాపురంలో మారకూడదని భావించి.. ఆయన అనుమతితోనే పదవి నుంచి తొలగించి ఉంటారన్న విశ్లేషణలు కూడా ఉన్నాయి. అయితే వర్మకు పదవి తొలగించిన తర్వాత ఆయన స్పందించిన తీరుబట్టి ఒక అంచనాకు రావచ్చు.

**వర్మ తొలగింపు**

రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం జరిగింది. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ పదవి నుంచి వర్మను కలిగిస్తూ హై కమాండ్ నిర్ణయం తీసుకుంది. గత కొద్ది రోజులుగా జరుగుతున్న పరిణామాలతోనే తెలుగుదేశం పార్టీ నాయకత్వం ఈ నిర్ణయానికి వచ్చింది. వర్మను తొలగించి.. టిడిపి పర్యవేక్షణ బాధ్యతలను ముగ్గురు నేతలతో కూడిన కమిటీకి అప్పగించింది. వర్మ వ్యక్తిగత వ్యవహార శైలి కూటమి సమన్వయానికి విఘాతం కలిగిస్తున్న నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కూటమి విషయంలో ఇప్పటికే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తన పార్టీ శ్రేణులకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ వచ్చారు. ఇప్పుడు అదే పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో టిడిపి నుంచి కూటమికి ఇబ్బంది రాకుండా ఉండేందుకుగాను.. వర్మ పై వేటు వేసింది టిడిపి నాయకత్వం.మొన్నటి ఎన్నికల్లో పిఠాపురం నియోజకవర్గాన్ని పొత్తుల భాగంగా జనసేనకు కేటాయించారు. అయితే తెలుగుదేశం పార్టీకి ఇది బలమైన నియోజకవర్గం. అందుకే వర్మ నేతృత్వంలోని టిడిపి శ్రేణులు అభ్యంతరం తెలిపాయి. కానీ చంద్రబాబు చొరవ తీసుకొని ఒప్పించడంతో పవన్ గెలుపు కోసం కృషి చేశారు వర్మ. అంతవరకు ఓకే కాని ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత.. వర్మ వైఖరిలో స్పష్టమైన మార్పు కనిపించింది. పిఠాపురం నియోజకవర్గంలో ఆధిపత్యం కోసం ఆయన గట్టి ప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలో జనసేన నేతలతో ఘర్షణ వైఖరి అనుసరించారు. మొన్ననే జనసేన మాజీ ఎమ్మెల్యే దొరబాబుతో వీధి పోరాటానికి దిగారు. కేవలం ఉద్దేశపూర్వకంగా ప్రోటోకాల్ పేరుతో వర్మ ఘర్షణ వైఖరి అనుసరిస్తున్నారు అని టిడిపికి నివేదికలు అందాయి.కూటమి విషయంలో ఇబ్బందులకు గురి చేస్తే ఎంతటి వారిపైనైనా చర్యలు ఉంటాయని స్పష్టమైన సంకేతాలు పంపింది టిడిపి నాయకత్వం. మొన్నటి ప్రోటోకాల్ రగడ తర్వాత వర్మకు రాష్ట్ర కార్యవర్గంలో చోటు దక్కింది. దీంతో వర్మ విషయంలో టిడిపి నాయకత్వం చూసి చూడనట్టుగా వెళుతుందని ఒక అభిప్రాయం ఏర్పడింది.

## కడపలో 'అల్మాస్‌పేట' సర్కిల్ వివాదం

-మొదటిపేజీ తరువాయి

పోలీసులు పెద్ద ఎత్తున మోహరించినా, రెండు వర్గాలు పరస్పరం రాళ్లతో దాడులకు దిగాయి. ఈ ఘటనలో తాలూకా సీఐ నరసింహ రాజు తలకు గాయం అయింది. మరో ఇద్దరికి రాళ్లు తగిలాయి. గాయపడిన సీఐని ఆసుపత్రికి తరలించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు భూపేష్ రెడ్డి, పుత్తా నరసింహారెడ్డి తదితరులు ఇరువర్గాలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా పరిస్థితిలో మార్పు రాలేదు. దీంతో పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించి, లాఠీఛార్జి చేశారు. కడపలో పురాతన కాలం నుంచి అల్మాస్‌పేట కూడలి ఉండేది. ఇటీవల దాన్ని టిప్పు సుల్తాన్ కూడలిగా మార్చాలని అక్కడున్న ఓ వర్గం వారు ప్రతిపాదన సిద్ధం చేశారు. అంతేగాక టిప్పు సుల్తాన్ ఫ్లెక్సీలను కూడా ఏర్పాటు చేశారు. కానీ టిప్పు సుల్తాన్ బదులు హనుమాన్ కూడలి ఏర్పాటు చేయాలని మరో వర్గం వారు పట్టుబడ్డారు.

**భారీగా మోహరించిన పోలీసులు**

ఈ నేపథ్యంలో రేపు (ఆదివారం) హనుమాన్ ర్యాలీ దృష్ట్యా అల్మాస్?పేట కూడలి వద్ద జెండాలు ఏర్పాటు చేశారు. దీంతో ఓ వర్గంవారు అక్కడికి చేరుకున్నారు. మరో వర్గం వారు రోడ్డుపై బైఠాయించారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. పోలీసులు ఇరు వర్గాల వారికి నచ్చజెప్పినప్పటికీ వినలేదు. ఇరు వర్గాలు నువ్వా నేనా అన్నట్లుగా మోహరించారు. దీంతో భారీగా మోహరించిన పోలీసులు రెండువైపులా వారిని అదుపు చేశారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో భారీగా పోలీసు బలగాలను మోహరించారు.

ప్రస్తుతం అల్మాస్‌పేటలో పరిస్థితిని చక్కదిద్దేందుకు పోలీసులు రెండు వర్గాలతో చర్చిస్తున్నారు. అలాగే భారీ సంఖ్యలో బలగాలను మోహరించి, పరిస్థితి అదుపు తప్పకుండా చూస్తున్నారు. మరోవైపు ఉద్రిక్త పరిస్థితులను తొలగించేందుకు స్థానిక టీడీపీ నేతలు కూడా రంగంలోకి దిగారు.

**తెలుగుదేశం నేతలు సంప్రదింపులు :** రెండు వర్గాలకు సర్దిచెప్పే ప్రయత్నంలో తెలుగుదేశం నేతలు వారితో సంప్రదింపులు జరుపుతున్నారు. మొత్తంగా ఈ వ్యవహారంతో కడపలో ప్రధాన వాణిజ్య కేంద్రంగా ఉన్న అల్మాస్ పేట సర్కిల్ వద్ద ఆందోళన నెలకొంది. ఇక టిప్పు సుల్తాన్ విగ్రహం ఏర్పాటు, టిప్పు సుల్తాన్ పేరు పెట్టాలనే ఆలోచనను బీజేపీ నేతలు కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు సమాచారం. అయితే గత నెల (ఏప్రిల్ 2026)లో అల్మాస్?పేట కూడలి ప్రాంతంతో పాటు అలంకాన్ పల్లి, మాసాపేట ప్రాంతాల్లో ఎస్పీ నేతృత్వంలో కార్డన్ సెర్చ్ నిర్వహించి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

## రబీలో రూ.4,410 కోట్ల ధాన్యం కొనుగోలు

-మొదటిపేజీ తరువాయి

శుక్రవారం విజయవాడ రామవరప్పాడులోని రైతు భరోసా కేంద్రం, మిల్లులను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఎండీ ఎస్. ఢిల్లీరావుతో కలిసి ధాన్యం కొనుగోలు తీరుతెన్నులపై సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రబీ సీజన్‌లో ఇప్పటివరకు రూ.4,410 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించామని చెప్పారు. అందులో 94 శాతం నిధులను కేవలం 24 గంటల వ్యవధిలోనే నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేశామని పేర్కొన్నారు. ఇది చారిత్రాత్మక రికార్డు అని, గత ప్రభుత్వాల హయాంలో నెలల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు.

**70 లక్షల టన్నుల లక్ష్యం**

రాష్ట్రంలో రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు చేపట్టిందని, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో గతంలో ఎన్నడూ లేని విధంగా పారదర్శకత, వేగాన్ని తీసుకొచ్చామని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ పౌరసరఫరాల శాఖ, జిల్లా యంత్రాంగం, కార్పొరేషన్ సమన్వయంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఈ ఖరీఫ్, రబీ సీజన్లలో కలిపి సుమారు 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందని తెలిపారు. 'ఉమ్మడి కృష్ణా జిల్లాలో ధాన్యం సేకరణ, కొనుగోలు, చెల్లింపుల గురించి రైతులతో నేరుగా మాట్లాడి ఆరా తీశాం. ఎన్టీఆర్ జిల్లాలో ధాన్యం సేకరణ గణనీయంగా పెరిగింది. గత ఏడాది కేవలం 30 వేల మెట్రిక్ టన్నులు సేకరించగా, ఈ ఏడాది ఇప్పటికే 80 వేల మెట్రిక్ టన్నులు సేకరించాం. ఇది గతేడాదితో పోలిస్తే 130–140 శాతం అదనం. అంచనాల కంటే దిగుబడి ఎక్కువగా ఉన్నందున జిల్లా యంత్రాంగం విజ్ఞప్తి మేరకు ఎన్టీఆర్ జిల్లాకు అదనంగా మరో 30 వేల మెట్రిక్ టన్నుల కోటాను కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నాం. ఈ రబీలో జిల్లా నుంచి మొత్తం లక్షా 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించబోతున్నాం.'

**పొరుగు జిల్లాల మిల్లర్లకు అనుమతి**

రైతుల కోరిక మేరకు ఇతర జిల్లాల మిల్లర్లు వచ్చి ధాన్యం సేకరించే అంశంపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి చెప్పారు. ప్రస్తుతం ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా మిల్లర్లలకు అనుమతి ఉందని, అవసరమైతే పొరుగు జిల్లాల మిల్లర్లకు కూడా వెసులుబాటు కల్పించేలా సోమవారం జరిగే ఉన్నత స్థాయి సమావేశంలో నిర్ణయం తీసుకుంటామన్నారు. లారీలు, గోనె సంచుల నాణ్యత వంటి చిన్న చిన్న స్థానిక సమస్యలను సిబ్బంది ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారని, రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

## రెవెన్యూ పాత రికార్డులన్నీ డిజిటలీకరణ

-మొదటిపేజీ తరువాయి

డిజిటలీకరణ పూర్తి చేసినట్లు భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జయలక్ష్మి తెలిపారు. జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆమె రెవెన్యూ సంబంధిత అంశాలపై ప్రజంటేషన్ ఇచ్చారు. ముఖ్యాంశాలు ఇవి. నెల్లూరు స్ఫూర్తితో మాన్యువల్ 1బి రిజిస్టర్లు, పాత అడంగళ్లు (భూ రికార్డులు), 10–1 రిజిస్టర్లతో కూడిన డిజిటలైజేషన్ పనుల తొలి దశను ఈ ఏడాది జులై 31 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2వ దశలో ఇనాం ఎస్టేట్ భూముల రిజిస్ట్రేషన్ రికార్డులు, సీలింగ్ రిజిస్టర్లు, ఇతర రిజిస్టర్లను ఈ ఏడాది సెప్టెంబర్ 30 లోపు డిజిటలైజ్ చేయనున్నారు. ఈ ఏడాది చివరికల్లా జిల్లా గెజిట్, భూసేకరణ రికార్డులు, ఇతర రికార్డులను డిజిటలీకరించాల్సి ఉంది.

బ్లాక్ చైన్ టెక్నాలజీ: భూముల రికార్డుల భద్రత కోసం, వాటిని భవిష్యత్తులో తారుమారు చేయడానికి వీల్లేకుండా తొలిసారిగా అత్యాధునిక బ్లాక్ చైన్ టెక్నాలజీని ప్రభుత్వం తీసుకువస్తోంది. బెంగళూరులోని నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (చీ×జ) సహకారంతో ఈ టెక్నాలజీని 5 గ్రామాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేశారు.

22ఏ కింద వివాదాస్పద భూముల సమస్య పరిష్కారంలో అనంతపురం (851). కృష్ణా (353), శ్రీకాకుళం (332) కేసులతో ఈ మూడు జిల్లాలు ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు అన్నమయ్య, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో కేసులు ఎక్కువగా పెండింగ్?లో ఉన్నాయి. రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారంలో ఈ శాఖ పనితీరు ర్యాంకింగ్ విషయంలో గణనీయంగా మెరుగుపడింది. గతంలో 11వ ర్యాంకులో ఉండగా, ప్రస్తుతం 4వ ర్యాంకుకు చేరడం గమనార్హం.

తక్కువ ఖర్చుతో చక్కటి ఫలితాలు?: పాత రెవెన్యూ రికార్డుల డిజిటలీకరణలో నెల్లూరు జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. అత్యంత తక్కువ ఖర్చుతో చక్కటి ఫలితాలు సాధించింది. జిల్లాలో 2,56,927 పేజీలు అనగా 96 శాతం రెవెన్యూ రికార్డుల డిజిటలీకరణ పూర్తి అయ్యింది.

ఎవేర్ 2.0 టెక్నాలజీ ద్వారా: ఈ–ఆఫీస్ ద్వారా ఫైళ్ల క్లియరెన్స్ ప్రక్రియ వేగవంతం చేయాలని నిర్ణయించారు. ఎవేర్ 2.0 టెక్నాలజీ ద్వారా వాతావరణ హెచ్చరికలు, వ్యవసాయ సూచనలు నేరుగా రైతులకు చేరవేసే విధంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ప్రాణ నష్టం నివారణకు స్ట్రక్చరల్ లైటినింగ్ సేఫ్టీ (పీూూ) కింద రూ.2.63 కోట్లు కేటాయించారు. కాగా పొలంపాడు, ఆముదాలదిన్నె, చెన్నూరు, కందమూరు గ్రామాల్లో ఎలక్ట్రిక్ ఫీల్డ్ మీటర్లు (జుఖీవీ) ఏర్పాటు చేశారు. అదే విధంగా భవనాల రక్షణకు కవచాలు ఏర్పాటు చేస్తున్నారు.

# నేడు చెన్నూరు లో శ్రీ ఎల్లమ్మ తిరుణాల




**:'ప్రజా జ్యోతి చెన్నూరు మే 9 ఆదివారం** చెన్నూర్ లో ఎల్లమ్మ తిరుణాల అత్యంత వైభవముగా జరుగుతుంది ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు, ప్రతి సంవత్సరం మే నెలలో ఈ తిరుణాల జరగడం ఆనవాయితీగా వస్తుంది, గ్రామ దేవత ఎల్లమ్మ తల్లిని చుట్టుపక్కల గ్రామ ప్రజలు ఎంతో నమ్మకంతో పూజలు జరుపుతారు. విశ్వాసం తమకు ఎంతో మేలు చేస్తుందని ప్రగాఢంగా ఈ ప్రజలు నమ్ముతారు. చెన్నూరు కె.వి.ఆర్ కాలనీలో ఎల్లమ్మ తల్లి ఆలయం వద్ద జాతర నిర్వహించేందుకు కమి టీసభ్యులు ఏర్పాటు పూర్తి చేశారు. తిరణాలకు ముందు మూడు రోజులు ఆలయం నుంచి ఎల్లమ్మ తల్లి అన్నగారైన పోతరాజును గ్రామంలో ఊరేగి స్తారు. ఆదివారం సాయంత్రం పోతరాజును చెన్నూరు లోని ఆంజనేయ స్వామి గుడి నుండి ప్ పురవీధుల గుండా ఊరేగింపుగా పటాకులు పేలుస్తూ రంగులు జల్లుకుంటూ, కరసాము ఊరేగింపుకు కొనసాగుంది. వేసవికాలంలో ప్రతిష్టాత్మక జరిగే ఎల్లమ్మ తల్లి జాతర అంటేనే జిల్లా పోలీసులు అధికారులు, రెవిన్యూ అధికారులు జాతను ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తారు, జిల్లా స్థాయి అధికారులు, ఈ జాతర పై జాతర ప్ర త్యేక దృష్టి పెడతారు, చెన్నై రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎల్ల మాలయం 400 సంవత్సరాల క్రితం చెన్నూరు చెందిన పూర్వీకులు చెన్నూరు గ్రామం ప్రజలకు, చుట్టుపక్క గ్రామ ప్రజలకు కలరా, ఇతర అంటూ వ్యాధులు వ్యాపించకుండా గ్రామం చివర్లో ఎల్లమ్మ తల్లి ఆలయాన్ని సంకల్పంతో పెద్దలు ఆలయాన్ని నిర్మించినప్పుడు నుంచి ప్రతి సంవత్సరం జాతర నిర్వ హించడం జరుగుతుంది, ఆదివారం ఉదయం ఆలయం వద్ద జంతు బలివ్వడం ప్రత్యేక పూజలు బోనాల సమర్పించడం జరగడం జరుగుతుంది. సాయంకాలం కోలాటం ఇతర కార్యక్రమంలో జరుగుతాయి చెన్నూరు గ్రామం నుండే కాక మండలం ఇతర గ్రామాలు ఇతర మండల ప్రజలు ఈ జాతరలో పాల్గొంటారు

# వరద ముప్పును దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం చర్యలు




**కోతులగుట్టలో నూతన బోరు వెల్ ఏర్పాటు**

**కూనవరం, మే 09 (ప్రజాజ్యోతి)** కూనవరం మండలం జగ్గవరం గ్రామపంచాయతీ పరిధిలోని కోతులగుట్ట గ్రామంలో రాబోయే వర్షాకాలం, వరద పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టింది. శనివారం స్థానిక సచివాలయం వద్ద నూతనంగా బోరు బావిని ఏర్పాటు చేశారు. వరదల సమయంలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా ప్రజలకు ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు జనసేన వైస్ ఎంపీపీ బండారు సాంబ శివరావు మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యే యం గా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, వరద ప్రభావిత ప్రాం తాల్లో ముందస్తుగా మౌలిక సదుపాయాలు కల్పి స్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గవరం బూత్ ఇన్చార్జ్ బోడ వెంక టేశ్వర్లు, సొసైటీ డైరెక్టర్ నోముల సత్యనారాయణ (బీజేపీ), గ్రామ శాఖ అధ్యక్షులు శేఖర్, గంపల కృపా నందం, తుష్టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ప్రభు త్వ చొరవ పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# మూడురాళ్ళపల్లె గ్రామంలో అత్యంత వైభవంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం




**చాగలమర్రి , మే09( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం మూడురాళ్లపల్లె గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామికి శ్రవణా నక్షత్రం సందర్భంగా దపూజారి దుర్భాక అనిల్ కుమార్ శర్మ అర్చకత్వంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారికి కళ్యాణం నిర్వహించారు. కళ్యాణంలో ఉభయదారులు చింతలచెరువు వాస్తవ్యులు రేపాకుల సుబ్బ రాయుడు ధర్మపత్ని వెంకటతులశమ్మ , శ్రీనివాసులు ధర్మపత్ని రజిత , నాగేంద్ర ప్రసాద్ ధర్మపత్ని నాగజ్యోతి , దేరంగుల కార్తీక్ ధర్మపత్ని నాగమంజుల రాణి కుటుంబసభ్యులు పాల్గొన్నారు. భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి భక్తి శ్రద్ధలతో తిలకించారు. స్వామి వారి పల్లకి కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పులి చిన్న ఓబుల్ రెడ్డి( రిటైర్డ్ ఇంజనీర్ ) ధర్మపత్ని పులి పద్మావతి , పులి ఓబులరెడ్డి ధర్మపత్ని విజయమ్మ , రామేశ్వరెడ్డి , సుదర్శన్ రెడ్డి , మహేశ్వర్ రెడ్డి , అరుణ , గ్రామ ప్రజలు , భక్తులు , తదితరులు పాల్గొన్నారు.

# చాగలమర్రిలో వైభవంగా జాంబవంతుని ఆలయం జీర్ణోద్ధరణ కార్యక్రమం





**చాగలమర్రి , మే 09( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** ఏనంద్యాల జిల్లా చాగలమర్రి పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో గల అతి పురాతనమైన దేవాలయం శ్రీ జాంబవంతుని దేవాలయం. ఈ దేవాలయం కమిటీ సభ్యుల ఆధ్వర్యములో దేవాలయ జీర్ణోద్ధరణ చేశారు. పూజారులు శ్రీనివాస శర్మ ఆధ్వర్యములో గణపతిపూజ , పుణ్యహావాచనము , ఋత్విక్కరణం , పంచగవ్యప్రాసన , కలశారాధన , స్వామి వారి పంచామృత అభిషేకాలు , గణపతి ప్రతిష్ట , శ్రీ కృష్ణుని ప్రతిష్ట , సూర్యదేవుని ప్రతిష్ఠ , ప్రధాన ఆలయ శిఖర ప్రతిష్ఠ , హోమాలు జరిపించారు. పూజారి లక్ష్మీకాంత్ శర్మ మాట్లాడుతూ ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమాలు వివరించారు. ఈ కార్యక్రమంలో పూజారులు లక్ష్మీ కాంత్ శర్మ , పవన్ కుమార్ సోమనాథ్ శర్మ , చరణ్ కుమార్ ఆధ్వర్యములో జాంబ వం తునికి విశేష పూజలు జరిపించి ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమాలు నిర్వహించారు. పూజ అనంతరం తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బొడ్డు వేణుగోపాల్ రెడ్డి , కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సింగుపురం ఆలయ మహోత్సవంలో పాల్గున్న సిరిపురం తేజేశ్వరరావు.



**ప్రజాజ్యోతి రిపోర్టర్ :- యం. నరేష్. పాతపట్నం** మండలం హిందూపురం గ్రామం లో నూతనంగా నిర్మించిన శ్రీ శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. గ్రామానికి జిల్లా అధ్యక్షులకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు అనంతరం ఆలయాన్ని ప్రత్యేక పూజల్లో పాల్గొని ఆపరమశివునిఆశీస్సులు. పొందారు అధ్యక్షులు తన వంతు సాయంగా ఆర్థిక సహాయాన్ని అందజేశారు ఆడియో కమిటీ సభ్యులు దుస్సాలులతో ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో పాతపట్నం మండల అధ్యక్షులు పడాల షణ్ముఖరావు మండల ప్రధాన కార్యదర్శి వడియాల బాబురావు గ్రామ పెద్దలు యువకులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ చెవిటమ్మ తల్లి ఆలయ ప్రతిష్టమహోత్సవములో పాల్గున్న సిరిపురంతెజేశ్వరరావు.




**ప్రజాజ్యోతి రిపోర్టర్ :-యం. నరేష్.**పాతపట్నం మండలం గాగువాడ గ్రామం ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు శ్రీశ్రీశ్రీ చెవిటమ్మతల్లిఆలయ. ప్రతిష్ట మహోత్సవము లో పాల్గొన్న శ్రీకాకుళం జిల్లా బిజెపి అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు కార్యక్రమంలో మండల నాయకులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు జిల్లా అధ్యక్షులు తన వంతు విరాళం ఆర్థిక సహాయాన్ని ఆలయ కమిటీ వారికి అందజేశారు ఆలయ కమిటీ సభ్యులు దుస్సా లువాతో సత్కరించారు జిల్లా అధ్యక్షులతో పాటు పాతపట్నం మండల అధ్యక్షులు పడాల సన్ముఖరావు మండల ప్రధాన కార్యదర్శి గడియాల బాబురావు గ్రామ పెద్దలు యువకులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా గుమ్మనూరు ఈశ్వర్ ముద్దుల చిన్నారికూతురు కేశఖండన



**ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు** హాజరైన గుమ్మనూరు కుటుంబ సభ్యులు గుంతకల్లు నియోజకవర్గం గౌరవ శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం తనయుడు గుత్తి మరియు పామిడి టిడిపి ఇన్చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ కుమార్తె కేశఖండన కార్యక్రమంలి ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుమల నందు అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది... ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మరియు ఆయన సోదరులు గుమ్మనూరు నారాయణస్వామి వారి కుటుంబ సభ్యులు మరియు గుమ్మనూరు శ్రీనివాసులు మరియు వారి కుటుంబ సభ్యులు మరియు ఎమ్మెల్యే తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ సతీసమేతంగా చిన్నారి కేశఖండన కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గుమ్మనూరు కుటుంబ సభ్యులు మరియు వారి అత్యంత సన్నిహితులు పాల్గొనడం జరిగింది..ద

## ముప్పిడి నూకరాజు భార్య దుర్గ భవాని గారిని పలకరించిన మురళిరాజు శ్రీ




**కాకినాడ జిల్లా మే 9 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** వైఎస్ఆర్సిపి నాయకులు అండగా నిలుస్తున్న మురళిరాజు. ప్రత్తిపాడు మండలం వెంకటనగరం గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు ముప్పిడి నూకరాజు భార్య దుర్గ భవాని ఇటీవల కాలంలో కాకినాడ సూర్య గ్లోబల్ హాస్పిటల్ లో ఆపరేషన్ కారణంగా వారిని పలకరించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకుని వారి 10,000 రూపాయలు ఆర్థిక సాయం అందజేసి వైస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు కుటుంబాలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని భరోసా కల్పించిన ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సిపి నాయకులు ఆ నరసాపురం పార్లమెంటు పరిశీలకులు ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణం రాజు.

## గిద్దలూరు మండలం దిగుమెట్ట సమీపంలో లిక్కర్ లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా



**నంద్యాల: మే= 09** ప్రజాజ్యోతి నంద్యాల నుంచి గిద్దలూరు- గిద్దలూరు నుంచి నంద్యాల వైపు వెళ్లే వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న నంద్యాల, గిద్దలూరు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. అనంతరం ట్రాఫిక్ క్లియర్ చేశారు.

# గిన్నిస్ వరల్డ్ రికార్డులో ఓకే గ్రామం, ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి చోటు

**.ఐదు సంవత్సరాలకే గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సంపాదించిన బాలుడు**

**తాళ్లపూడి, మే 9,ప్రజాజ్యోతి న్యూస్** గిన్నిస్ వరల్డ్ రికార్డ్ లో స్థానాన్ని సంపాదించిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు సభ్యులు వివరాల్లో వెళితే ఫిబ్రవరి 2వ తేదీన హైదరాబాదులో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధుల ఆధ్వర్యంలో అతిపెద్ద ఎలక్ట్రానిక్ కీబోర్డ్ సమిష్టి నిర్వహించింది. దీనిలో ఒకేసారి కీబోర్డ్ ను ప్లేయింగ్ చేయడానికి 22 దేశాలకు చెందిన 2000 మంది కీబోర్డ్ వాయిద్యా కళాకారులు పాల్గొన 777 మంది ఉత్తమ ప్రతిభ కనబరిచి హాలేల్ మ్యూజిక్ స్కూల్ ఈ రికార్డును నెలకొల్పింది. ఈ రికార్డులో స్థానం సం పాదించిన వారిలో తాళ్లపూడి మండలం తాడిపూడి గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది గ్రరె శ్రీనివాసరావు, సోదరి ఇంద్రాణి, మేనల్లుడు లేఖన్ ప్రసాద్ లు పాల్గొని ఉత్తమ ప్రతిభను కనబరచి గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించారు. దీనిలో భాగంగా శుక్రవారం విజయవాడలో ప్రతిభావంతులకు మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకులు అగస్టీన్ దండింగి చేతుల మీదగా సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.ఒకటవ తరగతి చదువుతున్న 5 సంవత్సరాలు గల లేఖన ప్రసాద్ ఈవెంట్ పాల్గొన్న వారిలో అతి చిన్న వయస్కుడిగా గుర్తింపు పొందాడు. ఈ సందర్భంగా గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించిన ఈ ముగ్గురిని గ్రామస్తులు ,బంధువులు, స్కూల్ యాజమాన్యం అభినందించారు



## నూతన వదూవరులను అశీర్వదించి మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి



**కోవెలకుంట్ల: మే= 09 ప్రజాజ్యోతి** కోవెలకుంట్ల మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తెలుగుదేశం పార్టీ నాయకులు పెండేకంటి లక్ష్మీ నివాస్ దంపతుల ఏకైక కుమార్తె ఐశ్వర్య శివకృష్ణ వివాహ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రివర్యులు బీసీ జనార్దన్ రెడ్డి దంపతులను ఆశీర్వదించారు... కళ్యాణ వేదిక పొద్దుటూరు పట్టణంలోని శ్రీదేవి ప్యాలెస్... మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని పెండేకంటి రామన్ కుమార్ ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్యలు స్వాగతం పలికారు

## అల్ పుర్ ఖాన్ ఖబరస్తాన్ అభివృద్ధికి చర్యలు

**నంద్యాల పట్టణ ప్రజలు ఖబరస్తాన్ అభివృద్ధికి సహకరించాలి**

**టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, కమిటీ అధ్యక్షులు మనియార్ ఖలీల్**

**నంద్యాల :మే = 09 ; ప్రజాజ్యోతి** నంద్యాల పట్టణం భీమవరం రహదారిలోని అల్ పుర్ ఖాన్ ఖబరస్తాన్ అభివృద్ధికి చర్యలు చేపడతమని, నంద్యాల పట్టణ ప్రజలు ఖబరస్తాన్ అభివృద్ధికి సహకరించాలని టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ , ఈద్గా కమిటీ అధ్యక్షులు మరియు రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మనియార్ ఖలీల్ కోరారు. శనివారం నంద్యాల పట్టణంలోని ఈద్గా ఆవరణలో ఉన్న పురాతన ఖబరస్తాన్ ను వారు సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఈద్గా కమిటీ అధ్యక్షులు మనియార్ ఖలీల్ సభ్యులు అమీర్ భాష, మునీర్, మౌలానా అబ్దుల్ హదీ తదితరులు సందర్శించారు. ఈ సందర్భంగా టిడిపి యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని ముస్లిం సోదరులకు ఈ పాత ఈద్గా ఎంతో ముఖ్యమని, గతంలో ఊరి బయట ఉండే అల్ ఫుర్కాన్ ఈద్గా, నేడు జనాభా పెరగడం వల్ల ఊరి మధ్యలో ఉందన్నారు. సమాధులను రాళ్లతో నింపడం వల్ల చాలా వరకు స్థలాభావం ఏర్పడిందని, కావున తమ పూర్వీకుల స్థలాల్లోని కట్టడాలనే తాము కూల్చివేయమని చెప్పడం జరిగిందని ఫయాజ్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సమాధులకు కట్టడాలను తొలగించి మంచి ఆహ్లాదకరంగా వాతావరణంలో ఉండేలా ఏర్పాటు చేయాలని కమిటీ అధ్యక్షులు మనియార్ ఖలీల్, సభ్యులకు ఆయన సూచించారు. ఈద్గా కమిటీ అధ్యక్షులు మరియు రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మనియార్ ఖలీల్ మాట్లాడుతూ నంద్యాల ముస్లిం సోదరులు పురాతన ఖబరస్తాన్ ను ఆధునికరించేందుకు, అభివృద్ధికి సహకరించాలని కోరారు. మౌలానా అబ్దుల్ హాది మాట్లాడుతూ ముస్లిం సోదరులకు ఎంతో ప్రాముఖ్యత కలిగిన పురాతన ఖబరస్తాన్ అభివృద్ధికి ప్రతి ఒక్క ముస్లిం సోదరులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మునీర్, అహ్మద్ హుసేన్, అమిర్ తదితరులు పాల్గొన్నారు.



## లికష్టజీవుల, కార్మికుల కడుపులు కొడుతున్న నంద్యాల ట్రాఫిక్ సి ఐ చాంద్ భాషను నంద్యాల నుండి సాగానంపే వరకు ఉద్యమాలు కొనసాగిస్తాం ఎఐటియుసి

ఆటో డ్రైవర్ల పై, వీధి విక్రయిదారులపై, బైక్పై వెళ్తున్న వాహనదారులపై దాడులకు పాల్పడుతున్న ట్రాఫిక్ సిఐ చాంద్ బాషాను సస్పెండ్ చేయాలి

ట్రాఫిక్ సిఐ చాంద్ బాషా కార్మికులపై చేస్తున్న అరాచకాలపై, దాడులపై మంత్రి ఫరూక్ గారు,జిల్లా కలెక్టర్ గారు, జిల్లా ఎస్పీ స్పందించాలి

నంద్యాల ట్రాఫిక్ సిఐ చాంద్ బాషా అరాచకాలకు,దాడులకు నిరసనగా ఈనెల 14న ఎఐటియుసి ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ముట్టడికి పిలుపునిచ్చిన

ఎఐటియుసి నంద్యాల పట్టణ అధ్యక్ష కార్యదర్శులు డి.శ్రీనివాసులు,ధనుంజయ్ డిప్యూటీ కార్యదర్శి భూమని శ్రీనివాసులు




**నంద్యాల: మే= 09 ప్రజాజ్యోతి** రోజురోజుకు పెరిగిపోతున్న నంద్యాల ట్రాఫిక్ సిఐ చాంద్ బాషా అరాచకాలు ఈ సందర్భంగా స్థానిక నంద్యాల సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎఐటియుసి నంద్యాల పట్టణ ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ నంద్యాల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సి ఐ గా బాధ్యతలు నిర్వహిస్తున్న చాంద్ బాషా అరాచకాలు, దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయని ఆటో కార్మికుల పైన వీధివిక్రయదారుల పైన, బైక్ పై వెళ్తున్న వాహనదారుల పైన గాంధీ చౌక్ ఏరియాలో ఉదయం మార్కెట్ కు వచ్చేటువంటి ఆటో కార్మికుల పైన, చుట్టుపక్కల టి అమ్ముకునే వారిపైన, టిఫిన్ అమ్ముకునే వారిపైన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తు, బూతులు తిడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారని వారన్నారు.నంద్యాల పట్టణ ట్రాఫిక్ చాంద్ బాషా ఆటో డ్రైవర్లు రోడ్డు పక్కన నిలబెట్టుకొని ప్రజలను ఎక్కించుకునే క్రమంలో ఫోటోలు కొట్టి 1400 నుండి 1500 ఫైన్ వేయడం జరుగుతుందని ఈ విధంగా ఫైన్ వేయడం ద్వారా రోజు 200 లేక 300 తోలుకొని కుటుంబాన్ని పోషించుకునే ఆటో డ్రైవర్ ఏవిధంగా 1500 ఫైన్ కడతారని మానవతా దృక్పథం కూడా లేకుండా ఇష్టారాజ్యంగా ఫైన్ వేయడం చాలా దుర్మార్గమని దీనిని ఎఐటియుసి గా తీవ్రంగా ఖండిస్తున్నామని వారన్నారు. అంతేకాకుండా ఆటో డ్రైవర్లను నోటికొచ్చినట్టు బూతులు తిడుతూ, కొడుతూ దాడులకు పాల్పడుతున్నాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నంద్యాల పట్టణంలో వీధివిక్రయదారుల పైన తోపుడుబండ్ల పై పండ్లు, కూరగాయల వ్యాపారం చేసుకునే కష్టజీవులపై పైన బూతులు తిడుతూ, వారి వ్యాపార సరుకులను పక్కన విసిరి పారేస్తూ, వారి తూకాల మిషనులను మరియు బండ్లపై ఉన్నటువంటి సరుకులను కింద పడేస్తూ తనకు ఇష్టం వచ్చిన పద్ధతుల్లో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు తెలిపారు. కావున కార్మికులను కర్షకులను కష్టజీవులను ఇబ్బందులకు గురి చేస్తు, ప్రజల పైన కార్మికులపై చేస్తున్నటువంటి దాడులను అరాచకాలను నంద్యాల శాసనసభ్యులు మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ , జిల్లా కలెక్టర్ ,జిల్లా ఎస్పీ స్పందించి ట్రాఫిక్ సిఐ చాంద్ బాషా ను నంద్యాల నుండి సాగనంపే విధంగా చర్యలు తీసుకోవాలని ఎఐటియుసి గా విజ్ఞప్తి చేస్తున్నామని వారు పత్రిక ద్వారా తెలిపారు. లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతామని అవసరమైతే ఆటో కార్మికులను, వీధి విక్రయ దారులను, తోపుడుబండ్ల వ్యాపారస్తులను ప్రజలందరినీ కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు ప్రసాద్, బండి శ్రీను, రహిమాను, నాగార్జున,బుజ్జి, బాషా, మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుశీలమ్మ, జిల్లా ఉపాధ్యక్షురాలు తులసమ్మ తదితరులు పాల్గొన్నారు

## అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ సీఎం చంద్రబాబు ప్రభుత్వం నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

**నంద్యాల: మే= 09 ప్రజాజ్యోతి** గ్రామాల్లో అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఉమ్మడి ప్రభుత్వం అని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. శనివారం నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల మండలం నెహ్రూ నగర్ గ్రామంలో రూ. 25 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను ప్రారంభించి, మూర్వకొండ శ్రీ అభయాంజనేయ స్వామి, నెహ్రూ నగర్ శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయాల ధ్వజ స్థంబాలు, విగ్రహాలు ప్రతిష్ట మహోత్సవాలలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆనాడు రెండు సార్లు ఎమ్మెల్యేగా చేసిన సమయంలో మా నాన్న బైరెడ్డి రాజశేఖరరెడ్డి గ్రామాల్లో చేపట్టిన సిమెంట్ రోడ్లు, చెక్ డ్యామ్ లు, నీటి కుంటలు నేటికీ ప్రజలకు ఉపయోగపడడం సంతోషంగా ఉందని, సీఎం చంద్రబాబు ద్వారానే అభివృద్ధి సాధ్యం అన్నారు. ఈ రూ.25 లక్షలే కాదు గ్రామానికి మరికొంత నిధులు మంజూరు చేసి నెహ్రూ నగర్ ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తా అన్నారు. ఒకే సారి రెండు నూతన శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయాల్లో జరిగే పూజ కార్యక్రమాల్లో పాల్గొనడం నా అదృష్టమని ఎంపీ డాకర్ బైరెడ్డి శబరి అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ కట్టుబడి శ్రీనివాస నాయుడు, మాజీ జడ్పీటీసీ నాగేశ్వరావు, బి ఎస్ ఎన్ ఎల్ సలహా కమిటీ సభ్యులు కురువ రమేష్, రఘురామిరెడ్డి, సుధాకర్ రెడ్డి, జయరామిరెడ్డి, మురళి, ధర్మక్షేత్ర, పి ఆర్ డి ఈ, ఏ ఈ, తహసీల్దార్, గ్రామ టీడీపీ నాయకులు, ఆలయాల కమిటీ పెద్దలు పాల్గొన్నారు.



## అనుమతి లేకుండా మట్టి, కంకర, ఇసుక తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు:

రెవెన్యూ అధికారులు హెచ్చరిక.



**ప్రజా జ్యోతి రిపోర్టర్ :- యం. నరేష్. పాతపట్నం** శ్రీకాకుళం ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టి, కంకర, ఇసుక తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని రెవెన్యూ శాఖ అధికారులు హెచ్చరించారు. ప్రభుత్వ పరిధిలోని భూముల నుంచి ఎలాంటి ఖనిజాలను తవ్వాలన్నా సంబంధిత శాఖ నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమ తవ్వకాలకు పాల్పడే వ్యక్తులపై చట్ట ప్రకారం కఠినమైన శిక్షలు అమలు చేస్తామని తెలిపారు. ఈ తరహా అక్రమ కార్యకలాపాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు గుర్తిస్తే ప్రజలు వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తి గోప్యంగా ఉంచి, అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

## అధిక రూసుం వసులు చేస్తున్న టోల్ గేట్ నిర్వాహకులు

**ఆళ్లగడ్డ: మే= 09 ప్రజాజ్యోతి** ఆళ్లగడ్డ నియోజక వర్గం అహోబిలం క్షేత్రం కు వస్తున్న భక్తుల నుండి అక్కడ టోల్ గేట్ నిర్వహిస్తున్న నిర్వాహకులు స్థానికుల నుండి కూడా 100 రూపాయలకు రసీదు ఇస్తూ 150 , 200 రూపాయలు వసూలు చేస్తున్నారు. దీని వల్ల సమీప గ్రామాల వారే కాకుండా దూర ప్రాంతాల ప్రజలు కూడా దేవుడు దర్శనం కు దూరం చేసే ప్రయత్నం చేస్తున్నారు. పక్క ఊరి వారైనా సరే ముక్కు పిండి టోల్ ఫీజు వసూలు చేస్తున్నారు. ఈ విషయం గతంలో కూడా భక్తుల నుంచి , పత్రికల్లో కూడా రావడం జరిగింది. ఈ టోల్ చార్జీలు భారీగా వసూలు చేయడం నంద్యాల జిల్లా భారతీయ జనతా పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది . టోల్ ఫీజు సామాన్యులకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని దేవస్థానం వారిని కోరుతున్నాను. ఇది పునరావృతం అయితే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు గారికి దేవాదాయ శాఖ మంత్రి గారికి, ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకెళ్లి భక్తులకు తక్కువ ధర టోల్ ఫీజు వసూలు చేసేలా చూస్తాం. అది జరగకుండా ఇదే కొనసాగితే చలో అహిభిలం కార్యక్రమం ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి భక్తులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటాం.అన్నారు.



## పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న కాటసాని రామిరెడ్డి



**నంద్యాల:మే= 09 ప్రజాజ్యోతి** నంద్యాల జిల్లాలో పలు వివాహ శుభ కార్యక్రమాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి , వైఎస్ఆర్సిపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కాటసాని ఓబుల్ రెడ్డి , జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపి రెడ్డి అవుకు మండలం వైఎస్ఆర్సిపి కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి పాల్గొన్న జిల్లా వైఎస్సార్సీపీ అధికార ప్రతినిధి సిద్ధంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి గుండం సూర్య ప్రకాశ్ రెడ్డి,జిల్లా వైఎస్ఆర్సిపి పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు గుండం నాగేశ్వర్ రెడ్డి.

## బస్ ఎప్పుడు వస్తుందో...

**బస్సుల కొరతతో ప్రయాణికుల ఇబ్బందులు**



**మే 9 ప్రజా జ్యోతి న్యూస్ మైలవరం** తాడిపత్రి -- జమ్మలమడుగు రూట్‌లో బస్సులు సమయానికి రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వద్దిరాల గ్రామం చుట్టుపక్కల గ్రామాలకు ప్రధాన సెంటర్‌గా ఉండటంతో నిత్యం వందలాది మంది ప్రజలు ఇక్కడికి చేరుకుని బస్సుల కోసం గంటల తరబడి ఎదురు చూస్తున్నారు. ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలు, రైతులు, వ్యాపారులు ఇలా అన్ని వర్గాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. బస్సులు వచ్చినా స్టాప్ వద్ద నిలపకుండా వెళ్లిపోతుండటంతో ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని బస్సులు ఆగినా ఇప్పటికే జనాలతో నిండిపోవడంతో ఎక్కే పరిస్థితి లేకపోతోందని ప్రజలు చెబుతున్నారు. వద్దిరాల సెంటర్ పరిసర గ్రామాలకు ప్రధాన రవాణా కేంద్రంగా ఉండటంతో ఈ సమస్య మరింత తీవ్రంగా మారిందని స్థానికులు అంటున్నారు. వెంటనే అదనపు బస్సులు ఏర్పాటు చేసి, ప్రతి స్టాప్ వద్ద బస్సులు తప్పనిసరిగా నిలిపేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు.

# తమిళనాడులో విజయ్ జవీ సస్పెన్స్ కు తెర పడింది

**నంద్యాల:మే= 09 ప్రజాజ్యోతి** విజయ్ ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన 118 మంది మద్దతు లభించింది. ఊహించని ట్విస్టులు.. అంచనాలకు అందని లెక్కల తరువాత విజయ్ ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమం అయింది. మూడో సారి గవర్నర్ తో విజయ్ భేటీ సమయంలో 116 మంది మద్దతు లేఖలు సమర్పించారు. మరో రెండు సీట్ల కోసం ప్రమాణ స్వీ కారం ఆగిపోయింది. ఇక, ఇప్పుడు వీసీకే మద్దతు ఖరారు కావటంతో.. మరోసారి గవర్నర్ ను విజయ్ కలవనున్నారు. ఇక.. సీఎంగా ప్రమాణ స్వీకారానికి లైన్ క్లియర్ అయినట్లే. తమిళనాడులో విజయ్ ప్రభుత్వం ఏర్పాటుకు లైన్ క్లియర్ అయింది. విజయ్ ప్రభుత్వ ఏర్పాటు కు మరో రెండు సీట్ల దూరంలో ఉన్నారు. వీసీకే కు రెండు ఎమ్మెల్యే స్థానాలు ఉన్నాయి. టీవీకే ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలంటే వీసీకే కొన్ని షరతులు విధించింది. వీటితో సుదీర్ఘంగా విజయ్ టీం తో చర్చలు జరిగాయి. రెండు పార్టీల మధ్య ఒప్పందం ఖరారు కావటంతో ప్రభుత్వంలో భాగస్వామ్యం కల్పించేందుకు విజయ్ అంగీకరించారు. ఇక.. అధికారికంగా వీసీకే మద్దతు లేఖతో గవర్నర్ ను కలసి తాము పూర్తి మెజార్టీతో ప్రభుత్వం ఏర్పాటుకు సిద్దంగా ఉన్నామని చెప్పనున్నారు. గవర్నర్ కోరి నట్లుగా 118 మంది ఎమ్మెల్యేల మద్దతు దక్కటంతో ఇక ప్రభుత్వం ఏర్పాటుకు విజయ్ ను ఆహ్వానించటం లాంఛనంగా కనిపిస్తోంది. వీసీకే మద్దతుతో తొలిగిన అడ్డంకి.. విజయ్ ప్రభుత్వం ఏర్పాటు టీవీకే ప్రభుత్వానికి మద్దతు పైన వీసీకే షరతులతో ముందుకు వచ్చింది. ప్రభుత్వంలో.. కూటమి లో భాగ స్వాములుగా ఉండాలని కోరుకుంటున్నట్లు ప్రకటించింది. అదే సమయంలో తమ పార్టీకి ప్రాధాన్యత ఉండాలని తేల్చి చెప్పింది. అందులో భాగంగా విజయ్ వద్దకే తమ ప్రతిపాదనలను పంపింది. సుదీర్ఘ చర్చల తరువాత రెండు వైపుల నుంచి ఒప్పందం కుదిరింది. ఇప్పుడు వీసీకే నిర్ణయంతో విజయ్ ప్రమాణ స్వీకారానికి లైన్ క్లియర్ అయింది. గవర్నర్ తో కలిసి పూర్తి మెజార్టీకి సంబంధించిన వివరాలను విజయ్ అందించనున్నారు. ఆ వెంటనే గవర్నర్ విజయ్ ప్రభుత్వ ఏరాటు పైన నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. నెంబర్ గేమ్ కొనసాగుతున్న వేళ మరింత ఆలస్యం చేయకుండానే ప్రమాణ



స్వీకారం చేయాలని విజయ్ భావిస్తున్నారు. ఇటు చర్చ లు కొనసాగిస్తూనే... అటు ప్రభుత్వ ఏర్పాట్ల పైనా కసరత్తు జరుగుతోంది.

## విజయవంతమైన ఉచిత మెగా కంటీ వైద్య శిబిరం

**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ మే 9 (ప్రజా జ్యోతి)** నెల్లూరు పట్టణం, బృందావనం కు చెందిన సుశీల నేత్రాలయ వారి ఆధ్వర్యంలో బద్వేలులోని బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరం విజయవంతమైందని నిర్వాహకులు సుమిత్రా నగర్ కు చెందిన ఉపాధ్యాయులు వీరదాసరి జేకబ్ సెల్వరాజ్ తెలియజేశారు. శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించబడిన మెగా కంటి వైద్య శిబిరాన్ని బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వెంకటసుబ్బారెడ్డి ప్రారంభించారు. నెల్లూరు సుశీల నేత్రాలయ వైద్యశాలకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్.పి.సుధాకర్ రాజు, డాక్టర్.వి.జవహర్ సత్యబాబు, డాక్టర్.మేఘన లు పాల్గొని రోగులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి పరీక్షలు అనంతరం రోగులకు అవసరమైన ఉచిత మందులను అందజేయడంతో పాటు, కళ్ళ ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. శుక్లం, రెటీనా వంటి వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఆపరేషన్లు అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్ ద్వారా ఆరోగ్య సేవ



అందించేందుకు నెల్లూరులోని సుశీల నేత్రాలయ వైద్యశాలను సందర్శించాల్సిందిగా సూచించారు. ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్ పథకం కింద కంటి ఆపరేషన్లు పూర్తి ఉచితంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. బద్వేలు పరిసర ప్రాంతాల్లోని ప్రజలు, ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై అవకాశాన్ని వినియోగించుకున్నారు.

## నియోజవర్గంలో పలు దేవాలయాల అభివృద్ధికి 2,40,000/- వేలు రూపాయలు విరాళం అందించిన ఎమ్మెల్యే ఎంజీఆర్






**ప్రజాజ్యోతి రిపోర్టర్ :-యం. నరేష్.**పాతపట్నం నియోజకవర్గంలో పలు ఆలయాల ప్రతిష్ట మహోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంజిఆర్ మెళియాపుట్టి మండలం బాణాపురం పంచాయతీ ఎగువబగడ గ్రామంలో శ్రీశ్రీశ్రీ నీలమణి దుర్గా గ్రామ దేవత ఆలయ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొని ఆలయ అభివృద్ధికి 25,000/- వేలు, రూపాయలు విరాళం అందజేశారు. మెళియాపుట్టి మండలం దుర్బలాపురం గ్రామంలో శ్రీశ్రీశ్రీ ఏడుకొండల వెంకటరమణ స్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొని 45,000/- వేలు రూపాయలు విరాళం అందజేశారు. పాతపట్నం మండలం సింగుపురం గ్రామంలో శ్రీశ్రీశ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొని 50,000/- వేలు రూపాయలు విరాళం అందజేశారు. పాతపట్నం మండలం సోద గ్రామంలో శ్రీశ్రీశ్రీ నీలకంఠేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొని 25,000/- వేల రూపాయలు విరాళం అందజేశారు. కొత్తూరు మండలం నివగాం గ్రామంలో శ్రీ షిరిడి సాయిబాబా ఆలయ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొని 25,000/- వేల రూపాయలు విరాళం అందజేశారు. హిరమండలం మండలం పూనుపేట గ్రామంలో శ్రీశ్రీశ్రీ చెవిటమ్మ తల్లి గ్రామదేవత ఆలయ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొని 45,000/వేల రూపాయలు విరాళం అందజేశారు. ఎల్ ఎన్ పేట మండలం =/= శ్యామలాపురం గ్రామంలో శ్రీశ్రీశ్రీ ఉమా మల్లేశ్వర స్వామి సహిత నవగ్రహ సుబ్రహ్మణ్య ఆంజనేయ స్వామి వారి ఆలయ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొని 25,000/- వేల రూపాయలు విరాళం అందజేశారు. పాతపట్నం నియోజకవర్గం లోని ఐదు మండలాల్లో ఈరోజు శనివారం నాడు ఆలయాల ప్రతిష్ట మహోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆలయాల అభివృద్ధికి 2,40,000/- వేలు రూపాయలు విరాళం అందించిన పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మామిడి గోవిందరావు. అనంతరం ఎమ్మెల్యే కమిటీ సభ్యులు,గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామంలో భక్తిభావం పెంపొందించేలా ఆలయ ప్రతిష్ట జరగడం సంతోషకరమని, ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామాల్లో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,ఆయా మండలాలా ఎన్డీఏ కూటమి నాయకులు,కార్యకర్తలు,గ్రామ ప్రజలు, భక్తులు,తదితరులు పాల్గొన్నారు.

## గుండాయిపాలెం గ్రామంలో ఎరుబోతు రమణారావు పర్యటన

- గ్రామ ప్రజలతో స్నేహపూర్వకంగా మమేకమైన రాష్ట్ర నాగవంశ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మెన్ రమణారావు
- ప్రజల సమస్యలు ,అవసరాలను తెలుసుకుని పరిష్కారం దిశగా చర్యలు
- వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులకు ఆశీర్వాదం





**విజయనగరం ,ప్రజాజ్యోతి న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ నాగవంశం వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఎరుబోతు రమణారావు తన స్వగ్రామమైన విజయనగరం జిల్లా గుండాయిపాలెం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో స్నేహపూర్వకంగా మమేకమై వారి సమస్యలు, అవసరాల గురించి తెలుసుకున్నారు.అనంతరం గ్రామంలో వివాహ బంధంతో కొత్త జీవితాన్ని ప్రారంభించిన నూతన వధూవరులైన డొకర త్రినాధ్ హేమలత, ఎరుబోతు సాయికుమార్ భవాని, ఎర్నింటి సన్నీ భవాని, అప్పురుబోతు శ్రీను దేవి జంటలను వారి వారి ఇళ్లకు వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. కొత్తగా వివాహ జీవితం ప్రారంభించిన ఈ జంటలకు శుభాకాంక్షలు తెలియజేశారు. వీటితోపాటు నూతన దంపతులకు నూతన వస్త్రాలను బహుకరించి, వారి దాంపత్య జీవితం సంతోషంగా ఉండాలి అని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో కంటుభూక్త రామానాయుడు , ఎరుబోతు సన్నీ,ఎర్నింటి శ్రీనివాస్,ఎర్నింటి గోవింద్,జరాజపు వెంకటరమణ,కర్రయ్య శ్రీను,ఎర్నింటి లక్షణారావు,ఎర్నింటి పైడిశెట్టి,ముని పైడయ్య,అప్పురుబోతు బంగారాజు,ఎర్నింటి గంగ పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం విజయవంతం

**హాలహర్వి మండలం. ప్రజాజ్యోతి న్యూస్ మే 09:-** హలహర్వి మండల పరిధిలోని బాపురం గ్రామంలో ఆర్ డి టి పాఠశాల ఆవరణంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం విజయ వంతమైనది. టి.తిప్పన్న కూతురు టి.ప్రీతి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని.టి. తిప్పన్న, బి.గాదిలింగ, టి.పార్థన్న ఆధ్వర్యంలో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రధాన నాయకులు మాజీ సర్పంచ్ బి నాగేంద్ర ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైదేహి హాస్పిటల్ బెంగళూరు వారి సౌజన్యంతో డాక్టర్ సాగర్, డాక్టర్



అరవింద్, డాక్టర్ మల్లికార్జున కోఆర్డినేటర్ వైద్య నిపుణులు గుండె సంబంధించిన వ్యాధులు, కీళ్లు నరాల సంబంధించిన సమస్యలు, కంటి సమస్యలు, కిడ్నీలో రాళ్ల సమస్యలు, క్యాన్సర్ వ్యాధులు ఇతర ఆరోగ్య సమస్యలకు ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించబడినది. ఈ శిబిరంలో స్థానిక



ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలు పొందారు. వివిధ రకాల తక్షణ వ్యాధులకు సంబంధించిన రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో బాపురం, పచ్చారపల్లి గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు తదితర నాయకులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు: ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్


మాదకద్రవ్యాలు తీసుకోవడం వల్ల కలిగే నష్టాలపై అవగాహన

పాలకొల్లులో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ప్రదర్శన




**పాలకొల్లు (ప్రజాజ్యోతి), మే-9:** మత్తు పదార్థాల అలవాటుతో జీవితాలు చిత్తు అవుతాయని ఎక్సైజ్ శాఖ పాలకొల్లు సీఐ మద్దాల శ్రీనివాస్ అన్నారు. పాలకొల్లు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో శనివారం పాలకొల్లులో గంజాయి, నాటుసారా ఆల్కహాల్ మరియు డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యములు వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించే అవగాహన కార్యక్రమంలో భాగంగా పాలకొల్లు టౌన్ ఏపీ టిడ్కో గృహాల సముదాయం వద్ద ప్రత్యేక అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మద్దాల శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ ప్రగతి యువత చేతుల్లోనే ఉందని, ఆ యువత మత్తు పదార్థాలకు పారిసై చెడు అలవాట్లకు లోనై సంఘ విద్రోహ శక్తులుగా, హానికరులుగా మారుతున్నారన్నారు. ఉజ్వల భవిష్యత్తును మరచి డ్రగ్స్ కు బానిసగా మారి తల్లిదండ్రులకు బంధువులకు గ్రామానికి చెడ్డ పేరు తీసుకొస్తూ తమ జీవితాలను అంధకారంలోకి దిగుతున్నారు. మా దగ్గర సమాజమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. రాష్ట్ర జలవనుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు డ్రగ్స్ నిషేధంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు ఎస్ ఐ మహేష్, ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది, యువకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## లక్ష రూపాయల విలువైన వేరుశెనగ పొట్టు చోరీ..




**కంబదూరు మే 9: (ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** కంబదూరు మండల పరిధిలోని ఐపార్సపల్లి గ్రామానికి చెందిన రంగానాయక్ అనునతడికి సంబంధించిన వేరుశనగ పొట్టును గత రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకొని వెళ్లారని బాధితుడు వాపోయారు. గొర్రెల మేత కోసం లక్ష, రూపాయలు వెచ్చించి గత నెల రోజుల క్రితం కొనుగోలు చేసి ఆ గ్రామ సమీపంలోని తన పొలం నందు నిల్వ ఉంచినట్లు అక్కడి స్థానికులు, బాధితుడు తెలిపారు.. రాత్రికి రాత్రే ట్రాక్టర్ లో గుర్తు తెలియని దుండగులు వేరుశనగ పొట్టును చోరీ చేసినట్లు జాడ కనిపిస్తుందని బాధితుడు ఆవేదన వెలిబుచ్చారు.ఈ విషయమై స్థానిక పోలీసులకు పిర్యాదు చేసి , న్యాయం చేయాలని బాధిత రైతు కోరుకున్నారు.

## అరకు ఇంచార్జ్ దోన్ను దొర కుటుంబీకులపై నిమ్మలపాడు మైనింగ్ మాఫియా దాడి.

ఇద్దరికి తీవ్ర గాయాలు. పోలీసులకు ఫిర్యాదు.

**అనంతగిరి మండలం. మే 9. ప్రజా జ్యోతి న్యూస్. రిపోర్టర్ శంకర్.** అనంతగిరి మండలం అంటేనే ప్రశాంతతకు నిలయం అలాంటి నిలయంలో మైనింగ్ మాఫియా. భూమాఫియాలు చొరబడి అమాయక గిరిజనులపై దాడులుకు దిగిన వైనం వెలుగులోకి వచ్చింది. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం వాలాసి పంచాయతీ పరిధి నిమ్మలపాడు గ్రామంలో నిమ్మలపాడు గ్రామానికి చెందిన ఒక గిరిజన వ్యక్తికి సంబంధించిన వివాహ వేడుకకు అరకు ఇన్చార్జి శివేరి దోన్నుదొర కు సంబంధించిన కుటుంబ సభ్యులు శుక్రవారం హాజరయ్యారు వేడుక అనంతరం నిమ్మలపాడు గ్రామానికి దగ్గరలో ఉన్న మైనింగ్ ప్రాంతాన్ని సరదాగా తిలకించేందుకు కుటుంబ సభ్యులు పిల్లలతో వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో పిల్లలు సరదాగా ఒక రాయి ముక్కను తీసి చూస్తున్నారు. ఆ సమయంలో మైనింగ్ కు సంబంధించిన వ్యక్తులు అంటే మైనింగ్ మాఫియా ఒక్కసారిగా మూ కుమ్మడిగా దాడి చేసి ఇద్దరు అన్నదమ్ములను తీవ్రంగా గాయపరిచారు. మైనింగ్ ను తిలకించేందుకు వెళ్లిన వ్యక్తులకు మైనింగ్ కు ఎటువంటి సంబంధం లేదు. అయినప్పటికీ మైనింగ్ మాఫియా దాడి చేయడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో బాధితులు శనివారం నాడు స్థానిక పోలీస్ స్టేషన్ కు ఫిర్యాదు చేశారు. మైనింగ్ యజమానులు మైనింగ్ మాఫియాను పెంచి పోషిస్తున్నట్లు సమాచారం. మైనింగ్ మాఫియా ఎవరైతే ఉన్నారో ఉన్న వ్యక్తులు మైనింగ్ యజమానికి చెందినవారీగా తెలిసింది.

## అల్లాడుపల్లె లో 124 మందికి ఎక్స్ రేలు

నక్కల దిన్నె వైద్యాధికారి డాక్టర్ ఓబులేసు.



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ మే 9 (ప్రజా జ్యోతి)** కడప జిల్లా చాపాడు మండలం అల్లాడుపల్లిలో టిబిపై మెగా హెల్త్ స్క్రీనింగ్.. 124 మందికి ఎక్స్రే పరీక్షలు జరిపామని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి ఓబులేసు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఓబులేసు మాట్లాడుతూ అల్లాడుపల్లి ఎ ఎ యం. కేంద్రంలో సున్నిత వర్గాల ప్రజల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా టిబి ముక్త్ భారత్ అభియాన్ 2.0 కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మొత్తం 124 మంది సభ్యులకు హెచ్ హెచ్ ఎక్స్-రే యంత్రం సహాయంతో టిబి నిర్ధారణ స్క్రీనింగ్ పరీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ ఓబులేసు పర్యవేక్షించి టిబి వ్యాధిని ముందస్తుగా గుర్తించి నివారించేందుకు ఆరోగ్య శాఖ చేపడుతున్న ప్రత్యేక చర్యలను ప్రజలకు వివరించి అవగాహన కల్పించారు. హెచ్ ఓ లు, ఎ ఎన్ యం లు, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారని డాక్టర్ ఓబులేసు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిబి సూపర్వైజర్ సురేష్, సూపర్వైజర్లు భవాని, ప్రసాద్ డీఈఓ తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణలో బాపట్లకు రాష్ట్ర స్థాయి గుర్తింపు

స్మార్ట్ పోలీసింగ్‌లో రెండో ర్యాంక్ సాధించిన జిల్లా పోలీస్ శాఖ

లైంగిక నేరాల దర్యాప్తులో 95 శాతం పురోగతి

-- ప్రజాభద్రతలో కొత్త ప్రమాణాలు



**బాపట్ల మే 09 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌లో బాపట్ల జిల్లా పోలీస్ శాఖ రాష్ట్ర స్థాయిలో విశేష గుర్తింపు పొందింది. ఏపీ స్మార్ట్ పోలీసింగ్ యూనిట్ పెర్ఫార్మెన్స్ డ్యాష్‌బోర్డ్‌లో రాష్ట్రవ్యాప్తంగా రెండో ర్యాంక్ సాధించడం ద్వారా జిల్లా పోలీస్ శాఖ తన ప్రతిభను మరోసారి నిరూపించింది. ముఖ్యమంత్రి అధ్యక్షతన అమరావతిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కలెక్టర్లు--ఎస్పీల సదస్సులో బాపట్ల జిల్లా పనితీరును ప్రత్యేక పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించడం జిల్లాకు గర్వకారణమైంది.

### నేరాల తగ్గింపులో గణనీయ ఫలితాలు

ఏపీ పోలీస్ వార్షిక గణాంకాల ప్రకారం 2025-26 ఆర్థిక సంవత్సరంలో బాపట్ల జిల్లాలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గింది. మొత్తం నేరాలు 11.6 శాతం తగ్గగా, బాడీలీ ఆఫెన్సులు 20.4 శాతం తగ్గడం విశేషం. అల్లర్ల కేసులు 69.2 శాతం మేర తగ్గడం ద్వారా శాంతిభద్రతల పరిరక్షణలో జిల్లా పోలీస్ శాఖ సమర్థవంతమైన చర్యలు తీసుకున్నట్లు స్పష్టమవుతోంది.

### మహిళా భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం

మహిళల రక్షణ, భద్రత విషయంలో బాపట్ల జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. మహిళా భద్రతకు సంబంధించిన కేసుల్లో 12.1 శాతం మెరుగుదల నమోదైంది. ముఖ్యంగా లైంగిక నేరాల దర్యాప్తులో 95 శాతం పురోగతి సాధించడం రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు అందుకుంటోంది. బాధితులకు త్వరిత న్యాయం అందేలా కేసుల విచారణ వేగవంతం చేయడం పోలీస్ శాఖ సమర్థతకు నిదర్శనంగా నిలిచింది.

### సాంకేతిక పోలీసింగ్‌లో ఆదర్శ జిల్లా

సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించడంలో కూడా బాపట్ల జిల్లా ముందంజలో నిలిచింది. సి,సి,టిఎన్,ఎస్ వ్యవస్థ, ఈ-సాక్ష్య విధానం, డ్రోన్ల వినియోగం, డయల్-112 సేవలు వంటి 19 సాంకేతిక పారామీటర్లలో జిల్లా అత్యుత్తమ పనితీరును కనబరిచింది. ఆధునిక టెక్నాలజీతో నేరాల గుర్తింపు, నిఘా వ్యవస్థ, అత్యవసర సేవల స్పందనలో వేగం పెరగడం వల్ల ప్రజల్లో పోలీసులపై నమ్మకం మరింత బలపడింది.

### రోడ్డు ప్రమాదాల నివారణలో రికార్డు

జిల్లాలో ప్రమాదాలకు కారణమవుతున్న బ్లాక్‌స్పాట్లను గుర్తించి వాటి సవరణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేశారు. దీంతో రోడ్డు ప్రమాదాల నియంత్రణలో కూడా బాపట్ల జిల్లా మంచి ఫలితాలు సాధించింది.

### ప్రజల భద్రతే ధ్యేయం

ప్రజల భద్రతే మా ప్రధాన లక్ష్యం. నేరాలకు బాపట్ల జిల్లాలో ఎలాంటి స్థానం లేదు. సాంకేతిక పోలీసింగ్, ప్రజల సహకారం, సమర్థవంతమైన దర్యాప్తు ద్వారా మరింత మెరుగైన సేవలు అందిస్తాం అని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.రాష్ట్ర స్థాయిలో బాపట్ల జిల్లా పోలీస్ శాఖకు లభించిన ఈ గుర్తింపు పోలీస్ అధికారులు, సిబ్బంది సమిష్టి కృషికి నిదర్శనంగా నిలుస్తోందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# సింగపూర్ విద్యా పర్యటన ముగింపు

రాష్ట్రానికి చేరుకున్న ఏపి ఉత్తమ ఉపాధ్యాయుల బృందంలి

**బుట్టాయగూడెం మే09(ప్రజాజ్యోతి):-** సింగపూర్‌లో విద్యా విధానం అమలు పైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల బృందం సింగపూర్ వెళ్లిన నేపథ్యంలో పర్యటన ముగించుకొని శనివారం రాష్ట్రానికి చేరుకున్నారు.ఏలూరు జిల్లా నుండి ఈ బృందంలో పాల్గొన్న బుట్టాయగూడెం హై స్కూల్ ప్లస్ జువాలజీ అధ్యాపకుడు గుర్రం గంగాధర్ ఈ పర్యటన యొక్క ముఖ్య అంశాలను ప్రకటన ద్వారా తెలియజేసారు.ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్జాతీయ ప్రమాణాల విద్యను ప్రవేశపెట్టే లక్ష్యంతో ఈ విద్యా పర్యటనను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది.సింగపూర్‌లోని ప్రముఖ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్(ఎన్ఐఇ)లో డిజైనింగ్ లెర్నింగ్, ఇన్‌స్పైరింగ్ థింకింగ్" అనే అంశంపై మే 4 నుంచి 8 వరకు ఐదు రోజుల పాటు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ తొలి విడత పర్యటనలో 2025 సంవత్సరానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన 37 మంది పాల్గొన్నారన్నారు. వీరిలో 10 మంది హెడ్‌మాస్టర్లు, 18 మంది స్కూల్ అసిస్టెంట్లు, నలుగురు ప్రిన్సిపాల్స్, ఐదుగురు ఫిజికల్ డైరెక్టర్లు ఉన్నారని అన్నారు.వినూత్న విద్యా విధానాలపై అధ్యయనం శిక్షణలో భాగంగా ఉపాధ్యాయులు ప్రధానంగా డిజిటల్ పెడగోగి, క్రిటికల్ థింకింగ్, ఆధునిక బోధనా పద్ధతులు,పాఠశాల నిర్వహణ వ్యవస్థలపై ప్రత్యేక అవగాహన పొందారన్నారు.విద్యార్థుల్లో విశ్లేషణాత్మక ఆలోచనలను పెంపొందించే పద్ధతులను కూడా అధ్యయనం చేశారన్నారు.అదేవిధంగా సింగపూర్‌లోని ప్రముఖ విద్యాసంస్థలు,ముఖ్యంగా యిషన్ సెకండరీ స్కూల్ ను సందర్శించి అక్కడ అమలవుతున్న నిర్వహణ విధానాలను పరిశీలించినట్లు తెలిపారు.సింగపూర్‌లో నేర్చుకున్న ఉత్తమ విద్యా విధానాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసేందుకు ఈ ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా వ్యవహరిస్తారని ఆయన అన్నారు.ఇతర ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి ఆధునిక బోధనా విధానాలను విస్తృత స్థాయిలో ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమం రెండో విడతలో మరో 29 మంది ఉపాధ్యాయులను ప్రపంచ ప్రఖ్యాత విద్యా విధానాలకు పేరుగాంచిన ఫిన్లాండ్‌కు పంపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ. సింగపూర్ పర్యటన తమకు




విశేష అనుభవాన్ని అందించిందని, అక్కడి విద్యా విధానాల్లోని మెరుగైన అంశాలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందించడం జరుగుతుందని వారు తెలిపారు.

# కటిక చీకట్లో కారు దీపం లాంటిది
# కాళేశ్వరం ప్రాజెక్టు

కాళేశ్వరాన్ని కించపరిస్తే, ముక్తేశ్వరుడి శిక్ష తప్పదు.. తస్మాత్ జాగ్రత్త..

మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు



**సిద్దిపేట :** మేడిగడ్డ మరమ్మతులు చేతగాక, తమ్మిడిహట్టి వద్ద కాంగ్రెస్ డ్రామాలు.150 మీటర్లకు ఒప్పందం జరిగితే కిరణ్ కుమార్ రెడ్డి హయాంలో తట్టెడు మట్టైనా ఎందుకు తీయలేదు, కాంగ్రెస్ మంత్రులకు ప్రాజెక్టులపై కనీస అవగాహన లేదు..ఎవరికి తోచినట్లు వాళ్లు మాట్లాడుతున్నారు. పక్క రాష్ట్రాలకు బహిరంగ లేఖలు రాస్తూ రెచ్చగొట్టడం మానేసి, కేసీఆర్ లా ఆ రాష్ట్రాలను మెప్పించి తెలంగాణ ప్రయోజనాలు సాధించడం నేర్చుకోండి.ఎల్ నినో ముప్పుతో రాబోయే కరువును ఎదుర్కోవాలంటే, తక్షణమే మేడిగడ్డ పిల్లర్లకు రిపేర్లు చేసి రైతాంగానికి సాగునీరు అందించాలి.బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్,మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్.తమ్మిడిహట్టి ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని, బీఆర్ఎస్ పై చేస్తున్న దుష్ప్రచారాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. సిద్దిపేటలోని క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మేడిగడ్డ వద్ద కుంగిన రెండు పిల్లర్లకు మరమ్మతులు చేయకుండా రాష్ట్ర ప్రయోజనాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం గాలికి వదిలేసిందని, వచ్చే ఏడాది రాబోయే కరువును ఎదుర్కోవాలంటే మేడిగడ్డ రిపేర్లు వెంటనే పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.మాజీ మంత్రి హరీశ్ రావు కామెంట్స్:ఆదిలాబాద్ జిల్లా తమ్మిడిహట్టి వద్ద కాంగ్రెస్ మంత్రుల హడావిడి చూసిన తర్వాత ఒక విషయం అర్థమవుతోంది..పని తక్కువ ప్రచారం ఎక్కువ. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులకు వాగుడు తప్ప చేతలు శూన్యం.ఎల్ నినో ప్రభావంతో కరువు వస్తుందని తెలిసినప్పుడు హడావిడిగా బాయి తవ్వినట్లు కాకుండా, ముందస్తుగా మేడిగడ్డ రిపేర్లు చేయాలి. కానీ దాన్ని వదిలేసి తమ్మిడిహట్టి కడుతున్నట్లు పేపర్లకు ఫోజులిస్తున్నారు. కురచ బుద్ధితో బీఆర్ఎస్ పై బురద జల్లే కార్యక్రమం తప్ప వారు చేస్తున్నది శూన్యం.150 మీటర్ల ఎత్తులో నిర్మాణానికి ఒప్పందం జరిగిందని మంత్రి వివేక్ పచ్చి అబద్ధాలు చెబుతున్నారు. ఒక మంత్రి హోదాలో ఉండి ప్రజలు ఏమనుకుంటారన్న సోయి లేకుండా ఇంత పిచ్చి అబద్ధం మాట్లాడొచ్చా.నిజంగానే ఒప్పందం ఉంటే, ఉమ్మడి రాష్ట్రంలో ఏడున్నరేండ్లు అధికారంలో ఉండి కూడా తట్టెడు మట్టైనా ఎందుకు తవ్వలేదు.

## రోడ్లపై ధాన్యం ఆరబోయడం వలన రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ.

రహదారులపై ధాన్యం ఆరబోసి ప్రమాదాలకు కారణమయ్యే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవు

రైతులు ప్రభుత్వం సూచించిన నిర్దిష్ట కల్లాల్లోనే ధాన్యం ఆరబోసుకోవాలి.

డీఎస్పీ వెంకటేశ్వర్లు

**మహబూబ్ నగర్ :** జిల్లాలో కొంతమంది రైతులు, వ్యాపారులు రహదారులపై ధాన్యం ఆరబోస్తుండటంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ముఖ్యంగా రాత్రి సమయంలో రోడ్లపై ఆరబోసిన ధాన్యం సరిగా కనిపించక వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. రోడ్లపై ధాన్యం ఆరబోయడం వలన వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడమే కాకుండా, ప్రజల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుతుందని అన్నారు. ఈ నేపథ్యంలో రహదారులపై ధాన్యం ఆరబోసి రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు తమ ధాన్యాన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన నిర్దిష్ట కల్లాల్లో లేదా వ్యవసాయ శాఖ సూచించిన ప్రదేశాల్లోనే ఆరబోసుకోవాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని డిఎస్పీ కోరారు.

## కొనుగోలు కేంద్రాలలో నెలల తరబడి రైతుల పడిగాపులు.

**వనపర్తి :** జిల్లాలో సివిల్ సప్ లై అధికారులు పూర్తిగా విఫలం. క్షేత్రస్థాయిలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పరిశీలించాలి.బీసీ పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోవడానికి వస్తున్నా రైతుల గోస అ ధికారులకు పట్టదా అని నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో శనివారం రోజున బిసి నాయకుల సమావేశంలో మండిపడ్డారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ఎటు చూసినా రోడ్డుపైన మొక్కలు, వడ్లు అరబోసి ఉండడంతో వ్యవసాయ మార్కెట్ కి వెళ్లి కొనుగోలు కేంద్రాలలో అక్కడ పరిశీలించగా రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న దన్నోజు అరవింద్ చారి ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ వడ్లు, మొక్కజొన్నలు సకాలంలో కొనుగోలు చేయకుండా అధికారులు తాత్సారం చేస్తున్నారన్నారు. నెలల తరబడి కొనుగోలు కేంద్రాలలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కనీసం మౌలిక వసతులు కూడా లేని పరిస్థితుల్లో మార్కెట్ యార్డుల్లో లేవని ఆవేదన వ్యక్తం చేశారు. నెలలు తరబడి ధాన్యం దగ్గర పడిగాపులు కాసే విధంగా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. చలికి, ఎండకు, వానకు సంబంధం లేకుండా ప్రతి నెల క్రమం తప్పకుండా ప్రభుత్వం అధికారులకు వేతనాలు చెల్లిస్తుంటే, రైతులు మాత్రం ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోవడానికి కూడా నెలల తరబడి నిరీక్షించాల అని ప్రశ్నించారు. కేవలం పైపై సమీక్షలు చేస్తే సరిపోదని, అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని నిలదీశారు. జిల్లాలో సివిల్ సప్లై వ్యవస్థ సక్రమంగా పని చేసి రైతులకు న్యాయం జరిగే విధంగా కృషి చేయాలని, అలా జరగనప్పుడు దళారులు రైతులను నిలువున ముంచి తక్కువ ధరలకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు కలుగుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని, తక్షణమే ధాన్యం కాంటాలు చేసి ప్రభుత్వం ప్రతి గింజ కొనుగోలు చేయాలని లేనిపక్షంలో రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని బీసీ పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి హెచ్చరించారు. ఈ సమావేశంలో నాగర్ కర్నూల్ జిల్లా బిసి పొలిటికల్ జేఏసీ నాయకులు యశ్వంత్ గౌడ్, శివ, శేఖర్, రాజు, మహేందర్ నాయుడు, అంజి యాదవ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకో ఫాంహౌజ్ డ్రగ్స్ కేసులు మాకు తెలియదు

రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం కల్ల:

బండి సంజయ్ కుమార్

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అహంకారంవల్లే ఆయన తండ్రి కేసీఆర్ ఫాంహౌజ్‌కు పరిమితమయ్యారని కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శించారు. కేటీఆర్‌ను చూసి బీఆర్ ఎస్ కార్యకర్తలే అసహ్యించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. ప్రధాని రాక సందర్భంగా బండి నేతృత్వంలో ఆర్టీసీ ఎక్స్‌రోడ్ నుంచి అమీర్‌పేట వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కేటీఆర్ మాదిరిగా దోచుకోవడం నాకు తెలియదు. రైతులకు బేడీలు వేసి అరిగోస పెట్టడం నాకు తెలియదు..డ్రగ్స్ తీసుకోవడం నాకు తెలియదు..కాళేశ్వరం, ఈ-ఫార్ములా, విద్యుత్ కొనుగోళ్ల అవినీతి మాకు తెలియదు..ఫాంహౌజ్ డ్రగ్స్ కేసులు మాకు తెలియదు, మంది కొంపలు ముంచడం అసలే తెలియదు, ఉద్యోగులు ఆత్మహత్యలు చేసుకునేలా చేయడం మాకు తెలియదు, మాకు ఏం తెలుసో ప్రజలు నిర్ణయిస్తారు. మీకు ఏం తెలుసో ప్రజలు గ్రహించి మిమ్మల్ని ఓడించారు అని ఎద్దేవా చేశారు. కేటీఆర్ ఇష్టంవచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.కేటీఆర్ అధికారంలో ఉన్నప్పుడు అహంకారం చూపించి, ఇప్పుడు అధికారం పోయాక కార్యకర్తల ఇళ్లకు వెళ్లి కాళ్లు మొక్కుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ఏం చేసినా రాష్ట్రంలో ఇక అధికారంలోకి రావడం కల్ల అని అన్నారు. ఎప్పుడు ఎన్నికలొచ్చినా అధికారంలోకి వచ్చేది బీజేపీయేనని పేర్కొన్నారు. ఢిల్లీ నుంచి తాము నిధులు తెస్తుంటే కాంగ్రెస్ నేతలు తెలంగాణ సొమ్మును ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు పంపుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నోటి దురుసుతనమే తమ పార్టీ కార్యకర్తల ఆగ్రహానికి కారణమని బీజేఎల్పీ ఉప నేత పాయల్ శంకర్ అన్నారు.

## బీజేపీ ఎంపీ బండి సంజయ్ కుమారుడిపై పోక్సో కేసు.. తెలంగాణ రాజకీయాల్లో కలకలం

**హైదరాబాద్ :** హైదరాబాద్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి,కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు కావడం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మైనర్ బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఫిర్యాదు ప్రకారం,17 ఏళ్ల మైనర్ బాలికకు మద్యం తాగించి లైంగిక దాడికి పాల్పడ్డాడని ఆరోపించారు. మొయినాబాద్ ప్రాంతంలోని ఫార్మ్ హౌస్‌తో పాటు మరో రెండు ప్రాంతాల్లో ఈ ఘటనలు జరిగినట్లు బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు వివరించినట్లు సమాచారం.ఈ కేసులో భారతీయ న్యాయ సంహిత బిఎన్ఎస్ సెక్షన్లు 74, 75తో పాటు పోక్సో చట్టంలోని సెక్షన్ 11 తీ/లి 12 కింద బండి సాయి భగీరథ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిసింది.ప్రస్తుతం పోలీసులు బాధితురాలి వాంగ్మూలం,కాల్ డేటా,డిజిటల్ ఆధారాలు,మెడికల్ సంబంధిత వివరాలను సేకరిస్తున్నట్లు సమాచారం.ఇక బాధితురాలి తల్లిదండ్రులు సంచలన ఆరోపణలు చేస్తున్నారు.తమ కుమార్తెపై మానసిక ఒత్తిడి పెరగడంతో రెండు సార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అలాగే కేసు నుంచి తప్పించుకునేందుకు తమ కూతురిపైనే తప్పుడు కేసులు పెట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు.అయితే ఈ వ్యవహారంపై బండి సంజయ్ వర్గం పూర్తిగా భిన్నమైన వాదన వినిపిస్తోంది. ఇది రాజకీయ ప్రేరేపిత"హనీ ట్రాప్"వ్యవహారమని,తమ వద్ద నుంచి రూ.5 కోట్ల డిమాండ్ చేశారని చెబుతున్నారు.రాజీ ప్రయత్నాల్లో భాగంగా రూ.50 వేల రూపాయలు ఇచ్చినట్లు కూడా ప్రచారం జరుగుతోంది.అయితే"ఎలాంటి తప్పు చేయనప్పుడు డబ్బులు ఎందుకు ఇచ్చారు?అన్న ప్రశ్న ఇప్పుడు సోషల్ మీడియాతో పాటు రాజకీయ వర్గాల్లోనూ చర్చకు దారి తీస్తోంది.ఈ అంశంలో నిజానిజాలు పోలీసు దర్యాప్తులోనే తేలాల్సి ఉంది.ప్రస్తుతం ఈ కేసు రాజకీయంగా కూడా వేడెక్కుతోంది.అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటుండగా,సోషల్ మీడియాలో ఈ వ్యవహారం వైరల్‌గా మారింది.కేసు దర్యాప్తు ఏ మలుపు తిరుగుతుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## సంపాదకీయం

# లాభాలు పండిస్తున్న యుద్ధం

ఇరాన్‌తో అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా, ప్రపంచవ్యాప్తంగా సామాన్యులు ఆర్థిక భారంతో సతమతమవుతుంటే, కొన్ని కంపెనీలు భారీ లాభాలు గడిస్తున్నాయి.యుద్ధం సృష్టించిన అనిశ్చితితో పాటు ఇరాన్ 'స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్'ను మూసివేయడం వల్ల ప్రజల జీవన వ్యయం భారీగా పెరిగింది. దీని ప్రభావం కంపెనీలు, కుటుంబాలు, ప్రభుత్వాల బడ్జెట్‌లపై తీవ్రంగా పడింది.ఇలా ఒకవైపు అనేకమంది ఆర్థికంగా కుదేలై దివాలా అంచున నిలబడితే, మరోవైపు యుద్ధ సమయాల్లో ఎక్కువ లాభాలు పొందే వ్యాపారాలు, అస్థిరమైన ఇంధన ధరల ద్వారా లబ్ధి పొందే మరికొన్ని సంస్థలు మాత్రం రికార్డు స్థాయిలో సంపాదనను కళ్ల చూస్తున్నాయి.ఇరాన్ యుద్ధం కారణంగా ఇప్పటిదాకా కనిపించిన అతిపెద్ద ఆర్థిక ప్రభావం ఇంధన ధరల పెరుగుదలే.ప్రపంచంలోని చమురు, సహజ వాయువులలో దాదాపు ఐదో వంతు (20 శాతం) 'స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్' ద్వారా రవాణా అవుతుంది. అయితే, ఫిబ్రవరి చివరి నాటికి ఈ రవాణా దాదాపు పూర్తిగా నిలిచిపోయింది. ఫలితంగా ఇంధన మార్కెట్లలో ధరల హెచ్చుతగ్గులు ఒక 'రోలర్ కోస్టర్'లా మారిపోయాయి.ఈ పరిస్థితిని ప్రపంచంలోని కొన్ని అతిపెద్ద చమురు, గ్యాస్ కంపెనీలు తమకు అనుకూలంగా మార్చుకుని భారీగా లాభపడ్డాయి.ప్రధానంగా ఐరోపాకు చెందిన దిగ్గజ చమురు సంస్థలు లబ్ధి పొందాయి.ఈ కంపెనీలకు సొంతంగా ట్రేడింగ్ విభాగాలు ఉండటంతో, మార్కెట్‌లో ధరల్లో వచ్చిన భారీ మార్పులను తమకు అనుకూలంగా మార్చుకుని లాభాలు పెంచుకోగలిగాయి.ముఖ్యంగా బ్రిటిష్ పెట్రోలియం (బీపీ) కంపెనీ లాభాలు ఈ ఏడాది మొదటి మూడు నెలల్లోనే రెండింతలు పెరిగి 3.2 బిలియన్ డాలర్ల (సుమారు రూ.30,230 కోట్లు)కు చేరుకున్నాయి. తన ట్రేడింగ్ విభాగం కనబరిచిన 'అసాధారణ' పనితీరు వల్లే ఈ స్థాయిలో లాభాలు వచ్చాయని సదరు కంపెనీ పేర్కొంది.షెల్ కంపెనీ తన మొదటి త్రైమాసిక లాభాలు 6.92 బిలియన్ డాలర్ల (సుమారు రూ.65,379 కోట్లు)కు పెరిగినట్లు నివేదించింది. ఇది విశ్లేషకుల అంచనాలను కూడా మించిపోయింది.మరో అంతర్జాతీయ దిగ్గజ సంస్థ 'టోటల్ ఎనర్జీస్' చమురు, ఇంధన మార్కెట్లలోని హెచ్చుతగ్గుల కారణంగా 2026 మొదటి త్రైమాసికంలో తన లాభాలను దాదాపు మూడో వంతు పెంచుకుని, 5.4 బిలియన్ డాలర్ల (సుమారు రూ.51,014 కోట్లు)కు చేరుకుంది.మధ్యప్రాచ్యంలో ఇంధన సరఫరాకు ఏర్పడిన ఆటంకాల కారణంగా అమెరికా దిగ్గజ సంస్థలు ఎక్సాన్ మొబిల్, షెవ్రాన్ ఆదాయాలు గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే తగ్గాయి.అయితే, ఈ రెండు కంపెనీలు విశ్లేషకుల అంచనాలను మించి రాణించాయి. యుద్ధం ప్రారంభమైనప్పటి కంటే చమురు ధరలు ఇప్పటికీ గణనీయంగా ఎక్కువగానే ఉండటంతో, ఈ ఏడాది గడిచేకొద్దీ తమ లాభాలు మరింత పెరుగుతాయని అవి భావిస్తున్నాయి.కొన్ని అతిపెద్ద బ్యాంకులు కూడా ఇరాన్ యుద్ధ సమయంలో తమ లాభాలను భారీగా పెంచుకున్నాయి.జేపీ మోర్గాన్ ట్రేడింగ్ విభాగం 2026 మొదటి మూడు నెలల్లో రికార్డు స్థాయిలో 11.6 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1,09,585 కోట్లు) ఆదాయాన్ని ఆర్జించింది. ఇది ఆ బ్యాంక్ మొత్తం మీద తన చరిత్రలోనే రెండవ అతిపెద్ద త్రైమాసిక లాభాన్ని నమోదు చేయడంలో సహాయపడింది.అలాగే బ్యాంక్ ఆఫ్ అమెరికా, మోర్గాన్ స్టాన్లీ, సిటీ గ్రూప్, గోల్డ్‌మన్ సాక్స్, వెల్స్ ఫార్గో వంటి మిగిలిన 'బిగ్ సిక్స్' బ్యాంకులన్నీ కూడా ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో గణనీయమైన లాభాలను సాధించాయి.మొత్తంగా, ఈ బ్యాంకులు 2026 మొదటి మూడు నెలల్లో 47.7 బిలియన్ డాలర్ల (సుమారు రూ.4,50,621 కోట్లు) లాభాలను నివేదించాయి.భారీ స్థాయిలో జరిగిన ట్రేడింగ్ లావాదేవీలు ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులకు, ముఖ్యంగా మోర్గాన్ స్టాన్లీ, గోల్డ్‌మన్ సాక్స్ సంస్థలకు బాగా లబ్ధి చేకూర్చాయి" అని వెల్త్ క్లబ్ ప్రధాన ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ సుసానా స్ట్రీటర్ పేర్కొన్నారు.పెట్టుబడిదారులు రిస్క్ ఎక్కువగా ఉండే స్టాక్స్, బాండ్లను వదిలించుకుని, సురక్షితమైన ఆస్తులలో పెట్టుబడి పెట్టడానికి పోటీ పడటంతో ట్రేడింగ్‌కు పెరిగిన డిమాండ్ వాల్ స్ట్రీట్ రుణదాతలకు బాగా కలిసివచ్చింది.అలాగే, ఆర్థిక మార్కెట్లలో నెలకొన్న అస్థిరతను సొమ్ము చేసుకోవాలని పెట్టుబడిదారులు ప్రయత్నించడం వల్ల కూడా ట్రేడింగ్ లావాదేవీల పరిమాణం గణనీయంగా పెరిగింది."యుద్ధం వల్ల తలెత్తిన అస్థిరత ట్రేడింగ్ ఒక్కసారిగా పెరగడానికి కారణమైంది. పరిస్థితులు మరింత విషమిస్తాయన్న భయంతో కొందరు పెట్టుబడిదారులు తమ స్టాక్స్‌ను విక్రయించగా, మరికొందరు తక్కువ ధరల్లో కొనుగోలు చేశారు. ఇది మార్కెట్ మళ్లీ పుంజుకోవడానికి దోహదపడింది" అని స్ట్రీటర్ విశ్లేషించారు.ఎఫ్–35 ఫైటర్ జెట్ భాగాల సహా వివిధ ఉత్పత్తులను తయారుచేసే బీఏఈ సిస్టమ్స్, ట్రేడింగ్ అప్‌డేట్‌లో ఈ ఏడాది అమ్మకాలు, లాభాల్లో బలమైన వృద్ధిని ఆశిస్తున్నట్లు తెలిపింది.ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న 'రక్షణపరమైన ముప్పులు' ప్రభుత్వ రక్షణ వ్యయాన్ని పెంచుతున్నాయని, ఇది తమ కంపెనీకి 'అనుకూలమైన వాతావరణాన్ని' సృష్టించిందని ఆ సంస్థ పేర్కొంది.ప్రపంచంలోని అతిపెద్ద రక్షణ కాంట్రాక్టర్లలో మూడు సంస్థలైన లాక్‌హీడ్ మార్టిన్, బోయింగ్, నార్త్రోప్ గ్రూమ్మన్ 2026 మొదటి త్రైమాసికం చివరి నాటికి తమ వద్ద రికార్డు స్థాయిలో ఆర్డర్లు పేరుకుపోయినట్లు నివేదించాయి.అయితే, గత కొన్నేళ్లుగా విపరీతంగా పెరిగిన రక్షణ రంగ సంస్థల షేర్లు, మార్చి మధ్య కాలం నుంచి తగ్గుముఖం పట్టాయి. ఈ రంగంలోని షేర్ల విలువ వాస్తవ స్థాయి కంటే ఎక్కువగా ఉందనే ఆందోళనల మధ్య ఈ క్షీణత కనిపిస్తోంది.

# గీతన్నల బతుకు దినదిన గండం

తెలంగాణ గడ్డపై గౌడన్నల కష్టం ప్రాచీనమైనది, అత్యంత సాహసోపేతమైనది. ఆకాశానికి, భూమికి మధ్య వేలాడుతూ, ప్రాణాలను పణంగా పెట్టి కల్లు గీసే గీత కార్మికుడు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో, సంస్కృతిలోనూ కీలక పాత్రధారి. కానీ, నేడు ఆ గీతన్నల బతుకులు ఛిద్రమవుతున్నాయి. తాటి చెట్టు నుంచి ప్రమాదవశాత్తూ పడి ఎంతోమంది దుర్మరణం చెందుతుం డగా, వేలాదిగా గాయపడుతున్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ఆయా కుటుంబాలకు సవ్యంగానే ఆర్థిక భరోసా ఇచ్చింది. రేవంత్ సరార్ గీత కార్మికులపై శీతకన్ను వేస్తున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గీత కార్మికుల సంక్షేమం పాతాళానికి పడిపోయింది. గీత కార్మికుడు చెట్టు పైనుంచి పడి మరణిస్తే ఇచ్చే ఎక్స్‌గ్రేషియా తక్షణమే రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతామని ఎన్నికల ప్రచార సమయంలో కాంగ్రెస్ నేతలు భరోసా ఇచ్చారు. ప్రమాదం జరిగిన 15 రోజుల్లోనే పరిహారం నేరుగా బాధిత కుటుంబ సభ్యుల ఖాతాల్లో పడేలా చేస్తామన్నారు. గీత వృత్తిని గౌరవప్రదంగా మారుస్తామని, ఆధునిక పరికరాలు అందిస్తా మని హామీ ఇచ్చారు. కానీ నేడు వాస్తవ పరిస్థితి చూస్తే.. గీతన్నలను ప్రభుత్వం గాలికి వదిలేసిందని స్పష్టమవుతున్నది. రెండున్నరేండ్లు గడుస్తున్నా. పెంచిన రూ.10 లక్షల పరిహారం బాధితులకు అందకపోగా..గతంలో మాదిరిగా రూ.5 లక్షల పరిహారమైనా ఇప్పించండంటూ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సుమారు 200 మందికి పైగా గీత కార్మికులు ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయారు. వందలాది మంది వెన్నెముక విరిగి, కాళ్లు, చేతులు పడిపోయి మంచాన పడ్డారు. వీరిలో ఒకరికి కూడా పైసా సాయం అందలేదు. ప్రభుత్వ యంత్రాంగం మాత్రం..'నిధులు లేవు', 'పాలసీ ఇంకా ఖరారు కాలేదు' అంటూ కుంటిసాకులు చెప్తూ కాలయాపన చేస్తున్నది. గతంలో ప్రారంభమైన రక్షణ కవచం (సేఫ్టీ కిట్స్) పంపిణీని ఈ ప్రభుత్వం అటకెకించింది. గీత కార్మికులకు అత్యాధునిక మోకు ఇస్తామని చెప్పినా, అది ఎప్పుడు వస్తుందో చెప్పలేని స్థితిలో ఉన్నది. 'నీరా'ను ఒక ఆరోగ్య పానీయంగా ప్రమోట్



చేస్తామని, గీత కార్మికులకు ఉపాధి కల్పిస్తామని చెప్పిన పాలకుల మాటలు నీటి మూటలయ్యాయి. హైదరాబాద్‌లోని 'నీరా' కేఫ్‌లు కళ తప్పాయి. గ్రామీణ ప్రాంతాల్లో 'నీరా' సేకరణ కేంద్రాలు లేవు. మారెటింగ్ సదుపాయం కల్పించటంలో ప్రభుత్వం విఫలమైంది. అబారీ శాఖ ద్వారా ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయల ఆదాయం వస్తున్నది. ఈ ఆదాయంలో అత్యధిక భాగం మద్యం అమ్మకాల ద్వారా ఉంటున్నది. కల్లును కూడా అబారీ శాఖే పర్యవేక్షిస్తుంది. మరి ఆ శాఖ ద్వారా వస్తున్న ఆదాయంలో కనీసం ఒక శాతం కూడా గీత కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయలేకపోవటం అత్యంత దారుణం. గీత కార్మికులు బలమైన ఓటుబ్యాంకుగా ఉన్నప్పటికీ, వారి ఐక్యత లేకపోవటాన్ని ప్రభుత్వం ఆసరాగా తీసుకుంటున్నది. పెండింగ్‌లో ఉన్న వందలాది క్లెయిమ్స్‌ను పరిష్కరించటానికి కనీసం వెయ్యి కోట్ల రూపాయలైనా కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించలేదు. గీత కార్మికుల కుటుంబాలకు మొండిచేయి చూపింది. గీత కార్మికులు మరణిస్తే రూ.5 లక్షల పరిహారం నేరుగా నామినీ ఖాతాలో పడేలా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక వ్యవస్థను రూపొందించారు. కానీ, ఇపుడు ఆ వ్యవస్థ కుప్పకూలింది. పెంచిన పరిహారం కోసం కొత్త జీవో విడుదల చేయటంలో, బడ్జెట్ కేటాయించటంలో ప్రభుత్వం మీనమేషాలు లెకిస్తున్నది. కేసీఆర్ ప్రభుత్వంలో మద్యం ద్వారా వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని గౌడన్నల సంక్షేమానికి కేటాయించే పద్ధతిని అనుసరించింది. కానీ ప్రస్తుత ప్రభుత్వం అబారీ శాఖను కేవలం రాబడి వనరుగా మాత్రమే చూస్తున్నది. మద్యం దుకాణాల లైసెన్సుల ద్వారా వచ్చే వేల కోట్లు ఇతర పథకాలకు పోతున్నాయి తప్ప, గీతన్నల ప్రాణాలకు రక్షణగా నిలబడటం లేదు. ఇకనైనా 50 ఏండ్లు నిండిన గీత కార్మికులకు నెలకు రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలి. ప్రతి గీత కార్మికుడికి ప్రభుత్వం తరపున ఉచితంగా రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ చేయించాలి. హరితహారం కింద నాటే మొకల్లో ఈత, తాటి చెట్లకు ప్రాధాన్యం ఇవ్వాలి.

# విజయారోహణలో ట్విస్టులు

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో రివాజుకు భిన్నంగా ప్రధాన ద్రవిడ పార్టీలు రెండింటినీ రెండంకెలకు పరిమితం చేసి, రాజకీయ తెరపైకి విజేతగా దూసుకొచ్చిన సినీ నటుడు విజయ్‌కి గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ రూపంలో చివరి నిమిషంలోనూ అవరోధాలు ఎదురవుతున్నాయి. ముఖ్యమంత్రిగా శనివారం ఆయన ప్రమాణస్వీకారం చేస్తారని తొలుత అనుకున్నా వీసీకే, ఐయూఎంఎల్ లేఖలు రాలేదని అంటున్నారు.దాంతో విజయ్ వరసగా మూడోరోజు గవర్నర్‌ని కలిసినా ఫలితం లేకపోయింది. సొంతంగా 108 స్థానాలు సాధించి అత్యధిక స్థానాలున్న పార్టీగా ఆవిర్భవించిన విజయ్ నేతృత్వంలోని టీవీకేకు మద్దతిస్తామని అయిదుగురు సభ్యులు న్న కాంగ్రెస్ ప్రకటించగా, తాజాగా రెండేసి స్థానాలున్న సీపీఐ, సీపీఎంలు అంగీకారం తెలిపాయి. ప్రభుత్వ ఏర్పాటుకు 118 అవసరం కాగా, రెండుచోట్లనుంచి గెలిచిన విజయ్ ఎటూ ఒక స్థానం నుంచి తప్పుకోవాలి గనుక టీవీకే నికర బలం 107. రాజీనామా చేసే స్థానం తమకిస్తేనే లేఖ ఇస్తామని వీసీకే పట్టుబట్టగా, ఐయూఎంఎల్ అసలు లేఖే ఇవ్వలేదంటున్నారు. ఈ అంకెల ఆట ఎలావున్నా, ఆర్లేకర్ తీరు సంప్రదాయాలకు విరుద్ధం. ఈనెల 6న విజయ్ తొలిసారి గవర్నర్‌ను కలిసినప్పుడే ఆ వ్యవహారం ముగియాల్సి ఉండగా ఎందుకనో దీన్నింకా సాగదీస్తున్నారు. ఎస్ఆర్ బొమ్మై కేసులో సుప్రీంకోర్టు స్పష్టంగా 'ప్రభుత్వాల బలాబలాలు తేలాల్సింది చట్టసభల్లో తప్ప రాజ్ భవన్‌లలో కాద'ని తెలిపింది. ఉన్నవాటిలో మెజారిటీ పొందిన పక్షమేదో గమనించుకుని ఆహ్వానించటం, బల నిరూపణకు గడువీయడం తప్ప గవర్నర్‌కు మరే ప్రత్యామ్నాయమూ లేదు. అందుకు భిన్నంగా వ్యవహరించటం ఎలా చూసినా ధర్మం



కాదు. ఇది అనవసర అపోహలు, అనుమానాలకు తావిచ్చింది. కేంద్రం రాష్ట్రంలో అస్థిరత కోరుకుంటున్నదనీ, రాష్ట్రపతి పాలన విధిస్తారనీ వదంతులు వ్యాపించాయి. కొన్ని గంటలపాటు డీఎంకే, ఏఐఏడీఎంకేలు కలుస్తాయన్న పుకార్లు షికార్లు చేశాయి. అలా కలిసినా ఆ పక్షాలు విజయ్ దరిదాపుల్లోకి వచ్చే అవకాశం ఉండదు. ఈ ఊహాగానాలకు తావిచ్చేలా జాప్యం చేయటం అవసరమా? బలనిరూపణలో విఫలమైతే విజయ్ సర్కారు తప్పుకోవాల్సిరావొచ్చు. దానివల్ల కలిగే కష్టనష్టాలు ఆయన చూసుకుంటారు. ఆ పరిస్థితి ఏర్పడితే టీవీకే తర్వాత స్థానంలోవున్న పార్టీని ఆహ్వానించాలి.అంతేతప్ప లోక్‌భవన్‌లో లెక్కలు వేస్తూ కూర్చోవటం సరికాదు. విజయ్ తమ లేఖతో పాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేల లేఖ కూడా ఇవ్వటమే సమస్య తెచ్చిందని కొందరు వాదిస్తు న్నారు. ప్రజల మనోభీష్టం నెరవేర్చేందుకు సాంకేతికపరమైన అంశాలు అభ్యంతరం కావటం సరికాదు. పొరుగునున్న కర్ణాటకలో కొన్నేళ్లక్రితం బీజేపీకి తక్కువ స్థానాలొచ్చినా మెజారిటీ స్థానాలున్నాయి గనుక దాన్నే ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించారు. ఆ నిర్ణయాన్నెవరూ తప్పుబట్టలేదు. సర్కారియా కమిషన్ సైతం 1988నాటి నివేదికలో ఎన్నికల ముందు ఏర్పడిన కూటములనూ, లేనట్టయితే ఉన్న పక్షాల్లో అత్యధిక స్థానాలొచ్చిన పార్టీనీ పరిగణనలోకి తీసుకోవాలని అభిప్రాయపడింది. ఈ రెండేళ్లలో విజయ్ సాధించిన రాజకీయ అనుభవం సంగతేమోగానీ... ఈ మూడు నాలుగు రోజుల్లో ఆయనకది దండిగానే దక్కింది. ఈ మొత్తం వ్యవహారంలో కాంగ్రెస్ తీరు జుగుప్సాకరంగావుంది. జాతీయస్థాయిలో ఇండియా కూటమికి నాయ కత్వం వహిస్తూ తన భాగస్వామ్యపక్షం తమిళనాట ఓడిపోగానే చేతులు దులుపుకొని బయటకు పోవటం ఏం నీతి? అందువల్ల విజయ్‌కి వీసమెత్తు ప్రయోజనం లేకపోగా, విపక్ష కూటమికి అది చేటు తెస్తుంది. కనీసం సహ భాగస్వామ్యపక్షాలు డీఎంకే, వీసీకే, సీపీఐ, సీపీఎంలనైనా సంప్రదిస్తే మర్యాదగా ఉండేది. చివరకు సీపీఐ, సీపీఎం వచ్చి చేరాయిగానీ... రాజ్యాంగసంక్షోభ నివారణకే ఆ పనిచేశాయి. ఆ మాత్రం వేచిచూడాలన్న ఇంగితజ్ఞానం లేకపోగా, భవిష్యత్తు ఎన్నికలన్నిటికీ ఈ కొత్త పొత్తు వర్తిస్తుందని ప్రకటించి కాంగ్రెస్ మరింత చులకనైంది. ఒంటరిగా బరిలోదిగి తన సత్తాతో జనాభిమానం చూరగొని మెజారిటీ స్థానాలు పొందిన విజయ్‌కి అవకాశమీయకుండా మీనమేషాలు లెక్కించటం సరికాదు. అది అప్రజాస్వామికం. అన్ని అడ్డంకులూ తొలగి ఆయన ముఖ్య మంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తారని, ప్రజాభీష్టం నెరవేరుతుందని ఆశించాలి.

# కేసీఆర్ ఎప్పుడో చెప్పారు !

ప్రాంతీయ ఆకాంక్షల మీద ఏమాత్రం గౌరవం లేని జాతీయ పార్టీలను రాష్ట్రాల నుంచి తరిమికొట్టాలని, ఇందుకోసం ప్రాంతీయ పార్టీలు ఏకమై కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నా యంగా ఎదగాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎప్పుడో ప్రతిపాదించారు. ఒక్కో ప్రాంతీయ పార్టీ అధినేత దగ్గరకు వెళ్లి కలిసి మరీ జాతీయ పార్టీల దుర్నీతిని వివరించారు. బీజేపీ, కాంగ్రెసేతర ప్రత్యామ్నాయం కోసం పనిచేయాలని సహేతు కంగా నొక్కిచెప్పారు. జాతీయ పార్టీలతో పొత్తుల ప్రసక్తి లేకుండా ప్రాంతీయ అస్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని గట్టిగా చెప్పారు. ప్రాంతీయ అస్తిత్వంతోనే జాతీయ రాజకీయాలు చేయాలని సూచించారు. జాతీయ పార్టీల పంచన చేరకుండా ప్రత్యామ్నాయం ఏర్పాటు చేద్దామని సూచించారు. మమత, కేజ్రీవాల్, అఖిలేశ్, నితీశ్, స్టాలిన్, ఉద్ధవ్, పవార్ అందరి దగ్గరకూ వెళ్లి నచ్చచెప్పటానికి కేసీఆర్ ప్రయత్నించారు. అయితే, ఉత్తరాది ప్రాంతీయ పార్టీల నాయకులు కేసీఆర్ మాటలను పెడచెవిన పెట్టారు. ఏదైనా జాతీయ పార్టీ పంచన వెళ్తేనే తమకు ఉనికి ఉంటుందని, నాలుగు సీట్లు గెలుస్తామని కక్కుర్తి పడ్డారు. ఇవాళ ఫలితాన్ని అనుభవిస్తున్నారు. తమిళనాడులో స్టాలిన్ తాను కాంగ్రెస్‌ను వదిలేది లేదన్నారు. దక్షిణాది ప్రాంతీయ పార్టీలు కూడా కేసీఆర్ ఆలోచనను తక్కువ అంచనా వేశాయి. తెలుగుదేశం పార్టీ ఎప్పుడైనా, ఏదో ఒక జాతీయ పార్టీతో పొత్తులు పెట్టుకోకుండా ముందుకు వెళ్లలేదు కాబట్టి..ఆ పార్టీకి సొంత క్రెడిబిలిటీ అంటూ ఉన్నదని చెప్పలేం. ఇతర పార్టీలు కూడా ఏదో ఒక జాతీయ పార్టీతో అంటకాగకపోతే వెళ్లలేమన్న ఆలోచనతో ఉండటం వల్లనే ఒక్కొక్కటిగా కనుమరుగవుతు న్నాయా? అనే అనుమానం కలుగుతున్నది. తాజాగా, బెంగాల్, తమిళనాడు, కేరళం ఎన్నికల ఫలితాలు ఈ విషయాన్ని మరోసారి నిరూపించాయి. కాంగ్రెస్ ధృతరాష్ట్ర కౌగిలిలో కేజ్రీవాల్, మమత, స్టాలిన్ పార్టీలు నలిగి ముక్కలు ముక్కలయ్యాయి. పార్లమెంట్ ఎన్నికల సందర్భంలో ఇండి కూటమి పేరుతో అన్ని పార్టీల మద్దతును కాంగ్రెస్ తీసుకున్నది. కూటమి పేరుతోనే ఎన్నికల్లో ఆయా రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలతో పొత్తులు పెట్టుకొని స్నేహం నటించి సీట్లు పెంచుకున్నది. కానీ, రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముంచుకొచ్చినప్పుడు ఇండి కూటమితో పార్లమెంట్‌లో తనకు మద్దతుగా నిలిచిన అన్ని పార్టీలకు కాంగ్రెస్ పూర్తిగా చెయ్యిచ్చింది. ఢిల్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్‌పై బీజేపీ కంటే ఎక్కువగా విమర్శలు గుప్పించింది రాహుల్ గాంధీయే. ఢిల్లీ లిక్కర్ స్కాంలో అరెస్టయినప్పుడు కేజ్రీవాల్ వెన్నంటి నిలిచిన రాహుల్, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల దగ్గరకు వచ్చేసరికి కేజ్రీవాల్‌ను అదే లిక్కర్ స్కాంలో దోషిని చేసి దుమ్మెత్తిపోసి బీజేపీ గెలుపునకు రాచబాట వేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో తనకు అండగా నిలిచిన మమతను తాజాగా జరిగిన బెంగాల్ ఎన్నికల్లోనూ రాహుల్ గాంధీ బోనులో నిలబెట్టి.. మొట్టమొదటిసారి బెంగాల్‌లో బీజేపీ అధికారపీఠం ఎక్కటానికి చక్కగా దోహదపడ్డారు. తమిళనాడులో డీఎంకే సైతం కాంగ్రెస్ బంధనాలను ఎందుకు వదిలించుకోవటం లేదో అర్థం కాదు. వాస్తవానికి అక్కడ కాంగ్రెస్ 1961లోనే తన ఉనికిని కోల్పోయింది. అస్సాంలో బీజేపీతో డైరెక్టుగా తలపడి సోదిలోకి లేకుండా ఓడిపోయింది. పార్లమెంట్ ఎన్నికలు దగ్గరకు వచ్చేసరికి కాళ్లా వేళ్లాపడి మద్దతు పొందిన ప్రాంతీయ పార్టీలకు అసెంబ్లీ ఎన్నికల సమయంలో పక్కలో బల్లెంలాగా మారిపోయి..బీజేపీకి లైన్‌క్లియర్ చేస్తూ వచ్చింది. 'కొట్లాడటానికి చేతకానివాడు.. పక్కకు పోడంట.. కొట్లాడే వాళ్ల కాళ్లల్ల కట్టెలు పెడతాడంట'.. ఇందుకు ఉదాహరణ కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ. బీజేపీ నాయకత్వం కూడా ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా వ్యవహరిస్తూ వస్తున్నది. వారి వ్యూహాలను కాంగ్రెస్ అర్థం చేసుకోవటం లేదు. 2023లో తెలంగాణలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటిదాకా దూకుడుగా వ్యవహరించిన బీజేపీ.. ఒక్కసారిగా తనకు తానుగా వెనక్కిపోయింది. తన మిత్రపక్షంలో ఉన్న నాయకుడిని అర్జెంటుగా కాంగ్రెస్‌లోకి జంప్ చేయించి.. తనకున్న ఓటు షేర్‌ను పూర్తిగా వదులుకొని కాంగ్రెస్‌ను తెలంగాణలో గెలిపించింది. అస్సాంలో బీజేపీ సొంతంగా గెలువలేదు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లో సైతం సొంతంగా తలబడి గెలువలేదు. తెలంగాణలో బీజేపీ వెనక్కిపోవటం వల్ల గెలిచిన కాంగ్రెస్ పార్టీ..కేరళంలో గెలవటానికి సీపీఐని, ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను బీజేపీ కోవర్ట్ అని ప్రచారం చేయటం దుర్మార్గమైన వ్యవహారం.

# పార్టీలను చీల్చడానికే ఈడీ, సీబీఐ దాడులు

ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ), సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సీబీఐ) వంటి ఏజెన్సీలను కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని మండిపడ్డారు. ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకుని, వారిని బీజేపీలో చేరాలని బలవంతం చేస్తోందని మండిపడ్డారు. శనివారం పంజాబ్ మంత్రి సంజీవ్ అరోరా నివాసంలో ఈడీ దాడుల నేపథ్యంలో కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను, అవినీతి నిరోధానికి కాకుండా ప్రతిపక్ష పార్టీలను విచ్ఛిన్నం చేయడానికి వినియోగిస్తున్నారని కేజ్రీవాల్ ఆరోపించారు. రాజకీయ నేతలను బెదిరించి బీజేపీలో చేర్చడమే ఈ దాడుల అసలు ఉద్దేశమని ఆరోపించారు. సంజీవ్ అరోరాపై ఈడీ చర్యలు కూడా అదే దిశలో భాగమని పేర్కొన్నారు. ఇక, సంజీవ్ అరోరాకు సంబంధించిన పలు ప్రాంతాల్లో ఈడీ అధికారులు శనివారం సోదాలు నిర్వహించారు. రూ.100 కోట్ల మనీలాండరింగ్ కేసుకు సంబంధించిన విచారణలో భాగంగా ఈ దాడులు చేపట్టినట్లు సమాచారం. దిల్లీ, గురుగ్రామ్, చండీగఢ్ ప్రాంతాల్లోని ఐదు ప్రాంగణాల్లో ఈ దాడులు నిర్వహిస్తున్నారు.

**'ఈడీ దాడుల అనంతరం మిత్తల్‌ను బీజేపీలో చేర్చుకున్నారు'**

మరోవైపు, గత నెలలో అశోక్ మిత్తల్ ఇంటిపై జరిగిన ఈడీ దాడుల గురించి కూడా కేజ్రీవాల్? ప్రస్తావించారు. ఈడీ దాడులు చేసిన మరుసటి రోజే అశోక్ మిత్తల్?ను బీజేపీలో



చేర్చుకున్నారని ఆయన గుర్తు చేశారు. అంటే, ఈడీ సోదాల అసలు ఉద్దేశం అక్రమ సంపద వెలికితీయడం కాదని, కేవలం ఆయన్ను దెబ్బతీసి, బీజేపీలోకి చేర్చుకోవడం కోసమే ఆ దాడులు జరిగాయని ఆరోపించారు. అయితే, సంజీవ్ అరోరా ఇంట్లో కూడా కొద్ది రోజుల క్రితం సోదాలు జరిగాయని, అయితే ఆయన బీజేపీలో చేరకపోవడంతో మళ్లీ మరోసారి ఈడీ దాడులు నిర్వహిస్తోందని కేజ్రీవాల్ పేర్కొన్నారు.

**'కేంద్రం పంజాబ్‌ను అనేక విధాలుగా ఇబ్బందులకు గురిచేస్తోంది'**

మరోవైపు, బంగాల్ ఎన్నికలు ముగియగానే పంజాబ్‌లో ఈడీ దాడులు ప్రారంభమయ్యాయని కేజ్రీవాల్? ఆరోపించారు. గత కొన్నేళ్లుగా కేంద్రం పంజాబ్‌ను అనేక విధాలుగా ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. "పంజాబ్ జలాలపై దాడులు జరిగాయి. పంజాబ్ యూనివర్సిటీపై నియంత్రణ సాధించే ప్రయత్నాలు చేశారు. గ్రామీణాభివృద్ధి నిధులను నిలిపివేశారు. ఇప్పుడు వరుసగా ఈడీ దాడులతో రాష్ట్రాన్ని వేధిస్తున్నారు" అని కేజ్రీవాల్ పేర్కొన్నారు.

**పంజాబ్ గురువుల పుణ్యభూమి**

పంజాబ్ గురువుల పుణ్యభూమి అని కేజ్రీవాల్? అభివర్ణించారు. అయితే, కొన్ని వందల సంవత్సరాల క్రితం నేరాలు, అణచివేతల ద్వారా దేశంలోని అనేక ప్రాంతాలను ఔరంగజేబు తన నియంత్రణలోకి తీసుకున్నారని గుర్తుచేశారు. అనంతరం పంజాబ్‌కు వచ్చి గురువులపై ఘోరమైన అఘాయిత్యాలు పాల్పడ్డాడని పేర్కొన్నారు. కానీ గురువులు తమ త్యాగాల ద్వారా ఔరంగజేబును ఎదుర్కొని ప్రజలను రక్షించారని చెప్పారు. అయితే, ఇప్పుడు మోదీ కూడా మోసపూరితంగా దేశంలోని అనేక ప్రాంతాలను తన నియంత్రణలోకి తీసుకున్నారని ఆరోపించారు. ఔరంగజేబు వలే మోదీజీ కూడా పంజాబీలపై అఘాయిత్యాలు చేస్తున్నారని మండిపడ్డారు. అయితే, పంజాబ్ గురువుల త్యాగం నుంచి స్ఫూర్తి పొంది, మోదీ అఘాయిత్యాలను ఎదుర్కొంటుందని చెప్పారు.

**కేజ్రీవాల్ వ్యాఖ్యపై స్పందించిన కేంద్ర మంత్రి**

ఇదిలా ఉండగా, అరవింద్ కేజ్రీవాల్ చేసిన 'ఔరంగజేబు' వ్యాఖ్యపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పందించారు. "అరవింద్ కేజ్రీవాల్ ప్రకటనపై స్పందించడం అంటే కేవలం సమయం వృథా చేయడమే అవుతుంది. భారత రాజకీయాల్లో ఆయన అధ్యాయం ముగిసిపోయింది. త్వరలోనే ఆయన పేరు కూడా కనుమరుగైపోతుంది. రాజకీయాల్లో కల్మషాన్ని వెదజల్లుతూ, రాజకీయ ప్రమాణాలను దిగజార్చారు. ప్రతిపక్షాలు ఇటువంటి ప్రతికూలతలకు అతీతంగా ఎదిగి, నిర్మాణాత్మక రాజకీయాలపై దృష్టి సారించాలి." అని మంత్రి కిరణ్ రిజిజు వ్యాఖ్యానించారు.

# బంగాల్‌లో 'సువేందు' శకం

బంగాల్‌లో నూతన ప్రభుత్వం కొలువుదీరింది. బంగాల్ 9వ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి శనివారం బాధ్యతలు చేపట్టారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ ఆర్ఎన్ రవి ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. 1971తర్వాత కలకత్తాయేతర జిల్లా నుంచి సీఎం పదవి చేపట్టిన మొదటి వ్యక్తిగా సువేందు అధికారి నిలిచారు. ఒకప్పుడు టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీకి సన్నిహితుడిగా ఉన్న సువేందు అధికారి, ఇప్పుడు ఆమెనే ఓడించి సీఎం పగ్గాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలోనే బీజేపీ శాసనసభ్యులు దిలీప్ ఘోశ్, అగ్నిమిత్రా పాల్, అశోక్ కీర్తనియా, నితీశ్ ప్రామాణిక్, క్షుదిరామ్ టుడూ రాష్ట్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇక ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోదీ, అమిత్ షా, నితిన్ గడ్కరీ, రామ్మోహన్ నాయుడు సహా పలువురు కేంద్ర మంత్రులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌తో పాటు పలు ఎన్‌డీఏ పాలిత రాష్ట్రాల సీఎంలు, బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ తదితరులు పాల్గొన్నారు. ప్రమాణస్వీకారానికి ముందు ఓ వాహనంలో ప్రధాని నరేంద్ర మోదీతో పాటు సువేందు అధికారి వేదిక వద్దకు వచ్చారు. ఈ క్రమంలో అక్కడకు వచ్చిన ఎన్డీఏ మద్దతుదారులకు అభివాదం చేస్తూ ఇద్దరూ ముందుకు సాగారు. అక్కడున్న వారంతా ప్రధాని మోదీకి అనుకూలంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. వేదిక వద్ద రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటానికి మోదీ నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముందు పలువురు కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది. సంప్రదాయ



దుస్తుల్లో కళాకారులు నృత్యప్రదర్శన చేశారు. మరికొందరు సంగీత వాయిద్యాలతో అలరించారు.

**సీనియర్ నేత కాళ్లు మొక్కిన ప్రధాని**

ఈ కార్యక్రమంలో ఆసక్తికర సన్నివేశం ఒకటి జరిగింది. ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా హాజరైన ప్రధాని నరేంద్ర మోదీ వేదికపై ఓ వృద్ధుడి కాళ్లు మొక్కి ఆశీర్వాదం తీసుకున్న సంఘటన వేడుకలో ప్రత్యేకంగా నిలిచింది. బంగాల్?లో తొలిసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుండటంతో ఆ రాష్ట్ర బీజేపీ సీనియర్ నేతల్లో ఒకరైన 98 ఏళ్ల మఖన్‌లాల్ సర్కార్‌ను ఈ కార్యక్రమానికి కమలదళం ప్రత్యేకంగా ఆహ్వానించింది. ఆయనను గౌరవించి సత్కరించింది. ఈ సందర్భంగా వేదికపై ప్రధాని మోదీ ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. అనంతరం మఖన్‌లాల్ పాదాలకు నమస్కరించి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు ప్రధాని. 1952లో కశ్మీర్‌లో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీతో పాటు ఉద్యమంలో పాల్గొన్న మఖన్‌లాల్ అక్కడ భారత జెండా ఎగురవేసిన ఘటనలో జైలుకెళ్లారు. స్వతంత్ర భారతంలో జరిగిన జాతీయోద్యమం సమయంలో కీలకంగా వ్యవహరించారు.

**'సోనార్ బంగ్లా యుగం ప్రారంభం'**

బంగాల్‌లో సోనార్ బంగ్లా యుగానికి అధికారికంగా శ్రీకారం చుట్టామని సువేందు అధికారి పేర్కొన్నారు. ప్రమాణ స్వీకారానికి ముందు సవేందుకు అధికారి ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు. 'బంగాల్?కు ఇది చారిత్రాత్మక ఉదయం. విజనరీ నాయకుడు ప్రధాని మోదీ మోదీని సిటీ ఆఫ్ జాయ్‌కు స్వాగతించడం గర్వకారణం. స్వాతంత్ర్యం తర్వాత బంగాల్?లో తొలి బీజేపీ ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేస్తుండటం ద్వారా మన స్థాపకుల కలలను సాకారం చేస్తున్నాం. రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా కొనసాగిన దుర్వినియోగ పాలనకు నేటితో ముగింపు పలుకుతున్నాం. ఇక నుంచి అభివృద్ధి, శాంతి, సుసంపన్నత లక్ష్యంగా డబుల్ ఇంజిన్ ప్రభుత్వం పనిచేస్తుంది. ఇది సోనార్ బంగ్లా యుగానికి అధికారిక ఆరంభం' అని సువేందు అధికారి ఎక్స్‌లో రాసుకొచ్చారు. 2026 బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 207 స్థానాలు గెలుచుకుంది. గత 15 ఏళ్లుగా అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్? పాలనను అంతం చేసింది. ఇక టీఎంసీ 80 స్థానాలకే పరిమితమైంది. సువేందు అధికారి నందిగ్రామ్, భవానీపూర్ నియోజకవర్గాల నుంచి పోటీ చేశారు. భవానీపూర్‌లో ప్రస్తుత ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై 15 వేలకుపైగా ఓట్ల మెజారిటీతో విజయం సాధించడం రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామంగా మారింది.

# తదుపరి సీడీఎస్‌గా లెఫ్టినెంట్ జనరల్ రాజా సుబ్రమణి

భారత తదుపరి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్)గా లెఫ్టినెంట్ జనరల్ ఎన్ఎస్ రాజా సుబ్రమణి (రిటైర్డ్)ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఆయన రక్షణ వ్యవహారాల విభాగం (డిపార్ట్‌మెంట్ ఆఫ్ మిలిటరీ అఫైర్స్) కార్యదర్శిగానూ వ్యవహరించనున్నారు. మరోవైపు చీఫ్ ఆఫ్ నావల్ స్టాఫ్‌గా వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ నియమితులయ్యారు. ఈ నెల 31 బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటన విడుదల చేసింది.

ప్రస్తుత ప్రస్తుత సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ మే 30న పదవీ విరమణ చేయనున్నారు. దీంతో ఆయన స్థానంలో రాజా సుబ్రమణి బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుతం ఎన్ఎస్ రాజా సుబ్రమణి జాతీయ భద్రతా మండలి కార్యదర్శిత్వంలో (ఎన్ఎస్‌సీఎస్) సైనిక సలహాదారుగా విధులు నిర్వర్తిస్తున్నారు. అంతకుముందు 2024 జూలై 1 నుంచి 2025 జూలై 31 వరకు భారత సైన్య ఉప ప్రధానాధికారిగా (వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్) పనిచేశారు. అలాగే 2023 మార్చి నుంచి 2024 జూన్ వరకు సెంట్రల్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్‌గా సేవలందించారు. ఎన్‌డీఏ, ఇండియన్ మిలిటరీ అకాడమీ పట్టభద్రుడైన రాజా సుబ్రమణి 1985 డిసెంబర్ 14న గఢ్వాల్ రైఫిల్స్ 8వ బెటాలియన్‌లో కమిషన్ పొందారు. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని జాయింట్ సర్వీసెస్ కమాండ్ అండ్ స్టాఫ్ కాలేజ్, దిల్లీ నేషనల్ డిఫెన్స్ కాలేజ్‌లలో శిక్షణ పొందారు. లండన్ కింగ్స్ కాలేజ్ నుంచి ఎంఏ, మద్రాస్ యూనివర్సిటీ నుంచి డిఫెన్స్ స్టడీస్‌లో ఎంఫిల్ పట్టాలు సాధించారు.

**నాలుగు దశాబ్దాలకు పైగా సేవలు**

నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన సైనిక సేవల్లో అసోం, జమ్ముకశ్మీర్, పశ్చిమ, ఉత్తర సరిహద్దు ప్రాంతాల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఆపరేషన్ రైనో కింద అసోంలో 16 గఢ్వాల్ రైఫిల్స్‌కు కమాండ్ చేశారు. జమ్ముకశ్మీర్‌లో 168





ఇన్ఫెంట్రీ బ్రిగేడ్, సెంట్రల్ సెక్టార్‌లో 17 మౌంటైన్ డివిజన్‌కు నాయకత్వం వహించారు. పశ్చిమ సరిహద్దులో భారత సైన్యానికి కీలకమైన 2 కార్ప్స్‌కు కూడా కమాండర్‌గా వ్యవహరించారు. అదనంగా జాతీయ రక్షణ అకాడమీలో డివిజనల్ ఆఫీసర్, కజకిస్థాన్‌లో డిఫెన్స్ అటాషే, మిలిటరీ ఇంటెలిజెన్స్ విభాగంలో డిప్యూటీ డైరెక్టర్ జనరల్, వెల్లింగ్టన్ డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజ్‌లో చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ వంటి పలు కీలక హోదాల్లో సేవలందించారు. దేశ భద్రతకు ఆయన చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం పరమ విశిష్ట సేవా మెడల్ , అతి విశిష్ట సేవా మెడల్ వంటి గౌరవ పురస్కారాలతో సత్కరించింది.

**2028 వరకు నేవీ చీఫ్‌గా స్వామినాథన్ బాధ్యతలు**

ప్రస్తుతం నేవీ చీఫ్‌గా ఉన్న అడ్మిరల్ దినేశ్ కుమార్ త్రిపాఠి ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్నారు. అదే రోజున వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ బాధ్యతలు స్వీకరించనున్నారు. 2028 డిసెంబర్ 31, వరకూ ఆ పదవిలో కొనసాగుతారు. వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ 2025 జూలై 31న పశ్చిమ నౌకాదళ కమాండ్ 34వ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆయన 1987 జూలై 1న భారత నౌకాదళంలో చేరారు. కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ విభాగాల్లో నిపుణుడిగా గుర్తింపు పొందారు. కృష్ణ స్వామినాథన్ నేషనల్ డిఫెన్స్ అకాడమీ, ఖడక్వాస్లా పూర్వ విద్యార్థి. అలాగే యునైటెడ్ కింగ్‌డమ్‌లోని జాయింట్ సర్వీసెస్ కమాండ్ అండ్ స్టాఫ్ కాలేజ్, శ్రీవెన్‌హామ్; కరంజాలోని కాలేజ్ ఆఫ్ నావల్ వార్‌ఫేర్; అమెరికాలోని రోడ్ ఐలాండ్, న్యూపోర్ట్‌లో ఉన్న యునైటెడ్ స్టేట్స్ నావల్ వార్ కాలేజ్‌లలో శిక్షణ పొందారు.

**పలు కీలక నౌకలకు కమాండ్**

నౌకాదళంలో కృష్ణ స్వామినాథన్ అనేక కీలక బాధ్యతలు నిర్వర్తించారు. క్షిపణి నౌకలు ఐఎన్ఎస్ విద్యుత్, వినాశ్; మిసైల్ కార్వెట్ ఐఎన్ఎస్ కులిశ్; గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్ ఐఎన్ఎస్ మైసూర్; విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రమాదిత్యలకు కమాండర్‌గా పనిచేశారు. రియర్ అడ్మిరల్ హోదాకు పదోన్నతి పొందిన అనంతరం కొచ్చిలోని సదరన్ నావల్ కమాండ్ ప్రధాన కార్యాలయంలో చీఫ్ స్టాఫ్ ఆఫీసర్ (ట్రైనింగ్)గా సేవలందించారు. భారత నౌకాదళంలో శిక్షణ కార్యక్రమాల నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. నౌకాదళంలోని అన్ని విభాగాల్లో ఆపరేషనల్ భద్రతను పర్యవేక్షించే ఇండియన్ నావల్ సేఫ్టీ టీమ్ ఏర్పాటులో కూడా ఆయన ముఖ్య పాత్ర వహించారు. వైస్ అడ్మిరల్ హోదాలో ఆయన వెస్టర్న్ నావల్ కమాండ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా, కంట్రోలర్ ఆఫ్ పర్సనల్ సర్వీసెస్‌గా, నావల్ హెడ్‌క్వార్టర్స్‌లో చీఫ్ ఆఫ్ పర్సనల్‌గా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుత బాధ్యతలకు ముందు నావల్ హెడ్‌క్వార్టర్స్‌లో వైస్ చీఫ్ ఆఫ్ నావల్ స్టాఫ్‌గా పనిచేశారు.

## మనందరి తొలి శత్రువు బీజేపీనే



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో పగ్గాలు చేపట్టిన బీజేపీని ఎదుర్కోవడానికి అన్ని ప్రాంతీయ పార్టీలు ఏకం కావాలని టీఎంసీ అధినేత్రి, మాజీ సీఎం మమతా బెనర్జీ పిలుపునిచ్చారు. 15 ఏళ్ల టీఎంసీ పాలనకు ముగింపు పలుకుతూ బీజేపీకి ప్రజలు అధికారం కట్టబెట్టి, సీఎంగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారం చేసిన తరుణంలో మమతా ఈ వ్యాఖ్యలు చేశారు. అన్ని పార్టీల శత్రువు బీజేపీనేనని, అందుకోసం అంతా ఏకం కావాలన్నారు మమతా. పశ్చిమ బెంగాల్‌లోని అన్ని ప్రతిపక్ష పార్టీలు ఒక ఉమ్మడి వేదిక కింద ఏకం కావాలని మమతా బెనర్జీ స్పష్టం చేశారు. ' వామపక్ష, అతివాద వామపక్షాలతో సహా అన్ని ప్రతిపక్ష పార్టీలు కలిసి ఒక ఉమ్మడి వేదికను ఏర్పాటు చేయాలని నేను పిలుపునిస్తున్నా. బీజేపీని వ్యతిరేకిస్తున్న విద్యార్థి సంఘాలు, ఎన్జీవోలు కూడా బీజేపీకి వ్యతిరేకంగా ఏకం కావాలి' అని అన్నారు. బెంగాల్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తొలి బీజేపీ నాయకుడిగా సువేందు అధికారి నిలిచిన తరుణంలోనే మమతా ఈ సందేశం ఇచ్చారు. మే 4న జరిగిన రాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించడంతో మమతా పార్టీ ఘోర పరాజయం తప్పలేదు. ఆ సమయంలో బీజేపీపై మమత తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇది బీజేపీ గెలుపు కాదని, కుట్ర చేసి గెలిచారని ధ్వజమెత్తారు. నైతికంగా గెలుపు మాత్రం తమదేనని మమతా పేర్కొన్నారు.

## గోవాలో రివర్స్ క్రైమ్... విదేశీయుల నేరాలపై షాకింగ్ రిపోర్ట్!

ప్రపంచ ప్రసిద్ధ పర్యాటక కేంద్రమైన గోవాలో మరో చీకటి కోణం వెలుగులోకి వచ్చింది. ఇక్కడ విదేశీయులపై జరిగే నేరాల కన్నా, వారే స్వయంగా పాల్పడే నేరాలు చాలా ఎక్కువగా ఉన్నాయని జాతీయ నేర గణాంక సంస్థ (ఎన్సీఆర్బీ) డేటా స్పష్టం చేస్తోంది. 2022 నుంచి 2024 మధ్య కాలంలో విదేశీయులు బాధితులుగా ఉన్న కేసులతో పోలిస్తే, వారు నిందితులుగా ఉన్న కేసులు ఏకంగా ఆరు రెట్లు అధికంగా నమోదయ్యాయి. ఈ గణాంకాలు గోవాలో పెరుగుతున్న నేరాల ధోరణిని సూచిస్తున్నాయి. ఎన్సీఆర్బీ డేటా ప్రకారం, గత మూడేళ్లలో గోవా పోలీసులు విదేశీయులకు సంబంధించి మొత్తం 251 కేసులు నమోదు చేశారు. వీటిలో ఆశ్చర్యకరంగా 206 కేసుల్లో విదేశీయులే నిందితులుగా ఉన్నారు. కేవలం 45 కేసుల్లో మాత్రమే వారు బాధితులుగా ఉన్నారు. ముఖ్యంగా 2024లో విదేశీయులు చేసిన నేరాలు 27 శాతం పెరిగాయి. హత్యాయత్నం, అత్యాచారం, మోసం, దాడులతో పాటు ఫారినర్స్ యాక్ట్ ఉల్లంఘన, మాదకద్రవ్యాల అమ్మకం, రవాణా వంటి తీవ్రమైన నేరాల్లో వారి ప్రమేయం ఉన్నట్లు తేలింది. ఈ నేరాలకు సంబంధించి నైజీరియా, రష్యా, నేపాల్, టాంజానియా, బల్గేరియా, బంగ్లాదేశ్ వంటి దేశాల పౌరులను గోవా పోలీసులు అరెస్ట్ చేశారు. ఎక్కువగా వీసా గడువు ముగిసినా అక్రమంగా నివసించడం, డ్రగ్స్ వ్యాపారం వంటి కార్యకలాపాల్లో పట్టుబడుతున్నారు. ఈ నేపథ్యంలో గోవా ప్రభుత్వం చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే విదేశీయుల కోసం మపుసాలో ప్రత్యేక డిటెన్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని, శిక్షాకాలం పూర్తయ్యాక ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎఫ్ఆర్ఆర్ఓ) ద్వారా వారిని వెనక్కి పంపిస్తామని అధికారులు తెలిపారు.

## ప్రభుత్వ ఏర్పాటుకు లైన్ క్లియర్

తమిళనాడులో రాజకీయ అనిశ్చితికి ఎట్టకేలకు తెరపడింది. సుదీర్ఘ చర్చల అనంతరం, విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కజగం' (టీవీకే)కు, 'విడుతలై చిరుతైగల్ కట్చి' (వీసీకే) బేషరతు మద్దతు ప్రకటిస్తూ ఒక లేఖను అందజేసింది. వీసీకే వ్యవస్థాపకుడు, లోక్‌సభ ఎంపీ తోల్ తిరుమావళవన్ ఈ మద్దతు లేఖను టీవీకే ప్రధాన కార్యదర్శి, ఎన్నికల వ్యూహకర్త అధవ్ అర్జునకు ఇచ్చారు. దీనితో ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 118 మ్యాజిక్ ఫిగర్ విజయ్‌కు లభించింది. ఇది జరిగిన కొద్ది సేపటికే ఐయూఎల్ పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు విజయ్‌కు సపోర్టు చేస్తున్నట్లు ప్రకటించారు. దీనితో టీవీకే బలం 120కు చేరింది. ఈ నేపథ్యంలో ఆయా పార్టీల మద్దతు లేఖలను విజయ్ గవర్నర్‌ను కలిసి సమర్పించనున్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ అంగీకరిస్తే తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. వీసీకే నేతలతో సమావేశం జరిగిన అనంతరం బయటకు వచ్చిన అధవ్ అర్జున, మీడియాకు ఆ లేఖను చూపిస్తూ "వెట్రి, వెట్రి, వెట్రి" (విజయం) అని నినాదం చేశారు. విజయ్ సీఎం కానున్నారని చెబుతూ, ఆయనను కలిసేందుకు బయలుదేరారు.

**ప్రభుత్వ ఏర్పాటుకు లైన్ క్లియర్**

విజయ్ కొత్తగా రాజకీయాల్లోకి వచ్చి, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో భారీ విజయాన్ని సొంతం చేసుకున్నారు. కానీ ఆయన మ్యాజిక్ ఫిగర్‌కు 10 సీట్ల దూరంలో ఉండిపోయారు. తమిళనాడు అసెంబ్లీలో మొత్తం 234 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే 118 సీట్లు కావాలి. విజయ్ రెండు చోట్ల పోటీ చేయడం వల్ల ఆయన బలం 108 నుంచి 107కు తగ్గింది. దీనితో విజయ్? ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ అవకాశం ఇవ్వలేదు. దీనితో ఒక్కసారిగా తమిళ రాజకీయాలు వేడెక్కాయి.

ఈ నేపథ్యంలో కాంగ్రెస్, డీఎంకే కూటమి నుంచి బయటకు వచ్చి విజయ్?కు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించింది. దీనితో యూపీఏ కూటమి నుంచి డీఎంకే బయటకు వచ్చేసింది. ఆ తరువాత, బద్ధశత్రువులైన డీఎంకే, అన్నాడీఎంకే కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేస్తాయనే వార్తలు కూడా హల్‌చల్ చేశాయి.

చివరికి సీపీఐ, సీపీఐ(ఎం) విజయ్ టీవీకే పార్టీకి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించాయి. అయితే వీసీకే మాత్రం మద్దతు ఇవ్వడంపై చాలా తర్జనభర్జనలు పడింది. ఉపముఖ్యమంత్రి పదవి సహా కీలక శాఖల కావాలంటూ, విజయ్‌కు మద్దతు ఇచ్చే వ్యవహారాన్ని నాన్చుతూ వచ్చింది. దీనితో తమిళనాట ఎప్పుడు ఏమవుతుందోననే ఉత్కంఠ పెరిగిపోయింది. చివరికి శనివారం వీసీకే, టీవీకేకు మద్దతు ఇస్తున్నట్లు వెల్లడించింది. తమిళ ప్రజలకు స్థిరమైన, ప్రజాస్వామ్య పాలన అందించే ఉద్దేశంతోనే ఈ బేషరతు మద్దతు ఇస్తున్నట్లు పేర్కొంది. దీనిని గవర్నర్ తన రికార్డుల్లోకి తీసుకోవాలని కోరింది. దీనితో విజయ్ పార్టీ బలం 118కి చేరింది. ఇది జరిగిన కొద్ది సేపటికే ఐయూఎంఎల్ కూడా టీవీకేకు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించింది. దీనితో అనూహ్యంగా విజయ్?కు 120 సభ్యుల మద్దతు లభించినట్లు అయ్యింది. దీనితో ప్రభుత్వ ఏర్పాటుకు లైన్ క్లియర్ అయ్యింది. ఇక గవర్నర్? అనుమతే తరువాయి. అందుకే విజయ్ గవర్నర్ అపాయింట్?మెంట్ కోరారు. అయితే ప్రస్తుతం గవర్నర్ అపాయింట్?మెంట్ ఖరారు కాకపోవడంతో విజయ్ టీవీకే కార్యాలయానికి వెళ్లారు. సంఖ్యాబలం ఉంది కాబట్టి ఇక గవర్నర్ ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్?ను ఆహ్వానించక తప్పని పరిస్థితి ఏర్పడింది. కనుక తమిళనాడులో టీవీకే ఏర్పాటు చేయడం ఖాయంగా కనిపిస్తోంది. కాగా, జోసెఫ్ విజయ్ చంద్రశేఖర్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి నెహ్రూ స్టేడియంలో ఇప్పటికే ఏర్పాట్లు జరుగుతున్నాయి.

**క్యాబినెట్ పదవులు వద్దన్న వీసీకే**

తమిళనాడు ప్రభుత్వ ఏర్పాటులో టీవీకేకు మద్దతు ఇస్తున్న వీసీకే, క్యాబినెట్ పదవులు మాత్రం వద్దని చెప్పింది. టీవీకేకు తాము వెలుపలి నుంచే మద్దతు ఇస్తామని, భవిష్యత్తులో ప్రభుత్వంలో భాగం అవుతామా లేదో అన్నది చెప్పలేమని తెలిపింది. తాము డీఎంకే కూటమిలోనే కొనసాగుతున్నామని, తమిళనాడులో రాష్ట్రపతి పాలన రాకుండా ఉండేందుకే టీవీకేకు మద్దతు ఇచ్చామని వీసీకే చీఫ్ తిరుమావళవన్ మీడియాకు వెల్లడించారు. మరోవైపు, వామపక్షాలు కూడా క్యాబినెట్ పదవులు వద్దని చెప్పాయి.

# డీహైడ్రేషన్ నుంచి కాపాడటంలో దీని తర్వాతే ఏదైనా

వేసవి కాలం వచ్చేసింది. ఎండలు తీవ్రమవుతున్న కొద్దీ మన శరీరంలోని నీటి శాతం చెమట రూపంలో వేగంగా తగ్గిపోతుంది. కేవలం నీళ్లు తాగడం మాత్రమే కాకుండా, మనం తీసుకునే ఆహారం ద్వారా కూడా శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవచ్చు. వేసవి పండ్ల గురించి మాట్లాడేటప్పుడు అందరికీ మొదటగా గుర్తొచ్చేది 'పుచ్చకాయ'. దాదాపు 91 నుండి 92 శాతం నీటిని కలిగి ఉండే పుచ్చకాయ, ఎండల బారి నుండి మనల్ని రక్షించే అద్భుతమైన ఫలమని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. పుచ్చకాయ కేవలం దాహాన్ని తీర్చడమే కాకుండా, శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్లను అందిస్తుంది. ఎండలో తిరిగేటప్పుడు వచ్చే అలసట, తలనొప్పి వంటి సమస్యలను నివారించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. పుచ్చకాయలో ఉండే అత్యధిక నీటి శాతం మరియు ఎలక్ట్రోలైట్లు శరీరంలో ద్రవాల సమతుల్యతను కాపాడతాయి. ఎండ వేడి వల్ల కలిగే అలసట, మైకము వంటి లక్షణాలను ఇది తగ్గిస్తుంది. ఇందులో ఉండే విటమిన్ సి మరియు లైకోపిన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు ఎండ వల్ల దెబ్బతినే చర్మాన్ని రక్షించి, చర్మం తాజాగా ఉండేలా చేస్తాయి. తక్కువ క్యాలరీలు ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారు కూడా దీనిని నిరభ్యంతరంగా తీసుకోవచ్చు. ఇది కడుపుని నిండుగా ఉంచుతూనే శరీరాన్ని తేలికగా ఉంచుతుంది. పుచ్చకాయను ఉదయం పూట స్నాక్‌లా తీసుకోవడం లేదా పండ్ల ముక్కలతో కలిపి సలాడ్‌లా తీసుకోవడం మంచిది. ఎటువంటి చక్కెర కలపకుండా తాజాగా జ్యూస్ చేసుకుని తాగవచ్చు. దీనికి కొద్దిగా పుదీనా ఆకులు కలిపితే రుచితో పాటు చలువ కూడా చేస్తుంది. వేసవిలో వచ్చే ఇతర పండ్లైన కర్బూజ (90%), స్ట్రాబెర్రీ (91%), ఆరెంజ్ (87%) మరియు పైనాపిల్ (86%) లలో కూడా నీటి శాతం ఎక్కువే ఉన్నప్పటికీ, పుచ్చకాయ వీటన్నింటికంటే ముందంజలో ఉంది. అయితే, చాలామంది పండ్ల జాబితాలో దోసకాయను మర్చిపోతుంటారు. నిజానికి దోసకాయలో 95 నుండి 96 శాతం వరకు నీరు ఉంటుంది. ఇందులో ఉండే పొటాషియం వంటి ఖనిజాలు ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు డీహైడ్రేషన్ బారిన పడకుండా శరీరాన్ని అద్భుతంగా కాపాడతాయి. కాబట్టి పుచ్చకాయతో పాటు దోసకాయను కూడా మీ డైట్‌లో చేర్చుకోవడం వల్ల వేసవి తాపాన్ని సులభంగా అధిగమించవచ్చు.

# తక్షణ శక్తికోసం ఏది తినాలి?

మన నిత్య జీవితంలో పనులు చేసుకోవడానికి అవసరమైన కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు మన ఆహారం ద్వారా అందుతాయి. అయితే మనం తీసుకునే ఆహారం శరీరానికి ఏ సమయంలో, ఎలా శక్తిని ఇస్తుందనేది చాలా ముఖ్యం. కొన్నిసార్లు మనకు తక్షణమే ఉత్సాహం రావాల్సి ఉంటుంది. మరికొన్ని సందర్భాల్లో రోజంతా పని చేయడానికి స్థిరమైన శక్తి అవసరమవుతుంది. అటువంటి సమయాల్లో అరటిపండ్లు, ఖర్జూరాలు మనకు అద్భుతమైన ఎంపికలుగా నిలుస్తాయి. ఈ రెండూ శక్తిని అందించినప్పటికీ, వాటి పోషక విలువలలో ఉండే స్వల్ప తేడాల వల్ల వాటిని తీసుకునే సమయం వేరుగా ఉండాలి. అరటిపండ్ల విషయానికి వస్తే, వీటిలో కార్బోహైడ్రేట్లు అధికంగా ఉంటాయి. ఒక మధ్యస్థ పరిమాణపు అరటిపండులో సుమారు 100 నుండి 150 కేలరీలు ఉంటాయి. వీటిలో సహజ చక్కెరలతో పాటు పిండి పదార్థాలు ఉండటం వల్ల శరీరానికి నిరంతరాయంగా, స్థిరమైన శక్తిని అందిస్తాయి. అంతేకాకుండా అరటిపండ్లలో ఉండే పొటాషియం, విటమిన్ బి6, విటమిన్ సి వంటి పోషకాలు శరీర అవయవాల పనితీరును మెరుగుపరుస్తాయి. ముఖ్యంగా కండరాల పనితీరును మెరుగుపరచడంలో పొటాషియం కీలక పాత్ర పోషిస్తుంది. ఇది వ్యాయామం చేసే సమయంలో వచ్చే కండరాల తిమ్మిర్లను తగ్గించడానికి సహాయపడుతుంది.



మరోవైపు ఖర్జూరాలు తక్షణ శక్తిని అందించడంలో మేటిగా నిలుస్తాయి. కేవలం 3 నుండి 4 ఖర్జూరాలలో 90 నుండి 120 కేలరీలు లభిస్తాయి. వీటిలో సహజ చక్కెరలు పుష్కలంగా ఉండటం వల్ల నీరసంగా ఉన్నప్పుడు లేదా ఉపవాసం ఉన్నప్పుడు తీసుకుంటే వెంటనే ఉత్సాహం వస్తుంది. ఖర్జూరాల్లో చక్కెరతో పాటు ఫైబర్, ఐరన్, మెగ్నీషియం వంటి ముఖ్యమైన ఖనిజాలు కూడా ఉంటాయి. ముఖ్యంగా రక్తహీనత సమస్యతో బాధపడేవారికి ఖర్జూరాలు ఒక అద్భుతమైన పోషకాహారంగా పనిచేస్తాయి. తీవ్రమైన శారీరక శ్రమ చేసేవారికి కూడా ఇవి తక్షణ ఇంధనంలా ఉపయోగపడతాయి. షుగర్ వ్యాధిగ్రస్తులు పండ్ల ఎంపికలో జాగ్రత్తగా ఉండాలి. అరటిపండ్లు మధ్యస్థ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి ఉండటం వల్ల ఇవి రక్తంలోని చక్కెర స్థాయిని ఒక్కసారిగా పెంచవు. కాబట్టి డయాబెటిస్ ఉన్నవారు వీటిని సాధారణ పరిమాణంలో తీసుకోవడం వల్ల జీర్ణక్రియకు, పేగు ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. ఖర్జూరాలకు గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా ఎక్కువగా ఉంటుంది, ఇది చక్కెర స్థాయిని వేగంగా పెంచుతుంది. అందుకే మధుమేహ వ్యాధిగ్రస్తులు ఖర్జూరాలకు దూరంగా ఉండటం మంచిది. ఒకవేళ తీసుకోవాలనుకుంటే ఒకటి లేదా రెండు మాత్రమే తీసుకోవాలి, అందులోని ఫైబర్ చక్కెర నియంత్రణకు కొంతవరకు తోడ్పడుతుంది. మన శరీర అవసరాలను బట్టి ఈ రెండింటినీ ఎంచుకోవాలి. సులభంగా చెప్పాలంటే, మీరు వెంటనే రీఛార్జ్ అవ్వాలి అనుకుంటే ఖర్జూరాలు తీసుకోవాలి. అదే మీరు వ్యాయామం చేయాలన్నా లేదా రోజంతా చురుగ్గా ఉండాలన్నా అరటిపండ్లు తీసుకోవడం ఉత్తమం. ఈ రెండింటిలోనూ విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉండటం వల్ల ఇవి మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. మీ దైనందిన జీవితంలో వీటిని సరైన పద్ధతిలో చేర్చుకోవడం ద్వారా మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చు.



# ఖాళీ కడుపుతో నిమ్మరసంలో ఇది కలిపి తాగుతున్నారా?

నేటి వేగవంతమైన జీవితంలో ఆరోగ్యంగా ఉండటం ఒక సవాలుగా మారింది. ఇటువంటి పరిస్థితులలో కొన్ని చిన్న చిన్న చిట్కాలు మన ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. వాటిలో ఒకటి, పరగడుపున నిమ్మకాయ, తేనె కలిపిన నీటిని తాగడం. ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రారంభించడానికి చాలామంది ఉదయాన్నే నిమ్మరసం-తేనె నీటిని ఎంచుకుంటారు. ఇది ఒక పాతకాలపు పద్ధతి అయినప్పటికీ, దీని వల్ల కలిగే అద్భుత ప్రయోజనాల వల్ల నేటికీ ప్రాచుర్యం పొందుతోంది. కానీ, సరైన పద్ధతిలో పాటించకపోతే, దీని వల్ల కలిగే లాభనష్టాలు కూడా ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వేడి నీటిలో నిమ్మరసం, తేనె కలపడం వల్ల శరీరంలోని అదనపు కొవ్వు కరుగుతుంది. బరువు తగ్గడానికి ఒక దివ్యౌషధం లాంటిది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. నోటిలోని బ్యాక్టీరియాను చంపడం ద్వారా నోటి దుర్వాసన సమస్యను తగ్గిస్తుంది. నిమ్మరసం కాలేయాన్ని శు భ్రపరచడానికి సహాయపడుతుంది. మీ కాలేయాన్ని శుభ్రంగా ఉంచుకోవడానికి, ఖాళీ కడుపుతో నిమ్మరసం తాగండి. ఆరోగ్య ప్రయోజనాలు: నిమ్మకాయలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది ఇన్ఫెక్షన్ల నుండి శరీరాన్ని రక్షించడమే కాకుండా, సీజనల్ వ్యాధులు దరిచేరకుండా చూస్తుంది. శరీరంలోని వ్యర్థాల, టాక్సిన్లను తొలగించి, రక్తాన్ని శుద్ధి చేస్తుంది. దీనివల్ల చర్మం కాంతివంతంగా మారుతుంది. నిమ్మకాయలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. చాలా మంది ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో నిమ్మరసం తాగుతారు. పరిమిత పరిమాణంలో తీసుకుంటే ప్రయోజనాలు ఉన్నప్పటికీ, ప్రతిరోజూ ఖాళీ కడుపుతో తాగడం వల్ల ప్రయోజనానికి బదులుగా హాని జరగవచ్చునని నిపుణులు చెబుతున్నారు. నిమ్మరసం ఆరోగ్యానికి మంచిదే అయినప్పటికీ, దానిని తీసుకునే విధానంలో కొన్ని నియమాలు పాటించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తీవ్రమైన గ్యాస్ట్రిక్ సమస్యలు ఉన్నవారు పరగడుపున నిమ్మరసం తాగడం వల్ల కడుపులో మంట వచ్చే అవకాశం ఉంది. వీరు అల్పాహారం చేసిన 40 నిమిషాల తర్వాత తీసుకోవడం మంచిది. భోజనానికి ముందు లేదా తిన్న వెంటనే దీనిని తాగకూడదు. అలా చేస్తే మనం తిన్న ఆహారంలోని పోషకాలను శరీరం సరిగ్గా గ్రహించలేదు. నిమ్మరసం నీరు ఒక అద్భుతమైన ఆరోగ్య పానీయం. అయితే పైన పేర్కొన్న జాగ్రత్తలు పాటిస్తూ దీనిని క్రమం తప్పకుండా తీసుకుంటే దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.



# బిజినెస్

## హ్యుందాయ్ కొత్త ప్లాన్: ఏంటో తెలుసా?




టాటా మోటార్స్, మహీంద్రా వంటి స్వదేశీ బ్రాండ్‌ల కారణంగా.. హ్యుందాయ్ తన పట్టును కోల్పోతూ, భారతీయ ప్యాసింజర్ వాహన విభాగంలో తన రెండవ స్థానం నుంచి కిందికి జారిపోతోంది. ఈ కార్ల తయారీ సంస్థ తిరిగి పుంజుకోవడానికి సన్నద్ధమవుతూ.. కోల్పోయిన స్థానాన్ని తిరిగి పొందడానికి ఒక ప్రణాళికను రూపొందించింది. కంపెనీ క్యూ4 ఆదాయాల ప్రకటన సందర్భంగా.. 2027 ఆర్థిక సంవత్సరంలో భారత మార్కెట్లో రెండు కొత్త ఎస్‌యూవీలను విడుదల చేయాలని యోచిస్తున్నట్లు హ్యుందాయ్ ప్రకటించింది. వీటిలో టాటా పంచ్ ఈవీకి పోటీగా నిలుస్తుందని భావిస్తున్న ఇన్‌స్టర్ ఈవీ, బేయాన్ ఆధారిత క్రాస్‌ఓవర్ ఉండే అవకాశం ఉంది. హ్యుందాయ్ మోటార్ ఇండియా ఎండీ ౘ సీఈఓ తరుణ్ గార్గ్ ప్రకారం.. ఈ ఆర్థిక సంవత్సరంలో, రెండు పూర్తిగా కొత్త నేమ్‌ప్లేట్‌లను ప్రవేశపెట్టబోతున్నారు. వాటిలో ఒకటి కాంపాక్ట్ ఎస్‌యూవీ విభాగం, మరొకటి ఐసీఈ ఎస్‌యూవీ విభాగంలో ఉండనున్నాయి. భారతదేశంలోని ప్యాసింజర్ వాహన విభాగంలో పెద్ద భాగాన్ని ఆక్రమించిన, అత్యధిక డిమాండ్ ఉన్న వాహన విభాగాలైన కాంపాక్ట్ ౚఖం, మిడ్-సైజ్ ౚఖంలలో ఈ రెండు కొత్త మోడళ్లను ప్రవేశపెట్టనున్నారు.

## బంధన్ బ్యాంక్ విస్తరణ




**హైదరాబాద్ :** తెలంగాణలో తన వ్యాపారాన్ని మరింత విస్తరించడానికి ఒకేసారి మూడు శాఖలను ప్రారంభించింది బంధన్ బ్యాంక్. వీటిలో హైదరాబాద్‌లో రెండు శాఖలను ఆరంభించిన సంస్థ..మరొకటి మిర్యాలగూడలో నెలకొల్పింది. దీంతో తెలంగాణలో శాఖల సంఖ్య 162కి చేరుకున్నాయి. తమిళనాడులో ఐదు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో చెరో రెండు చొప్పున ప్రారంభించినట్లు బంధన్ బ్యాంక్ ఎండీ, సీఈవో పార్థ ప్రతీమ్ సేన్‌గుప్తా తెలిపారు. వ్యూహాత్మక వ్యాపార విస్తరణలో ఈ కొత్త శాఖలను ప్రారంభించినట్టు, తద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడానికి వీలు పడనున్నదన్నారు.

# కష్టాల్లో ఉన్నాం.. ఖర్చులొద్దు

**న్యూఢిల్లీ :** దేశీయ విమానయాన రంగ సంస్థ, టాటా గ్రూప్‌నకు చెందిన ఎయిర్ ఇండియా.. వ్యయ నియంత్రణ దిశగా అడుగులేస్తున్నది. ఈ క్రమంలోనే 'సంస్థ కఠిన పరిస్థితులను ఎదుర్కొంటున్నది. అనవసరపు ఖర్చుల జోలికి వెళ్లవద్దు' అని శుక్రవారం ఉద్యోగులకు యాజమాన్యం సూచించింది. అలాగే ఇప్పటికైతే ఉద్యోగాల తొలగింపులేమీ ఉండబోవని భరోసా ఇచ్చిన కంపెనీ.. కనీసం మూడు నెలలపాటైనా వార్షిక వేతనాల పెంపును వాయిదా వేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసినట్టు సమాచారం. ఎయిర్ ఇండియా సీఈవో, ఎండీ క్యాంప్‌బెల్ విల్సన్, సీఎఫ్‌వో సంజయ్ శర్మ, చీఫ్ హెచ్‌ఆర్ ఆఫీసర్ రవీంద్ర కుమార్ జీపీ.. టౌన్‌హాల్‌లో ఉద్యోగులనుద్దేశించి మాట్లాడారు. వీరంతా కూడా ఉద్యోగులకు దుబారాపై దృష్టి పెట్టండని నొక్కిచెప్పినట్టు తెలుస్తున్నది.




### ఇదీ సంగతి..

అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియాలో తీవ్ర సంక్షోభం నెలకొన్న విషయం తెలిసిందే. ఓవైపు మార్కెట్‌లో విజృంభించిన ముడి చమురు ధరలు.. విమానయాన ఇంధనాన్ని 2.5-3 రెట్లు ఖరీదెక్కించాయి. మరోవైపు అమెరికాకు అండగా ఉంటున్నాయని పొరుగు దేశాలపై ఇరాన్ దాడులు చేస్తుండటంతో.. యూఏఈ, ఖతార్, కువైట్, సౌదీ, బహ్రెయిన్ తదితర గల్ఫ్ దేశాల్లో గగనతల ఆంక్షలు వచ్చిపడ్డాయి. ఈ ప్రభావం భారతీయ విమానయాన రంగంపై స్పష్టంగా పడుతున్నది. పెరిగిన నిర్వహణ ఖర్చులు, తగ్గిన ఆదాయం ఎయిర్‌లైన్స్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఎయిర్ ఇండియా తాజా నిర్ణయాలే ఇందుకు నిదర్శనం. నష్టాల నుంచి గట్టెక్కడానికే ఈ వ్యయ నియంత్రణ చర్యలు అన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కాగా, గురువారం జరిగిన కంపెనీ బోర్డు సమావేశంలో తాత్కాలిక సెలవులు (ఈ సెలవులకుగాను ఉద్యోగులకు కంపెనీలు జీతాలు చెల్లించవు) సహా, వ్యయ నియంత్రణకున్న అన్ని అవకాశాలపై చర్చ జరిగింది. ఈ క్రమంలోనే ఉద్యోగులతో కంపెనీ ఉన్నతవర్గాలు పైవిధంగా చెప్పుకొచ్చాయి.

### మున్ముందు కష్టాలే..

పొరుగున ఉన్న పాకిస్థాన్‌తో సరిహద్దు గొడవల దృష్ట్యా ఆ దేశ గగనతలాన్ని చాలాకాలం నుంచి వినియోగించుకోలేకపోతున్న భారతీయ విమానయాన సంస్థలకు.. గత 2 నెలలకుపైగా మెజారిటీ గల్ఫ్ దేశాలకూ స్వేచ్ఛగా వెళ్లలేని దుస్థితి తలెత్తింది. పశ్చిమాసియా సంక్షోభం.. మూలిగే నక్క మీద తాటిపండు పడ్డ చందంగా తయారైంది మరి. నిజానికి దేశీయ విమానయాన పరిశ్రమకు గల్ఫ్ దేశాలకు వచ్చిపోయేవారి నుంచి పెద్ద ఎత్తునే ఆదాయం వస్తుంది. అయితే అక్కడి ఉద్రిక్తతలు ఈ బిజినెస్‌కు గండికొట్టాయి. ఇక డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయిలకు దిగజారుతుండటం కూడా విమానయాన సంస్థల కష్టాలను పెంచేస్తున్నది. ఆయా సిబ్బందికి, విదేశీ ఎయిర్‌పోర్టుల్లో వినియోగించుకున్న సేవలకుగాను చెల్లింపులు డాలర్లలోనే ఉంటాయి మరి. మొత్తానికి ఎయిర్ ఇండియా నిర్ణయాల నేపథ్యంలో ఇతర దేశీయ విమానయాన సంస్థలూ ఇదే దిశగా పయనించేందుకు ఆస్కారం ఉన్నది. ఇప్పటికే ఆయా కంపెనీల ఆర్థిక ఫలితాలు నిరుత్సాహకరంగా వస్తున్నది చూస్తూనే ఉన్నాం. గత కొద్ది రోజులుగా దేశీయ స్టాక్ మార్కెట్లలోనూ తీవ్ర ఒడిదుడుకులకు షేర్లు లోనవుతున్నాయి. దీంతో భారతీయ విమానయాన పరిశ్రమకు మున్ముందు కష్టకాలమేనన్న అంచనాలు వినిపిస్తున్నాయి.

### తగ్గనున్న సర్వీసులు

గగనతల ఆంక్షలున్న, నష్టాలు వస్తున్న మార్గాల్లో విమాన సర్వీసులను తగ్గించే లేదా నిలిపివేసే యోచనలో ఎయిర్ ఇండియా ఉన్నది. ఈ మేరకు సంస్థ సీఈవో క్యాంప్‌బెల్ విల్సన్ సంకేతాలిచ్చారు. ఈ జూన్-జూలైలో విమానాల సంఖ్య తగ్గవచ్చు. ప్రస్తుతం ఎయిర్ ఇండియా దాదాపు 190 విమానాలను నడుపుతున్నది. వారానికి సుమారు 8వేల సర్వీసులు నడుస్తున్నాయి గత ఆర్థిక సంవత్సరం ఇంచుమించుగా 62 మిలియన్ల ప్రయాణికులను తీసుకెళ్లింది.

# బంగారం, వెండి ధరలు: వారం రోజుల్లో ఊహించని మార్పు!



బంగారం వెండి ధరలు ఎప్పుడెలా ఉంటాయో ఊహకందకుండాపోయింది. ఈ రోజు తగ్గితే.. రేపు పెరిగిపోతున్న పరిస్థితులు వారం రోజుల్లో కళ్లకు కట్టినట్లు కనిపించాయి. ఈ కథనంలో ఏడు రోజుల్లో (మే 3 నుంచి మే 9 వరకు) పసిడి ధరలు ఎలా మారాయి. ప్రస్తుతం ఏ మార్క్ దగ్గర ఉన్నాయనే వివరాలు చూసేద్దాం. హైదరాబాద్, విజయవాడ నగర్లో మే 3న (ఆదివారం) 1,50,930 రూపాయల వద్ద ఉన్న తులం గోల్డ్ రేటు నేటికి (శనివారం) 1,52,350 రూపాయల వద్దకు చేరింది. అంటే వారం రోజుల్లో రూ.1420 పెరిగిందన్నమాట. 22 క్యారెట్ల ధర ఈ సమయంలోనే 1,38,350 రూపాయల దగ్గర నుంచి రూ.1,39,650 వద్దకు (రూ.1300 పెరిగింది) చేరింది. ఇక చెన్నై నగరంలో వారం రోజుల్లో బంగారం ధరలు భారీగానే పెరిగాయి. మే 3న రూ.152730 వద్ద ఉన్న 10 గ్రాముల గోల్డ్ రేటు..154370 రూపాయల వద్దకు చేరింది. 22 క్యారెట్ల తులం బంగారం రేటు 1,40,000 రూపాయల దగ్గర నుంచి 141500 రూపాయల వద్దకు చేరింది. దీన్ని బట్టి చూస్తే పసిడి ధర వారం రోజుల్లో ఎంతలా పెరిగిందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. దేశ రాజధాని నగరం ఢిల్లీలో 1,51,230 రూపాయల వద్ద ఉన్న 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రేటు 1,52,500 రూపాయల వద్దకు చేరింది. 22 క్యారెట్ల తులం గోల్డ్ రేటు రూ.1,38,500 నుంచి రూ.1,39,800 వద్దకు చేరింది.

### వెండి ధరలు

బంగారం ధరల మాదిరిగానే.. వెండి ధరలు కూడా అమాంతం పెరిగాయి. మే 3న రూ.2.70 లక్షల వద్ద ఉన్న కేజీ సిల్వర్ రేటు.. ఈ రోజు రూ.2.80 లక్షల వద్దకు చేరింది. దీన్నిబట్టి చూస్తే వెండి రేటు వారం రోజుల్లో రూ.10 వేలు పెరిగినట్లు స్పష్టమవుతోంది.

# గుజరాత్‌కు వరుసగా నాలుగో విజయం

**దంచికొట్టిన గిల్.. రషీద్ మ్యాజిక్**

**77 పరుగుల తేడాతో ఓడిన రాజస్థాన్**

**జైపూర్:** ప్లేఆఫ్స్ రేసు రసవత్తరంగా మారిన దశలో గుజరాత్ టైటాన్స్(జీటీ) టాప్ గేరులో దూసుకెళ్తోంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (44 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 84) మెరుపు బ్యాటింగ్‌కు తోడు రషీద్ ఖాన్ (4/33) స్పిన్ మ్యాజిక్ చేయడంతో వరుసగా నాలుగో మ్యాచ్‌లో గెలిచి రెండో ప్లేస్‌కు దూసుకొచ్చింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 77 రన్స్ తేడాతో రాజస్థాన్ రాయల్స్‌ను ఓడించింది. గిల్, సాయి సుదర్శన్ (36 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో55) ఫిఫ్టీలతో రాణించడంతో తొలుత జీటీ 20 ఓవర్లలో 229/4 స్కోరు చేసింది. ఛేజింగ్‌లో రాయల్స్ 16.3 ఓవర్లలో152కే ఆలౌటై ఐదో ఓటమి మూటగట్టుకుంది. జడేజా (25 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 38), వైభవ్ సూర్యవంశీ (16 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 36) పోరాడారు. హోల్డర్ (3/12) మూడు వికెట్లు తీశాడు. రషీద్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

### గిల్-సుదర్శన్ షో

ఓపెనర్లు సుదర్శన్- గిల్ పవర్ ప్లేలో దంచికొట్టడంతో టైటాన్స్‌కు అదిరిపోయే ఆరంభం దక్కింది. ఆర్చర్ వేసిన తొలి ఓవర్లోనే నాలుగు వైడ్స్, నోబాల్‌తో కలుపుకుని 18 రన్స్ టైటాన్స్ ఖాతాలో చేరాయి. బ్రిజేష్ రెండో ఓవర్లో ఫోర్, సిక్స్‌తో బాదుడుకు శ్రీకారం చుట్టిన సాయి.. ఆ వెంటనే దేశ్‌పాండేనూ అలాగే శిక్షించాడు. ఆర్చర్ ఐదో ఓవర్లో 4, 6, 4తో గిల్ సైతం జోరందుకోవడంతో పవర్ ప్లేలో జీటీ 82/0తో పటిష్ట స్థితిలో నిలిచింది. 30 బంతుల్లో సాయి అర్ధ శతకం పూర్తవగా.. పదోఓవర్లో సింగిల్‌తో గిల్ కూడా ఈ సీజన్‌లో నాలుగో హాఫ్ సెంచరీ సాధించాడు.



అయితే ఇదే ఓవర్లో సాయి.. లాంగాన్‌లో ఆర్చర్‌కు క్యాచ్ ఇవ్వడంతో 118 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. వన్‌డౌన్‌లో వచ్చి సిక్స్, ఫోర్‌తో టచ్‌లో కనిపించిన బట్లర్ (13)ను జడేజా వెనక్కి పంపాడు. అయినా సుందర్ (37 నాటౌట్)తో కలిసి మరింత ధాటిగా ఆడేందుకు యత్నించిన గిల్.. చూడచక్కని షాట్లతో అలరించినా బ్రిజేష్ 17వ ఓవర్లో తుషార్‌కు క్యాచ్ ఇవ్వడంతో టైటాన్స్ స్పీడు తగ్గింది. ఒకదశలో 250 ప్లస్ స్కోరు చేస్తుందనుకున్న ఆ జట్టు.. ఆఖర్లో తడబడ్డా సుందర్, తెవాటియా (14 నాటౌట్) మెరుపులతో భారీ లక్ష్యాన్ని ఉంచింది.

### తిప్పేసిన రషీద్

ఛేదనలో ఎప్పట్లాగే సూర్యవంశీ బ్యాట్‌కు పనిచెప్పడటంతో రాయల్స్ ఇన్నింగ్స్ ధాటిగానే మొదలైంది. ఆ సీజన్‌లో నాలుగోసారి సిక్స్‌తో ఖాతా తెరిచిన ఈ వండర్ కిడ్.. సిరాజ్, రబాడ బౌలింగ్‌లో భారీ షాట్లతో అలరించాడు. కానీ, మూడో ఓవర్లో సిరాజ్ వేసిన బౌన్సర్‌ను ఆడబోయి ఫైన్ లెగ్ వద్ద అర్షద్ చేతికి చిక్కాడు. ఆ వెంటనే రబాడ.. స్టాండిన్ కెప్టెన్ జైస్వాల్ (3)ను ఔట్ చేయగా హెట్‌మయర్ (6) సైతం నిరాశపరిచాడు. జురెల్ (24).. సిరాజ్ ఐదో ఓవర్లో 6, 4, 6, 6తో 22 రన్స్ రాబట్టడంతో ఆ జట్టు ఛేదన దిశగా సాగుతున్నట్టే కనిపించింది. కానీ 8వ ఓవర్లో బౌలింగ్‌కు దిగిన రషీద్ మ్యాచ్‌ను వన్‌సైడ్ చేసేశాడు. జురెల్‌తో పాటు హార్డ్ హిట్టర్ ఫెరీరా (4)నూ క్లీన్‌బౌల్డ్ చేసి రాయల్స్ ఆశలపై నీళ్లు చల్లాడు. తన తర్వాతి ఓవర్లో శుభం దూబె (15)ను కూడా బౌల్డ్ చేసిన రషీద్.. ఒంటరిపోరాటం చేస్తున్న జడేజాను ఏడో వికెట్‌గా ఎల్బీ చేయడంతో రాయల్స్ ఓటమి ఖాయమైంది. హోల్డర్ మిగిలిన ముగ్గురి పని పట్టాడు.

### వండర్ కిడ్ ఏ 100 సిక్సర్లు

టీ20 క్రికెట్‌లో వేగంగా 100 సిక్సర్లు కొట్టిన ప్లేయర్‌గా, ఈ ఘనత సాధించిన పిన్న వయస్కుడిగా 15 ఏళ్ల సూర్యవంశీ రికార్డుకెక్కాడు. 515 బంతుల్లో అతను ఈ మార్కు అందుకొని కరణ్‌బీర్ సింగ్ (813 బంతులు) రికార్డు బ్రేక్ చేశాడు.

### సంక్షిప్త స్కోర్లు

గుజరాత్: 20 ఓవర్లలో 229/4 (గిల్ 84, సుదర్శన్ 55, బ్రిజేష్ 2/47, యశ్‌రాజ్ 1/37);
రాజస్థాన్: 16.3 ఓవర్లలో152 ఆలౌట్ (జడేజా 38, సూర్యవంశీ 36, రషీద్ 4/33)

## పాక్ ప్లేయింగ్ ఎలెవన్‌లో భారత జట్టు

**బ్రాడ్‌కాస్టర్ ఘోర తప్పిదంతో నవ్వుల పాలు**

**ఢాకా:** పాకిస్థాన్, బంగ్లాదేశ్ తొలి టెస్టు సందర్భంగా మ్యాచ్‌ను ప్రత్యక్ష ప్రసారం చేస్తున్న 'ఫాక్స్ 501 హెచ్‌డీ' చానల్ ఘోర తప్పిదం చేసి నవ్వులపాలైంది. రెండో రోజు ఆట ప్రారంభమవగానే పాక్ తుది జట్టు స్థానంలో రోహిత్ శర్మ సారథ్యంలోని భారత జట్టు ఆటగాళ్ల పేర్లను చూపించింది. అందులో ఇంకా టెస్టు అరంగేట్రం చేయని తిలక్, శివం దూబె పేర్లు కూడా ఉండటంతో నెటిజన్లు సదరు చానెల్‌ను ఓ ఆటాడుకున్నారు. ఈ మ్యాచ్‌లో బంగా తొలి ఇన్నింగ్స్‌లో 413 పరుగులకు ఆలౌటైంది. తర్వాత పాక్ 179/1తో రెండో రోజు ముగించింది.




# స్పోర్ట్స్

## బరువు పెరిగి పరువు తీశావు..

## పారిస్ ఒలింపిక్స్‌లో పతకం పోగొట్టావు


**సంచలన ఆరోపణలతో స్టార్ రెజ్లర్ వినేశ్‌కు రెజ్లింగ్ సమాఖ్య షోకాజ్**

**6 నెలల నోటీసు ఇవ్వలేదని ఫొగాట్ రీఎంట్రీకి మోకాలడ్డు**

**జూన్ 26 వరకు దేశీయ టోర్నీల్లో పోటీ పడకుండా నిషేధం**



**న్యూఢిల్లీ:** లాస్ ఏంజెల్స్ 2028 ఒలింపిక్స్‌పై ఫోకస్ పెట్టి తిరిగి మ్యాట్‌పైకి రావాలని నిర్ణయించిన భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) షాకిచ్చింది. అంతర్జాతీయ రెజ్లింగ్ సమాఖ్య (యూడబ్ల్యూడబ్ల్యూ) నిబంధనల ప్రకారం రిటైర్మెంట్ నుంచి తిరిగి వచ్చే అథ్లెట్లు పూర్తి చేయాల్సిన ఆరు నెలల నోటీసు గడువును పాటించనందున జూన్ 26 వరకు ఆమెను దేశీయ పోటీల్లో పాల్గొనకుండా అనర్హురాలిగా ప్రకటించింది. అంతేకాకుండా క్రమశిక్షణా రాహిత్యం, డోపింగ్ నిబంధనల ఉల్లంఘన ఆరోపణల కింద ఆమెకు 15 పేజీల షోకాజ్ నోటీసు జారీ చేసింది. దాంతో యూపీలోని గొండాలో ఆదివారం మొదలయ్యే నేషనల్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నీలో ఆడే అవకాశాన్ని ఫొగాట్ కోల్పోయింది. ఇక, వినేశ్‌కు ఇచ్చిన నోటీసులో డబ్ల్యూఎఫ్ఐ సంచలన ఆరోపణలు చేసింది. 2024 పారిస్ ఒలింపిక్స్ ఫైనల్లో బరువు పెరగడం వల్ల అనర్హతకు గురై భారత రెజ్లింగ్ ప్రతిష్టకు వినేశ్ నష్టం కలిగించిందని ఆరోపించింది. ఆ మెగా ఈవెంట్‌లో భారత్ గెలవాల్సిన పతకం ఆమె నిర్లక్ష్యం కారణంగా కోల్పోయిందని పేర్కొంది. నిబంధనలకు విరుద్ధంగా 2024 మార్చిలో నిర్వహించిన ట్రయల్స్‌లో ఒకేసారి రెండు వెయిట్ కేటగిరీల్లో పోటీ పడటం, రెండు సార్లు డోపింగ్ పరీక్షలకు అందుబాటులో లేకపోవడం (2024 సెప్టెంబర్ 25, 2025 డిసెంబర్ 18) వంటి అంశాలను కూడా ప్రస్తావించింది. గతంలో బరువు నిర్వహణలో విఫలమైన ఇతర రెజ్లర్లపై కూడా తాము చర్యలు తీసుకున్నామని, వినేశ్ విషయంలోనూ నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించబోమని డబ్ల్యూఎఫ్ఐ స్పష్టం చేసింది. వినేశ్ 2024 డిసెంబర్ 14న తాను ఆగస్టు 2025 వరకు విరామంలో ఉంటానని తెలిపినప్పటికీ, నిబంధనల ప్రకారం రీఎంట్రీకి కనీసం ఆరు నెలల ముందుగా అధికారికంగా నోటీసు ఇవ్వాల్సి ఉంటుందని రెజ్లింగ్ సమాఖ్య స్పష్టం చేసింది. ఈ ఆరోపణలపై వివరణ ఇచ్చేందుకు వినేశ్‌కు 14 రోజుల సమయం ఇచ్చింది. కాగా, షోకాజ్ నోటీసుపై పోరాటం చేస్తానని వినేశ్ సోషల్ మీడియా పోస్టులో తెలిపింది.



## రౌడీ గుండెలపై కాలు పెట్టిన కీర్తి సురేశ్.. విజయ్ బర్త్‌డే పోస్టర్!


విజయ్ దేవరకొండ నటిస్తున్న సినిమాల్లో రౌడీ జనార్దన్ కూడా ఒకటి. దిల్ రాజు నిర్మిస్తున్న ఈ చిత్రానికి రవి కిరణ్ కోలా దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన పోస్టర్, గ్లింప్స్‌కి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. విజయ్ బర్త్‌డే సందర్భంగా నేడు(మే 9) మరో కొత్త పోస్టర్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. గతంలో రిలీజ్ చేసిన పోస్టర్‌లో సీరియస్ లుక్‌లో కనిపించిన విజయ్.. కొత్త పోస్టర్ లవ్లీగా కనిపించాడు. 'ప్రపంచంతో పోరాడతాడు.. ప్రేమకు లొంగిపోతాడు' అంటూ కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు మేకర్స్. అందులో విజయ్ వర్షంలో తడుస్తూ, చేతిలో తుపాకీ పట్టుకొని కూర్చొని ఉండగా.. అతని గుండెలపై ఒక అమ్మాయి కాలు పెట్టినట్లు ఈ పోస్టర్ డిజైన్ చేశారు. ఇందులో విజయ్‌కు జోడీగా కీర్తి సురేశ్ నటిస్తున్నారు. తొలిసారి తూర్పుగోదావరి యాసలో విజయ్ మాట్లాడబోతున్నాడు. 80వ దశకం నేపథ్యంలో కథనం సాగుతుంది. ఈ ఏడాది చివరిలో ఈ చిత్రాన్ని విడుదల చేసే అవకాశం ఉంది.

## ఫుల్ స్వింగ్‌లో రవితేజ 'ఇరుముడి'.. షూటింగ్ చివరి దశకు చేరిన మాస్ మహారాజ మూవీ!




మాస్ మహారాజ రవితేజ హీరోగా తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం ఇరుముడి ప్రస్తుతం టాలీవుడ్‌లో మంచి హైప్‌ను క్రియేట్ చేస్తోంది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా మొదటి అనౌన్స్‌మెంట్ నుంచే ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తించింది. ముఖ్యంగా డివోషనల్ టచ్‌తో పాటు ఎమోషనల్ డ్రామాను కలగలిపిన కథాంశంతో ఈ సినిమా రాబోతుండటంతో అభిమానుల్లో అంచనాలు భారీగా పెరిగాయి. ఈ చిత్రంలో ప్రియా భవాని శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, రవితేజ గత చిత్రాలకు భిన్నంగా ఓ పవర్‌ఫుల్ మరియు భావోద్వేగభరిత పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. మాస్ ఎలిమెంట్స్‌తో పాటు బలమైన భావోద్వేగాలు కూడా సినిమాలో ప్రధాన ఆకర్షణగా ఉండబోతున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ శరవేగంగా కొనసాగుతుండగా, తాజాగా లభించిన సమాచారం ప్రకారం చిత్రీకరణ దాదాపు చివరి దశకు చేరుకుందని తెలుస్తోంది. ఇంకా సుమారు నెల రోజుల షూటింగ్ మాత్రమే మిగిలి ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. దీంతో మేకర్స్ ప్రస్తుతం ఫుల్ స్వింగ్‌లో పనులు పూర్తి చేసే దిశగా ముందుకెళ్తున్నారని తెలుస్తోంది. ఈ చిత్రానికి సంగీతాన్ని జీవి ప్రకాష్ కుమార్ అందిస్తున్నారు. ఇప్పటికే పలువురు భిన్నమైన ప్రాజెక్టులతో తన మార్క్ చూపించిన జీవి ప్రకాష్.. 'ఇరుముడి' కోసం కూడా ప్రత్యేకమైన మ్యూజిక్ వర్క్ చేస్తున్నారని సమాచారం. ముఖ్యంగా ఈ సినిమా కాన్సెప్ట్ పట్ల ఆయనే ఎంతో ఎగ్జైటెడ్‌గా ఉన్నారని టాలీవుడ్ సర్కిల్స్‌లో చర్చ నడుస్తోంది. భారీ నిర్మాణ విలువలతో మైత్రి మూవీ మేకర్స్ ఈ సినిమాను నిర్మిస్తోంది. ఇటీవల వరుస విజయాలతో టాప్ ప్రొడక్షన్ హౌస్‌గా నిలిచిన మైత్రి సంస్థ.. 'ఇరుముడి'ని కూడా అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. రవితేజ కెరీర్‌లో ఈ సినిమా ఒక ప్రత్యేకమైన మైలురాయిగా నిలిచే అవకాశాలు ఉన్నాయని అభిమానులు భావిస్తున్నారు. యాక్షన్, భక్తి, ఎమోషన్‌ల మేళవింపుతో రూపొందుతున్న ఈ చిత్రం విడుదలకు ముందే మంచి బజ్ సంపాదించుకోవడం విశేషం. అన్ని పనులు పూర్తి చేసిన తర్వాత ఈ సినిమాను అతి త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.

## సత్యదేవ్ 'రావు బహదూర్' విడుదల వాయిదా.. కొత్త డేట్ ఫిక్స్!




వెర్సటైల్ నటుడు సత్యదేవ్, విలక్షణ దర్శకుడు వెంకటేష్ మహా కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ సైకలాజికల్ డ్రామా 'రావు బహదూర్' విడుదల తేదీ మరోసారి మారింది. ఈ చిత్రాన్ని తొలుత జూన్ 5న విడుదల చేయాలని చిత్ర బృందం భావించినప్పటికీ, జూన్ 4న రామ్ చరణ్ నటిస్తున్న భారీ చిత్రం 'పెద్ది' విడుదల కానున్న నేపథ్యంలో బాక్సాఫీస్ వద్ద క్లాష్‌ను తప్పించడానికి మేకర్స్ వెనక్కి తగ్గారు. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రం జూలై 3, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. సూపర్ స్టార్ మహేష్ బాబు తన సొంత బ్యానర్ 'జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్' ద్వారా సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని 'కేరాఫ్ కంచరపాలెం' ఫేమ్ వెంకటేష్ మహా దర్శకత్వంతో పాటు కథ, స్క్రీన్‌ప్లే మరియు ఎడిటింగ్ బాధ్యతలను కూడా స్వయంగా నిర్వహిస్తున్నారు. సత్యదేవ్ సరసన దీపా థామస్ కథానాయికగా నటిస్తుండగా, వికాస్ ముప్పాల, బాల పరాశర్, ఆనంద్ భారతి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఒక పురాతన రాజవంశం, వారసత్వం మరియు రహస్యాల చుట్టూ తిరిగే గ్రిప్పింగ్ సైకలాజికల్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రంలో సత్యదేవ్ పవర్ ఫుల్ ఎల్డర్లీ లుక్‌లో కనిపించబోతున్నారు. 'అనుమానం పెనుభూతం' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే విడుదలైన పోస్టర్లు మరియు 'ఓ సుందరి' సాంగ్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచాయి.



## మంచులో మెరిసిన సమంత.. గ్లామర్‌తో పాటు తన ఆలోచనలతోనూ ఆకట్టుకున్న టాలీవుడ్ క్వీన్!

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు మరోసారి తన స్టన్నింగ్ లుక్స్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తున్నారు. ప్రముఖ మ్యాగజైన్ "ది నాడ్" మే 2026 ఎడిషన్ కోసం సమంత చేసిన లేటెస్ట్ ఫోటోషూట్ ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. గ్లామర్, ఎలిగెన్స్, స్టైల్ అన్నీ కలిసిన ఈ ఫోటోషూట్‌లో సమంత పూర్తిగా కొత్త అవతారంలో కనిపించి అభిమానులను ఫిదా చేస్తున్నారు. ఈ షూట్‌లో సమంత ధరించిన ప్రతి అవుట్‌ఫిట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్యంగా డీప్ నెక్ డిజైన్‌తో ఉన్న మెటాలిక్ మెష్ గౌన్‌లో ఆమె లుక్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయింది. మంచు నేపథ్యంతో చేసిన ఈ ఫోటోషూట్‌లో సమంత ఒక దేవకన్యలా కనిపించారని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. డ్రెస్‌కు జత చేసిన అద్దాల టాసెల్స్, స్టైలిష్ మేకోవర్ మొత్తం షూట్‌కు ఒక డ్రామాటిక్ టచ్ ఇచ్చాయి. ఇక మరో లుక్‌లో ఐవరీ కలర్ ముత్యాల డ్రెస్‌లో సమంత మరింత గ్రేస్‌ఫుల్‌గా మెరిసిపోయారు. ప్రత్యేకంగా చేత్తో కుట్టిన ముత్యాలతో డిజైన్ చేసిన ఈ అవుట్‌ఫిట్‌కు బుల్గారీ జ్యువెలరీ, రెనే కావిల్లా ఫుట్‌వేర్ జత కావడంతో ఆమె లుక్ మరింత రిచ్‌గా మారింది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతుండగా, ఫ్యాన్స్ "సామ్ అంటే స్టైల్‌కు మరో పేరు" అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. అయితే ఈ ఫోటోషూట్ కేవలం గ్లామర్‌కే పరిమితం కాలేదు. ఈ సందర్భంగా సమంత చేసిన వ్యాఖ్యలు కూడా ఆసక్తికరంగా మారాయి. "ఈ సినిమాలో హీరో ఎవరు?" అని అడిగితే.. "నేను ఇకపై అలాంటి సినిమాలు చేయడం లేదు" అంటూ సమంత కూల్‌గా సమాధానం ఇచ్చారు. తాను ఎంచుకునే సినిమాల్లో కథే అసలైన హీరో అని, నటుల కంటే కథకు ప్రాధాన్యత ఎక్కువగా ఉండాలని ఆమె స్పష్టం చేశారు. మహిళల భావోద్వేగాలు, ఆలోచనలకు ప్రతిబింబంగా ఉండే పాత్రలనే ఇప్పుడు ఎంపిక చేసుకుంటున్నానని సమంత వెల్లడించారు. సినిమా ప్రపంచంలో మార్పు రావాలంటే రిస్క్ తీసుకోవాల్సిందేనని ఆమె అభిప్రాయపడ్డారు. సమంత మాటలు ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.



## 'పని రాక్షసుడు' నాని.. 'ప్యారడైజ్' కోసం నేచురల్ స్టార్ పడుతున్న కష్టం ఇదే!

నాని.. ఈ పేరు ఇప్పుడు తెలుగు సినీ ఇండస్ట్రీలో ఒక బ్రాండ్‌గా మారిపోయింది. అసిస్టెంట్ డైరెక్టర్‌గా కెరీర్ ప్రారంభించిన ఆయన, తన టాలెంట్, కష్టంతో నేచురల్ స్టార్ స్థాయికి ఎదిగారు. ప్రతి పాత్ర కోసం పూర్తిస్థాయిలో సిద్ధమయ్యే నాని డెడికేషన్ గురించి ఇండస్ట్రీలో ప్రత్యేకంగా మాట్లాడుకుంటుంటారు. ఇప్పుడు ఆయన నటిస్తున్న అవైటెడ్ మూవీ ప్యారడైజ్ కోసం నాని పడుతున్న కష్టం గురించి ఆయన జిమ్ ట్రైనర్ విశ్వ భరత్ వెల్లడించిన విషయాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న విశ్వ భరత్.. నానితో తన ప్రయాణం ఎలా మొదలైందో చెప్పుకొచ్చాడు. హిట్ 2 సమయంలో నానితో పని చేయడం ప్రారంభించానని, అప్పటి నుంచి ఆయన డెడికేషన్‌ను దగ్గరగా చూస్తున్నానని వెల్లడించాడు. "నాని అన్న పని విషయంలో నిజంగానే రాక్షసుడు. సోషల్ మీడియాలో కొంతమంది ఆయనపై నెగెటివ్ కామెంట్లు చేస్తుంటే నాకు కోపం వస్తుంది. ఎందుకంటే ఆయన ఎంత కష్టపడతారో నేను దగ్గరగా చూస్తున్నాను" అని విశ్వ పేర్కొన్నాడు. ప్రస్తుతం 'ప్యారడైజ్' షూటింగ్ ఫుల్ స్వింగ్‌లో సాగుతోందని, ఆ సినిమా కోసం నాని తన శరీరాన్ని పూర్తిగా మార్చుకుంటున్నారని తెలిపాడు. "ఉదయం 5 గంటలకు లేచి, 6 గంటలకే సెట్స్‌లో ఉంటారు. సాయంత్రం 7 గంటల వరకు యాక్షన్ సీన్లు చేస్తూనే ఉంటారు. రోప్స్ కట్టుకుని చేసే యాక్షన్ సీక్వెన్స్‌ల వల్ల బాగా అలసిపోతారు. అయినా అక్కడితో ఆగరు" అని విశ్వ చెప్పాడు. షూటింగ్ ముగిసిన తర్వాత కూడా నాని విశ్రాంతి తీసుకోకుండా వర్కౌట్ కొనసాగిస్తారని వెల్లడించాడు. సాయంత్రం ఆయన అసిస్టెంట్ నుంచి నాకు కాల్ వస్తుంది. నాని అన్న 40 నిమిషాలు ఇంట్లో ఉంటారు.. వర్కౌట్ చేస్తారు అని చెప్తారు. అప్పటికే ఉదయం నుంచి షూటింగ్‌లో అలసిపోయి ఉన్నా, మరో 45 నిమిషాలు కచ్చితంగా జిమ్ చేస్తారు. ఇవాళ వదిలేద్దాం అని ఎప్పుడూ అనరు అంటూ నాని క్రమశిక్షణను ప్రశంసించాడు. నాని తన పాత్రల కోసం ఎంతగా కష్టపడతారో చెప్పేందుకు విశ్వ మరో ఉదాహరణ కూడా ఇచ్చాడు. జెర్సీ సినిమా కోసం నాని ప్రత్యేకంగా క్రికెట్ శిక్షణ తీసుకున్నారని గుర్తుచేశాడు. "ఆ సినిమాలో అర్జున్ పాత్ర కోసం ఆయన పూర్తిగా క్రికెటర్‌లా మారిపోయారు. ఆయన ఆట చూసి మాజీ భారత క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ కూడా మెచ్చుకున్నారు. 'నువ్వు నిజంగానే ప్రొఫెషనల్ క్రికెటర్‌లా ఆడావు' అని చెప్పారట" అని విశ్వ వెల్లడించాడు. ఇప్పుడు 'ప్యారడైజ్'లో జడల్ పాత్ర కోసం కూడా అదే స్థాయిలో కష్టపడుతున్నారని చెప్పాడు. విశ్వ చేసిన ఈ కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నాని అభిమానులు "ఇంత డెడికేషన్ ఉన్న హీరోకే విజయాలు వస్తాయి , నేచురల్ స్టార్ అంటే ఇదే" అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,